మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



డోర్ లాక్, వలసల వివరాలు సమగ్రంగా సేకరించాలి

'టెయిల్ ఎండ్' సమస్యలకు 'పత్తిపాక' పరిష్కారం

వచన కవిత్వానికి బాటలు వేసిన శిష్ట్లా...

లోపలి పేజీల్లో



సంపుటి 07, సంచిక: 354 | సోమవారం | 25-11-2024 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## నేడు ఢిల్లీకి సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీ వెళ్లనున్నారు. కాంగ్రెస్ అధిష్టానంతో సమావేశం అయ్యేందుకు రాజధానికి వెళుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాలపై అధిష్టానంతో చర్చించే అవకాశం ఉంది. ఉత్సవాలకు హాజరుకావాలని ఎఐసిసి పెద్దలను కోరనున్నట్లు సమాచారం. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు సభకు హాజరు కావాలని ఎఐసిసి అగ్ర నేత రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. అలాగే రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్‌ల పదవుల పంపిణీ, మంత్రివర్గ విస్తరణపై కూడా పార్టీ అధిష్టానంతో చర్చించనున్నట్లు సమాచారం. కాగా సోమవారం సాయంత్రం ఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కుమార్తె వివాహానికి సిఎం హాజరు కానున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వస్తారని సిఎంఒ వర్గాలు తెలిపాయి



జార్ఖండ్ సిఎంగా

## 28న హేమంత్ సోరెన్ ప్రమాణస్వీకారం

### మహారాష్ట్ర సిఎంపై కొనసాగుతున్న సందిగ్ధం

పదవిని ఆశిస్తున్న షిండే, ఫడ్నవీస్, అజిత్‌పవార్

02



పార్లమెంట్ శీతాకాల సమావేశాల ముందు ప్రభుత్వం ఆదివారం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశ దృశ్యం

## వాడీవేడిగా జరగనున్న శీతాకాల సమావేశాలు

- నేటి నుంచి పార్లమెంటు ఉభయ సభల భేటీ
- అదానీ, మణిపూర్ అంశాలపై చర్చకు విపక్షాల పట్టు
- వాటిపై నిర్ణయం బిఎసిలదే
- అఖిలపక్ష సమావేశంలో కేంద్ర పార్లమెంటరీ శాఖ మంత్రి కిరెణ్ రిజిజు
- ప్రస్తుత సమావేశంలో జమిలీ ఎన్నికల బిల్లు లేదు

**న్యూఢిల్లీ :** సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు శీతాకాల సమావేశాలు వాడివేడిగా జరగనున్నాయి. అదానీ గ్రూపుపై లంచం ఆరోపణలు, మణిపూర్ వ్యవహారాలపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. మహారాష్ట్ర ఎన్నికల్లో ఘనవిజయంతో అధికార ఎన్‌డిఎలో ఉత్సాహం నెలకొన్నప్పటికీ, జార్ఖండ్‌లో ఆశించినట్లుగా గెలవకపోవడం, అదానీ వ్యవహారం తెరపైకి రావడంతో శీతాకాల సమావేశాలలో అధికార పార్టీ ఇబ్బందులను ఎదుర్కోబోతుంది. పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఆదివారంనాడు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు, రాజ్యసభ పక్ష నేత, కేంద్ర మంత్రి జె.పి.నడ్డా తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ ఎంపిలు జైరామ్ రమేశ్, గౌరవ్ గొగొయ్, సిపిఐ ఎంపి పి.సందోశ్ కుమార్, ఇతర పార్టీల సభ్యులు టి.శివ, హరిసిమ్రత్ కౌర్ బాదల్, అనుప్రియా పటేల్ తదితరులు పాల్గొన్నారు. అదానీ అంశంపై శీతాకాల సమావేశాల చర్చ జరపాల్సిందేనని ప్రతిపక్షాలన్నీ ముక్తకంఠంతో అఖిలపక్ష సమావేశంలో డిమాండ్ చేశాయి. దీనిపై ఆయా సభల కార్యకలాపాల సలహా కమిటీ (బిఎసి)లు నిర్ణయం తీసుకుంటాయని అధికారపక్షం తెలిపింది. అఖిలపక్ష సమావేశం అనంతరం కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు మీడియాతో మాట్లాడుతూ తరువాయి 2లో

### రేపు సెంట్రల్ హాల్‌లో రాజ్యాంగ దినోత్సవ ప్రత్యేక కార్యక్రమం

భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదం తెలిపి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మంగళవారం నాడు పార్లమెంట్ పాతభవనంలోని సెంట్రల్ హాల్‌లో సంవిదాన్ సదన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేంద్ర పార్లమెంటరీ శాఖ మంత్రి కిరెణ్ రిజిజు తెలిపారు. దీనికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌కఢ్, ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రత్యేక నాణాన్ని, స్టాంప్‌ను విడుదల చేయనున్నారు. సంస్కృతం, మైథిలీ భాషలో రాజ్యాంగ పుస్తకాలను ఆవిష్కరిస్తారు. అంతే కాకుండా 'మేకింగ్ ఆఫ్ ద కాన్స్‌టిట్యూషన్ : ఎ గ్లిమ్సెస్', 'మేకింగ్ ఆఫ్ ద కాన్స్‌టిట్యూషన్ అండ్ ఇట్స్ గ్లోరియస్ జర్నీ' అనే రెండు పుస్తకాలను, రాజ్యాంగ చిత్రాలతో బుక్‌లెట్‌ను విడుదల చేస్తారు. అలాగే భారతదేశంలో, విదేశాలలో ఉండే ప్రజలు రాష్ట్రపతి ముర్ము తో కలిసి రాజ్యాంగ పీఠికను ఈ సందర్భంగా పఠిస్తారని కిరెణ్ రిజిజు తెలిపారు.

### గతంలో లాగా గొంతు నొక్కొద్దు

సిపిఐ ఎంపి సందోశ్ కుమార్



గతంలో మాదిరిగా పార్లమెంటు శీతాకాల సమావేశాలలో ప్రతిపక్షాల గొంతు నొక్కొద్దని, సామరస్య వాతావరణంలో సభను నడపాలని అఖిలపక్ష సమావేశంలో సిపిఐ రాజ్యసభ పక్ష నేత పి.సందోశ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. తాజాగా లంచాల ఆరోపణల నేపథ్యంలో అదానీ గ్రూప్ వ్యవహారాలపై జెపిసి వేయాలని, మణిపూర్ సమస్య శాశ్వత పరిష్కారం కోసం పార్లమెంటులో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లు సహా, ఇతర బిల్లులను హడావుడిగా ప్రవేశపెట్టవద్దని సూచించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదలపై సభలో చర్చించాలన్నారు.

## పొరపాటుకాదు.. ఉద్దేశపూర్వకంగానే..

### అదానీ మోసంపై అమెరికా కోర్టుల్లో వెలుగు చూస్తున్న నిజాలు




**న్యూయార్క్:** భారత బిలియనీర్ గౌతం అదానీ ఉద్దేశపూర్వకంగానే మోసం చేశారని అమెరికా కోర్టులో దాఖలైన పిటిషన్‌లలో వివరాలు వెల్లడిస్తున్నాయి. యుఎస్ ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సిపిఎ) నిబంధనలను అతిక్రమించడంలో అదానీ పొరపాటు పడలేదనీ, అన్నీ తెలిసే మోసానికి పాల్పడ్డాడని కోర్ట్ ఫర్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్ కోర్టులో యుఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ పిటిషన్ దాఖలు చేసిన పిటిషన్‌లో ఆరోపణలు ఉన్నాయి. అమెరికా నిఘా సంస్థ ఎఫ్‌బిఐ కూడా ఇలాంటి అభియోగాలనే మోపింది. మొత్తం మీద అదానీ లంచాల కుంభకోణంలో తవ్వే కొద్ది కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అదానీ కంపెనీలో టోటల్ ఎనర్జీ పెట్టుబడుల వ్యవహారంపై కూడా పెద్ద చర్చ కొనసాగుతోంది. గౌతమ్ అదానీ, సాగర్ అదానీ కలిసి, భారతదేశంలోని అతిపెద్ద సోలార్ పార్క్‌లో కొంత భాగాన్ని ఫ్రాన్స్‌కు చెందిన టోటల్ ఎనర్జీ సంస్థకు విక్రయించిన సంగతి తెలిసిందే. పెట్టుబడుల్లో తరువాయి 2లో

### తాజా అభియోగాలను విచారించాలి

సుప్రీం కోర్టులో అభ్యర్థన దాఖలు

**న్యూఢిల్లీ :** పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ అమెరికాలో ఎదుర్కొంటున్న నేరారోపణలపై విచారణ చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో తాజాగా అభ్యర్థన దాఖలైంది. ఈ మేరకు న్యాయవాది విశాల్ తివారి ఇంటర్‌లాక్యుటరీ అప్లికేషన్‌ను దాఖలు చేశారు. అదానీ – హిండెన్‌బర్గ్ అంశంపై దాఖలైన బ్యాచ్ పిటిషన్‌లతో పాటు దీనిని చేపట్టాలని కోరారు. తాజా అభ్యర్థనలో అదానీపై ఆరోపణలు గంభీరమైనవని, దానిపై భారత అధికార వ్యవస్థలు దర్యాప్తు చేయాలని కోరారు. ' షార్ట్ సెల్లింగ్స్ అభియోగాలపై సెబీ దర్యాప్తు కొనసాగుతుంది. విదేశీ సంస్థ ఆరోపణలకు దాంతో సంబంధం ఉన్నా లేకున్నప్పటికీ సెబీ దర్యాప్తులో ఆ అంశంపై స్పష్టతనివ్వడం ద్వారా మదుపరుల విశ్వాసం సడలకుండా చూడాలని' పేర్కొన్నారు.

అదానీ అవినీతితో ప్రజలకు నష్టం : నారాయణ 03

## ప్రజాపాలనను ప్రతిబింబించేలా 9 రోజులు వేడుకలు



- వరుసగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- గ్రామాల్లో సిఎం కప్ పోటీలు
- పాఠశాలలు, కాలేజీల్లో వ్యాసరచన పోటీలు

ప్రజాపక్షం / హైదరాబాద్

ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు జరిగే వేడుకల ఏర్పాట్లలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే ఈ వేడుకల్లో అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం ఈ మేరకు శాఖలవారీగా ఒకటో తేదీ నుంచి వరుసగా నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో కొత్త ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవనాలకు శంఖుస్థాపన నిర్వహిస్తారు. ఇప్పటికే 28 నియోజకవర్గాల్లో ఈ భవనాల పనులు మొదలయ్యాయి. మరో 26 నియోజకవర్గాల పరిధిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభుత్వం ఇటీవలే మంజూరు చేసింది. ప్రజా పాలన విజయోత్సవాల్లో వీటికి శంకుస్థాపన చేస్తారు. ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో సిఎం కప్ పోటీలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా స్పోర్ట్స్‌అథారిటీ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలను నిర్వహిస్తుంది. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 16 కొత్త నర్సింగ్ కాలేజీలతో పాటు 28 పారా మెడికల్ కాలేజీలను నెలకొల్పుతారు. వీటితో పాటు కొత్తగా 213 అంబులెన్స్ వాహనాలు అందుబాటులోకి తీసుకు వస్తారు. మరోవైపు ట్రాన్స్‌జెండర్లకు వైద్య సేవలు అందించేందుకు జిల్లాకో ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను ఏర్పాటు చేయనుంది. హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ సేవలను నియంత్రించేందుకు ట్రాన్స్‌జెండర్ల సేవలను వినియోగించుకుంటామని, ఆసక్తి ఉన్న వారికి శిక్షణను ఇచ్చి ట్రాఫిక్ వలంటీర్లుగా నియమిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. విజయోత్సవాల్లో భాగంగా ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ వాలంటీర్లుగా నియమిస్తారు. హైదరాబాద్ నగరంలో వివిధ తరువాయి 12లో



## కల్లాలకు మంత్రులు

### ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు

### ఇప్పటివరకు 21.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాపక్షం /హైదరాబాద్

రాష్ట్ర మంత్రులు రైతుల కల్లాల బాట పట్టారు. వరి కోతలు ఊపందుకోవడంతో ధాన్యం కొనుగోలు సెంటర్లన్నీ రైతులతో కిటకిటలాడుతున్నాయి. రైతులు ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లను ఆరబోసుకుని, అవి ఎండిన తర్వాత శుభ్రపర్చుకుని అక్కడికక్కడే అమ్ముకుంటున్నారు. దీంతో ధాన్యం కొనుగోలు సెంటర్లలో రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా మంత్రులు అకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికే గత వారంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించడంతో పాటు అధికారులకు దిశా నిర్ధేశనం చేశారు. అంతకు ముందు మంత్రి పొన్నంప్రభాకర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ ఇద్దరు మంత్రుల పర్యటన ముగిసిన వెంటనే పౌరసరఫరాల శాఖమంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాల బాట పట్టారు. ఆదివారం ఆయన నల్లగొండ జిల్లాలో పలు ధాన్యం కొనుగోలు తరువాయి 2లో

## రైతులకు ఇబ్బంది వస్తే.. న్యాయం జరిగే వరకూ పోరాడుతా

### అన్నదాతలు ఆర్థికంగా ఎదగాలి : కూనంనేని



ప్రజాపక్షం/సుజాతనగర్

రైతులకు ఇబ్బంది వస్తే న్యాయం జరిగే వరకూ పోరాడుతానని, రైతులు ఆర్థికంగా ఎదగాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాత నగర్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కేంద్రానికి తీసుకు వచ్చేటప్పుడు నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం తీసుకురావాలన్నారు. ప్రభుత్వం సన్నధాన్యానికి రూ.500లు బోనస్ అందిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో మాఫీ కాని అర్హులైన రైతులకు త్వరలో రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎకరానికి తరువాయి 2లో

## 26న ఫార్మాసిస్ట్ పోస్టులకు జాబ్-మేళా

### 100 పోస్టులు భర్తీ

ప్రజాపక్షం /హైదరాబాద్

ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో , అపోలో ఫార్మసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26 న జాబ్ మేళా నిర్వహించనున్నది. ఓయు ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసీలో 100 ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మాసిస్ట్‌ల పోస్టులను భర్తీ చేయనున్నారు. డీ ఫారసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ చేసిన 18 నుండి 35 సంవత్సరాల వయసు వారికి అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో తెలిపింది. రూ.14 ,800 నుండి రూ.25 వేల వరకు వేతనం లభిస్తుందని, వివరాలకు టి. రఘుపతి, హెచ్ ఆర్ ఫోన్.82476 56356 ను సంప్రదించాలని సూచించింది.

## యుపిలో మసీదు సర్వే హింసాత్మకం ముగ్గురు మృతి

**లక్నో :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంభాల్‌లో మొఘల్ కాలం నాటి మసీదును ఆదివారం రెండవసారి సర్వే చేస్తుండగా తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సందర్భంగా భద్రత సిబ్బంది, నిరసనకారులకు మధ్య ఘర్షణలో ముగ్గురు మరణించారు. రాళ్ళు రువ్వేందుకు, వాహనాలను తగులబెట్టేందుకు నిరసనకారులు ప్రయత్నించగా, వారిని చెదరగొట్టేందుకు బాష్పవాయువును, లాఠీ చార్జ్‌ను ప్రయోగించినట్లు పోలీసులు తెలిపారు. జామా మసీదు నిర్మించిన ప్రదేశంలో హరిహర దేవాలయం ఉండేదని వేసిన కేసులో స్థానిక కోర్టు సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం జామా మసీదు సర్వే చేసినప్పటి నుంచి సంభాల్‌లో ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఆదివారం ఉదయం తిరిగి రెండవసారి సర్వేకు వెళ్లడంతో అవి పతాక స్థాయికి చేరి హింసాత్మక ఘటనలకు దారి తీసాయి. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు మహిళలు సహా పది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఒక అధికారి వెల్లడించారు. హింసకు పాల్పడిన నిందితులపై జాతీయ భద్రతా చట్టం కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

**కావాలనే ఉదయం పూట సర్వే : అఖిలేశ్ యాదవ్**

ఉత్తర్‌ప్రదేశ్ ఉప ఎన్నికల్లో జరిగిన అవకతవకల నుంచి దృష్టి మళ్ళించేందుకే సంభాల్ జిల్లాలో మసీదు సర్వే పేరుతో బిజెపి ప్రభుత్వం , అధికార యంత్రాంగం హింసకు తెరలేపిందని ఎస్‌పి అధ్యక్షుడు, యుపి ప్రతిపక్ష నేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. ఒకసారి మసీదు సర్వే చేయించిన తరువాత, రెండసారి సర్వే చేయించాల్సిన అవసరం ఎందుకు ఏర్పడిందని, అదీ ఎలాంటి ఏర్పాట్లు లేకుండా ఉదయం పూట ఎందుకు చేపట్టారని నిలదీశారు. ఉప ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ బూత్ క్యాప్చరింగ్ జరిగిందని, దీనిపై ఎన్నికల కమిషన్ స్పందించి ఇవిఎంలపై ఎన్నికల కమిషన్ ఫోరెన్సిక్ పరీక్షలు జరిపిస్తే స్పష్టత వస్తుందన్నారు. ఉద్దేశ్యపూర్వకంగానే ఉపఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజే మసీదు సర్వేకు బృందాన్ని పంపించారని, దీంతో గందరగోళం సృష్టించి ఉప ఎన్నికపై చర్చ జరగకుండా చూడాలని భావించారని అఖిలేశ్ అన్నారు.

## మహిళా, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

### ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో పశ్యపద్మ

ప్రజాపక్షం/హైదరాబాద్



కేంద్ర పాలకుల మహిళా, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఘటించాలని ఇందుకు భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) నాయకులుగా మరిన్ని సమరశీల ఉద్యమాలకు సన్నాద్ధం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు ,ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు సీనియర్ నాయకురాలు పశ్యపద్మ పిలుపునిచ్చారు. భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం హైదరాబాద్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగాయి. ఈ సమావేశానికి ముందు పశ్యపద్మ జెండాను ఆవిష్కరించి సమావేశాన్ని ప్రారంభించారు.ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అధ్యక్షతన జరిగిన నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు సీనియర్ నాయకులు పశ్యపద్మ, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేమ్ పావని, తరువాయి 2లో

# ఏటా 300 బిలియన్లు చాలవు: 1.3 ట్రిలియన్లు ఇవ్వండి

## కాప్–29 సదస్సులో భారత్ సహా పలు దేశాల డిమాండ్

**బాకు :** వాతావరణ మార్పుల సమస్య పరిష్కారానికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంపన్న దేశాలు పదేళ్ళ పాటు ప్రతి సంవత్సరం 300 బిలియన్ డాలర్లు నిధులు సమకూర్చాలని అజర్‌బైజాన్ దేశ రాజధాని బాకు నగరంలో కాప్–29 సదస్సు చేసిన తీర్మానంపై భారత్ సహా పలు దేశాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. వాతావరణ సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు 1.3 ట్రిలియన్ డాలర్లు సహాయం అందించాలని కోరాయి. వాతావరణంలో వస్తున్న మార్పుల సమస్య పరిష్కారానికి ఏటా ఐక్యరాజ్యసమితి అధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో భాగంగా నవంబరు 11 నుండి బాకులో జరుగుతున్న కాప్–29 సదస్సు ఆమోదించిన కీలక తీర్మానంపై మెజారిటీ దేశాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతో దీనిపై చర్చించేందుకు సదస్సును మరో రెండు రోజులు పొడిగించారు. దీంతో ఆదివారం నాడు కూడా ఈ చర్చలు కొనసాగాయి. ఐతే, భారత్, చైనా దేశాలను కూడా అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలోనే ఐక్యరాజ్యసమితి ఉంచడంవల్ల ఈ రెండు దేశాలూ కూడా పేద దేశాలకు ఎలాంటి ధన సహాయం చేసే అవసరం ఉండదనీ, వాతావరణలోకి ప్రవేశించే కలుషిత వాయువుల నియంత్రణలో వారికి ఎలాంటి బాధ్యతలూ ఉండదని పాశ్చాత్య మీడియా విమర్శించింది. చైనా అందుకు సిద్ధంగా లేనప్పటికీ సాంకేతికంగా వాతావరణ సహాయం పొందడానికి ఈ రెండు దేశాలు అర్హత పొందాయని పేర్కొంది.






కాప్–29 సదస్సు తీర్మానం ఆమోదానికి ముందు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి అవకాశం ఇవ్వలేదని కాప్–29 సదస్సులో పాల్గొన్న భారత ప్రతినిధులు నిరసన తెలియజేశారు. ఆఫ్రికన్ గ్రూప్ ఆఫ్ నెగోషియేటర్స్ కూడా ఈ తీర్మానాన్ని తప్పుపట్టారు. ఈ నిధుల కేటాయింపు చేయడంలో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగిందనీ, పైగా కేటాయించిన ఈ మొత్తం కూడా చాలా చాలా తక్కువ అనీ (టూ లేట్ అండ్ టూ లిటిల్) విమర్శించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఏటా ఎదుర్కొంటున్న వాతావరణ బీభత్సం, ఎదుర్కొంటున్న సవాళ్ళతో పోలిస్తే 2035 వరకూ ఏటా కేటాయించే ఈ 300 బిలియన్ డాలర్ల మొత్తం చాలా అల్పమైనదని భారత ప్రతినిధి చాందినీ రైనా విమర్శించారు.




ఇదిలా ఉండగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కాప్–29 సదస్సులో చేసిన 300 బిలియన్ డాలర్ల వాతావరణ నిధి తీర్మానం ఎంతో గొప్పగా ఉందని ప్రశంసించారు. ఇదిలా ఉండగా 2015లో ఫ్రాన్స్ రాజధాని పారిస్ కాప్ సదస్సులో ఆమోదించిన 1.5 డిగ్రీల సెల్సియస్ స్థాయికి ప్రపంచ ఉష్ణోగ్రతలను తగ్గించే లక్ష్యం ఈనాటికీ సాంకేతకంగా చూసినప్పుడు సాధ్యమేనని, ఐతే రాబోయే పదేళ్ళలో మాత్రం వాతావరణంలో కలుషిత వాయువులను గణనీయంగా తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని ఐక్యరాజ్యసమితి పేర్కొంది.ఆనాడు పారిస్ ఒప్పందంపై 200 దేశాలు సంతకాలు చేశాయి. పరిస్థితులు ఇలాగే ఉంటే ఈ శతాబ్దాంతానికి వాతావరణంలో ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీల సెల్సియస్‌కు పెరుగుతాయని తాజా అంచనాలు చెబుతున్నాయి. కాగా కాప్–29 సదస్సులో పాల్గొన్న ఇద్దరు అఫ్గానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధులు అందరి దృష్టినీ ఆకర్షించారు. అనేక కారణాలవల్ల ఈ ప్రతినిధులను కాప్ సదస్సులో పాల్గొనేందుకు అనుమతించారు. వాతావరణపరంగా చాలా తీవ్రంగా నష్టపోయిన దేశం అఫ్గానిస్థాన్. తమ దేశానికి స్తంభింపజేసిన నిధులను పునరుద్ధరించాలని వారు కోరారు.

# ట్రంప్ నివాసానికి రోబో డాగ్స్ గస్తీ

## సోషల్ మీడియాలో వైరల్



**పామ్‌బీచ్ :** అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్‌కు ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లో ఉన్న మార్ ఎ లాగో క్లబ్ నివాసానికి సీక్రెస్ సర్వీసెస్ రోబో డాగ్స్‌ను భద్రతకు ఉపయోగించడం ప్రారంభించాయి. క్రిమినల్ ఇన్వెస్టిగేషన్‌లో ఈ రోబో డాగ్స్ కీలకపాత్ర వహిస్తాయని సీక్రెస్ సర్వీసెస్ అధికార ప్రతినిధి బాబ్ పేజ్ చెప్పారు. అడ్వాన్స్‌డ్ సెన్సార్స్,సర్వేలెన్స్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీతో రక్షణ కార్యకలాపాలను ఈ రోబో డాగ్స్ నిర్వహిస్తాయి. వివిధ అంతర్జాతీయ సదస్సుల ప్రాంగణాలవద్ద కూడా వీటిని ఉపయోగిస్తామని ఆయన అన్నారు. 'ఆస్ట్రో' (అటానమస్ సిస్టమ్స్ అండ్ టెక్నికల్ రోబోటిక్ ఆపరేషన్స్)ప్రోగ్రామ్ కింద సీక్రెట్ సర్వీసెస్ ఈ రోబో డాగ్స్‌ను వినియోగంలోకి తీసుకువచ్చాయి. తమ భద్రతా బృందంలో భద్రతకు ఉపయోగించేందుకు కొత్తగా రోబో డాగ్స్‌ను చేర్చుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ డాగ్స్ సాంకేతిక పరిజ్ఞానం పర్యవేక్షణలో నిరంతరం తిరుగుతూ కాపాలా కాస్తాయి. మసాచ్యుసెట్స్ కేంద్రంగా పనిచేసే బోట్సన్ డైనమిక్స్ ఈ రోబో డాగ్స్‌ను తయారు చేసింది. ఈ రోబో డాగ్స్ కాపలాకాస్తున్న తీరు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ రోబో డాగ్స్‌పైన "డు నాట్ పెట్" అని రాసి ఉన్న అక్షరాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఇవి పెంపుడు జంతువులు కాదనీ,ఇవి నిజమైన కుక్కలు కాదనీ గస్తీకోసం ఉపయోగించే వైల్డ్ యానిమల్స్ అనీ సీక్రెట్ సర్వీసెస్ పేర్కొంది. సీక్రెట్ సర్వీసెస్ టెక్నికల్ డివిజన్ ఈ డాగ్స్‌పై యుఎస్ఎస్ఎస్ టిఎస్‌డి అని ముద్రలు వేశాయి.

# రుమేనియాలో అధ్యక్ష ఎన్నికలు



**బుఖారెస్ట్ :** రుమేనియాలో ఆదివారంనాడు అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడికి పరిమిత అధికారాలే ఉంటాయి. ఉక్రేన్, హంగేరీ, సెర్బియా, బల్గేరియా దేశాలమధ్య ఉన్న రుమేనియా బహుళపార్టీల వ్యవస్థ గల ప్రజాస్వామ్యదేశం. రుమేనియా పార్లమెంటులో ఎగువసభ సెనేట్, దిగువసభ ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్ ఉన్నాయి. 2014 నుండి క్లాష్ లోహాన్నిస్ దేశాధ్యక్షుడుగా ఉన్నారు. కొనసాగుతున్నారు. దేశంలో అతిపెద్ద సోషల్ డెమోక్రటిక్‌పార్టీ. సోషల్ డెమోక్రటిక్‌పార్టీ, సెంటర్ రైట్ లిబరల్‌పార్టీలు కలిసి కూటమి ప్రభుత్వం నడిపిస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటికి రెండుసార్లు కనీస వేతనాలు పెన్షన్లు పెంచినప్పటికీ పరిస్థితుల్లో మార్పు రావడంలేద. ద్రవ్యోల్బణం విపరీతంగా పెరుగుతున్నది. ఈ పార్టీ నాయకుడు మార్సెల్ సియోలాక్యూ(56) గత ఏడాదిలో ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. 30.70 లక్షలమంది రిజిస్టర్డ్ ఓటర్లు ఈ పోలింగ్‌లో పాల్గొన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో మితవాదపార్టీకి చెందిన జార్జి సిమియోన్ (38) గెలిచే అవకాశాలున్నాయని అందరూ చెబుతున్నారు. అతడిని అడ్డుకునేందుకు సోషల్ డెమోక్రాట్లు ప్రయత్నిస్తున్నారు. రుమేనియా ప్రస్తుత ప్రభుత్వం యుద్ధంలో ఉక్రేన్ వైఖరికే పూర్తి మద్దతు ఇస్తున్నది. ఐతే పెరుగుతున్న ధరలను ఓటర్లు ఈ ఎన్నికల్లో ప్రధానంగా దృష్టిలో పెట్టుకుని ఓట్లు వేసే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీలు మాత్రం కుటుంబ విలువలను సంరక్షిస్తామని ప్రచారం చేస్తున్నాయి.

# గాజాలో 35 మంది మృతి ఇజ్రాయెల్‌లో ర్యాలీ



**గాజా :** గాజాలో కొనసాగుతున్న దాడుల్లో ఆదివారం నాడు 35 మంది మరణించారు. 94 మంది గాయపడ్డారు. గాజాలో షుజాయే సిటీని ఖాళీ చేసి వెళ్ళిపోవాలని ఐడిఎఫ్ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఇజ్రాయెల్‌లో ప్రజలు నిరసన ప్రదర్శనలు ముమ్మరం చేశారు. ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడిలో ఒక మహిళా బందీ గాజాలో మరణించిందని హమాస్ ప్రకటించిన తర్వాత టెల్‌అవీవ్‌లో బందీల బంధువులు, ప్రజలు రోడ్లమీదకు వచ్చారు. బందీల విడుదల ఒప్పందమే ముఖ్యం తప్ప, యుద్ధం ముఖ్యం కాదంటూ నేతన్యాహూకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిపారు. దీంతో ఐడిఎఫ్ స్పందించి హమాస్ చేసిన ప్రకటన నిజమో కాదో నిర్ధారించే పనిలో ఉన్నామని ప్రకటించింది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అరెస్టు వారెంటు జారీ చేసిన తర్వాత నేతన్యాహూపై ఇజ్రాయెల్‌లో కూడా పాపులారిటీ తగ్గుతున్నది. కాగా లెబనాన్ రాజధాని బీరూట్‌లో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 20 మంది మరణించారు. 66 మంది గాయపడ్డారు.

**అరబ్ ఎమిరేట్స్‌లో హతుడైన ఇజ్రాయెలీ**

అరబ్ ఎమిరేట్స్‌లో జాడ తెలియకుండా పోయిన ఇజ్రాయెలీ–మోల్డోవన్ రబ్బీ మృతదేహమై తేలాడు. రబ్బీ హతుడయ్యాడని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం ప్రకటించింది. దీతో అతడి మృతదేహాన్ని అక్కడి నుండీ ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌కు తరలించారు. దీనిపై ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ తీవ్రంగా స్పందించారు. తీవ్రమైన యూదుమత ద్వేషం వేళ్ళూనుకుందని ఆయన విమర్శించారు. రబ్బీమృతికి కారకులైన వారిని వదిలిపెట్టబోమని, ఆ కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. రబ్బీ గురువారంనాడు అరబ్ ఎమిరేట్స్‌లో అదృశ్యమయ్యాడు.

# రష్యాపై బ్రిటన్ 'స్టార్మ్ షాడో మిస్సైల్' దాడి

## టాప్ జనరల్, 500 మంది కొరియా సైన్యం మృతి?






**లండన్ :** ఉక్రేన్ సైన్యం ఈనెల 20వ తేదీన ప్రయోగించిన బ్రిటన్‌కు చెందిన స్టార్మ్ షాడో మిస్సైల్స్ దాడిలో రష్యాకు చెందిన అగ్రశ్రేణి సైనిక జనరల్‌తోపాటు 500 మంది ఉత్తర కొరియా సైనికులు కూడా మరణించారని ఆదివారంనాడు ఒక బ్రిటన్ పత్రిక వెలువరించిన కథనం పేర్కొంది. ఐతే ఐదు రోజులు గడిచినప్పటికీ ఈ విషయాన్ని అటు ఉక్రేన్‌గానీ, ఇటు రష్యాగానీ బహిరంగ ప్రకటన చేయలేదు, ధృవీకరించలేదు. ఈ పత్రికా నివేదికను ఇండిపెండెంట్‌గా ఇంకా తనిఖీ చేయవలసి ఉంది. ఈ స్ట్రామ్ షాడో మిస్సైల్స్ 180 మైళ్ళ దూరం ప్రయాణించి శత్రుస్థావరాలను ధ్వంసం చేస్తాయి. దీన్నిబట్టిచూస్తే ఉక్రేన్ మొదటిసారి రష్యాలోని మారుమూల ఉన్న రక్షణ కేంద్రాలను దెబ్బతీసిందని నమ్మే పరిస్థితులు ఉన్నాయి. 500 మంది కొరియా సైనికులు మరణించడంపై కిమ్ కూడా స్పందించలేదు. ఈ వినాశకరమైన దాడిలో రష్యాకు చెందిన అగ్రశ్రేణి లెఫ్టినెంట్ జనరల్ వలేరీ సోలోడ్‌ఛుక్‌తోపాటు 18 మంది పుతిన్ అధికారులు కూడా మరణించారని పత్రిక పేర్కొంది. రష్యాలోని సుదూర ప్రాంతాలపైకి మొట్టమొదటిసారి బ్రిటన్‌కు చెందిన స్టార్మ్ షాడో క్షిపణులను ఉక్రేన్ ప్రయోగించింది. ప్రత్యేకించి పుతిన్ కమాండ్ పోస్టును, కుర్స్క్ రీజియన్ మార్యినోలోని టసరిస్ట్ ఎస్టేట్‌లో ఉన్న సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ స్టార్మ్ షాడో మిస్సైల్ దాడి జరిగినట్లు బ్రిటన్ పత్రిక పేర్కొంది. పుతిన్ అధీనంలో ఉన్న సదరన్, ఈస్టర్న్ మిలిటరీ డిస్ట్రిక్ట్స్‌లో ఉన్న అధికారులు దాడుల్లో మరణించారు! ఒక వేళ ఈ కథనాన్ని గనుక రష్యా ధృవీకరిస్తే ఉక్రేన్ యుద్ధం కొత్తరూపం తీసుకుంటుంది. రష్యాకు, ఉత్తర కొరియాకు చాలా తీవ్ర నష్టం జరిగితే ఉక్రేన్ పైచేయి సాధించినట్లు అవుతుంది. ఈ కారణంగానే పుతిన్ అత్యంత శక్తిమంతమైన ఓరెష్నిక్ క్షిపణులను ఉక్రేన్‌పైకి ప్రయోగిస్తున్నారన్న వార్తలు వస్తున్నాయి.

**పీస్ ఫార్ములా తయారుచేస్తున్నాం : జెలెన్‌స్కీ**

ఉక్రేన్–రష్యామధ్య ఒకవైపు యుద్ధంపెరుగుతున్న పరిస్థితులు కనిపిస్తుంటే ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాత్రం మరోసారి తాజాగా యుద్ధం ఇక ముగిసిపోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ దిశగా ఒక శాంతి ప్రణాళికను తమదేశం తయారు చేస్తోందని ఆయన అన్నారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపడితే దౌత్య మార్గాల్లోయుద్ధ పరిష్కారం జరుగుతుందని ఆయన మరోసారి ఆదివారంనాడు ఉద్ఘాటించారు. కుర్దిష్ ప్రాంతాన్ని ఉక్రేన్ ఖాళీ చేసి వెళ్ళిపోవాలని పుతిన్ కోరుకుంటున్నారని జెలెన్స్కీ అన్నారు. ఇంకోవైపు ఉక్రేన్ ఆక్రమించిన 45 శాతం భూభాగాన్ని రష్యా తిరిగి లాక్కుందని కూడా ఉక్రేన్ పేర్కొంది. రోజుకు 300 మీటర్ల వంతున రష్యా సైన్యం ఉక్రేన్ ఆక్రమిత ప్రాంతాలలోకి దూసుకువస్తోందని పేర్కొంది.

# న్యాయం జరిగే వరకు పోరాడుతా

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడి ఖర్చు పంట దిగుబడి వివరాలను రైతులును అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, ఎంపీడీవో భారతి, ఏవో నర్మదా, డిటి నాగరాజు, వెంకటేశ్వరరావు, మానిటరింగ్ ఆఫీసర్, జయశ్రీ రైస్ మిల్ యజమాని కొండూరు రాజేంద్రప్రసాద్, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఘటించాలి

(మొదటి పేజీ తరువాయి)

మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, కార్యనిర్వహక అధ్యక్షురాలు మంద సదాలక్ష్మి , ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి, ఎం.నళిని రెడ్డి, బండి జంగమ్మ, సహాయ కార్యదర్శులు ఫైమీద, లతాదేవి,కోశాధికారి జయలక్ష్మి , సీనియర్ నాయకురాలు పోటు కళావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశ్యపద్మ మాట్లాడుతూ మనువాద భావాలను వ్యాప్తితో భారత మహిళలను మధ్యయుగాల నాటి బూజుపట్టిన, కాలం చెల్లిన ఆలోచనల విషవలయంలోకి నెట్టడానికి ఆర్ఎస్ఎస్, బిజెపిలు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకుసన్నద్ధం కావాలన్నారు. బిల్కిస్‌బానోపై సామూహిక అత్యాచారం చేసిన దోషులను సన్మానించి పూలదండలతో ఊరేగించి బాధిత మహిళలు, వారి కుటుంబాల మనోధైర్యాన్ని దెబ్బతీయమేనని విమర్శించారు. మహిళలు ప్రతి రోజు అనేక రూపాలో అవమానాలకకు గురైవుతున్నా మహిళా చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు పూర్తి వైఫల్యం చెందారని అగ్రహాం వ్యక్తం చేశారు. మహిళా రక్షణ చట్టాలను సమవర్థవంతంగా అమలు చేయాలని పశ్యపద్మ డిమాండ్ చేశారు. మహిళలకు సమాన హక్కుల సాధన, సాధికారితకు నిరంతరం పోరాటాలుకొనసాగిస్తున్న భారత జాతీయ మహిళా సమాఖ్య న్యాయకత్వం మహిళాలోకానికి మార్గ దర్శకం కావాలన్నారు. ప్రేంపావని మాట్లాడుతూ శ్రామిక మహిళలు, మహిళా సమాఖ్య సంయుక్తంగా అనేక ఉద్యమాలు నిర్వహిస్తూ వారి జీవన స్థితిగతులు మెరుగుపర్చడానికి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. డాక్టర్ రంజని మాట్లాడుతూ చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో మంచి మార్పుకు మహిళగా, తల్లిగా, ధృడ సంకల్పంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నేదునూరి జ్యోతి మాట్లాడుతూ మహిళలపై రోజు రోజుకు పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకులుగా మరింత పెద్ద ఎత్తున ఉద్యమించి ఈ దాడులను అరికట్టడంతో పాటు బాధిత మహళలకు అండ నిలవ్వాలని పిలుపునిచ్చారు. మండ సదాలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అనేక హామీలు ఇచ్చిందని, బస్సుల్లో ఉచిత ప్రయాణం తప్ప ఏ ఒక్క హామీ చేయలేదన్నారు.తక్షణమే అన్నిహామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఛాయాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని కమిటీలు వేసినా పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు ఆగడం లేదని, వీటిని నివారించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిసెంబర్‌లో 6,7,8 తేదీల్లో ఢిల్లీలో భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ నిర్మాణ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. ఈ సభల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభా అధ్యక్షురాలు సృజన మాట్లాడుతూ మహిళలను సాధికారితకు పెద్ద ఎత్తున చర్యలు చేపడుతున్నామని ప్రభుత్వం ప్రకటనలే తప్ప ఆ దిశగా చేతలు ఉండడం లేదన్నారు. మహిళలను ఆర్థిక, సమాజికంగా విద్యపరంగా, వైద్య పరంగా ఆదుకునేందుకు పటిష్టమైన ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని కోరారు. అంతకు ముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా ఈ సమావేశంలో పాలొన్న రాష్ట్రంలోని33 ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లాల అధ్యక్షులు,కార్యదర్శులు వారి జిల్లాలకు సంబంధించిన కార్యక్రమాల నివేదికలను వివరించారు.

# 28న హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం

## మహారాష్ట్ర సిఎంపై ఇంకా సందిగ్ధం

**రాంచీ :** ఝార్ఖండ్ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ ఈనెల 28న ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆదివారం సాయంత్రం 'ఇండియా' కూటమి సమావేశం అనంతరం హేమంత్ సోరెన్ గవర్నర్ నివాసానికి వెళ్ళి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని తెలియజేశారు. కాగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని ఎవరు చేపడతారన్న విషయంపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. మహాయుతి కూటమిపార్టీలు ఇంకా ఈ విషయంపై ఎటూ తేల్చుకోలేదు. సి.ఎం పదవి తమకే కావాలని బిజెపి, శివసేన, ఎన్‌సిపి మూడూ భాగస్వామ్యపార్టీలు గట్టిగా పట్టుపడుతున్నాయి. సోమవారంనాడే ముఖ్యమంత్రి పదవీ ప్రమాణ స్వీకారం ఉంటుందని శివసేన నాయకుడు దీపక్ ఖేసర్కర్ చెప్పారు. ఝార్ఖండ్ ముఖ్యమంత్రి పదవి చేపట్టేందుకు వీలుగా హేమంత్ సోరెన్ తన అర్హత పత్రాలను గవర్నర్ సంతోష్ గంగ్వార్‌కు అందజేశారు. తొలుత సాయంత్రం నాలుగు గంటలకు 'ఇండియా' కూటమి భాగస్వామ్య పార్టీలు సమావేశమై హేమంత్ సోరెన్‌ను అధికార కూటమి నాయకుడుగా ఎన్నుకున్నాయి. సోరెన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. అంతకు ముందు ఆదివారం ఉదయం కూటమి భాగస్వామ్యపార్టీ నాయకులు మాట్లాడుతూ, జెఎంఎం నాయకుడు హేమంత్ సోరెన్‌నే తమ నాయకుడుగా తిరిగి ఎన్నుకుంటామని చెప్పారు.

ఐతే ఉపముఖ్యమంత్రి పదవి తమకు ఇవ్వాలని కాంగ్రెస్‌పార్టీ అడిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. కానీ ఈ విషయంపై ఇంకా ఎలాంటి స్పష్టతా లేదు. శనివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో జెఎంఎం సారథ్యంలో 'ఇండియా' కూటమి మొత్తం 56 స్థానాలు సంపాదించుకుంది. ఈ భాగస్వామ్య పార్టీలలో ఎక్కువ సీట్లు ఝార్ఖండ్ ముక్తిమోర్చాకే లభించాయి. ఝార్ఖండ్ అసెంబ్లీలో మొత్తం 81 స్థానాలు ఉన్నారు. మెజార్టీ మార్క్ కంటే 'ఇండియా' కూటమికి 15 సీట్లు ఎక్కువే వచ్చాయి. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బరెహైత్ నియోజకవర్గం నుండి పోటీ చేసి తన సమీప బిజెపి ప్రత్యర్థి తమ్మియేల్ హేంబ్రోమ్‌పై 39,791 మెజారిటీతో గెలిచారు. సోరెన్‌కు మొత్తం 95,612 ఓట్లు లభించగా, హేంబ్రోమ్‌కు 55,821 ఓట్లు లభించాయి. "సమయం వృథా చేయకుండా మేం కొత్త నాయకుణ్ణి ఎన్నుకుంటాం, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సత్వర నిర్ణయం తీసుకుంటాం'' అని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, ఝార్ఖండ్ రాష్ట్రపార్టీ ఇన్‌ఛార్జి గులామ్ అహ్మద్ మీర్ చెప్పారు. ఈ సమావేశం కూటమి నాయకుడిని ఎన్నుకోవడంవరకే పరిమితమని, మంత్రిపదవుల పంపకాలు, ఇతర విషయాలు ఈ సమావేశంలో చర్చకు రాబోవని మీర్ అన్నారు. హేమంత్ సోరెన్ 2013 జులై 13న మొదటిసారి కాంగ్రెస్, ఆర్‌జెడి మద్దతుతో ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. 2014 డిసెంబరు 28 వరకూ పదవిలో కొనసాగారు. ఆ తర్వాత ఝార్ఖండ్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆర్‌జెడితో కలిసి కూటమిగా ఏర్పడి పోటీ చేసి విజయం సాధించారు. వారి మద్దతుతో అదే ఏడాది డిసెంబరు 29న రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. బిజెపి ప్రభుత్వం ఆయనను ముప్పు తిప్పలు పెట్టింది. మనీ లాండరింగ్ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు 2024 జనవరి 31న ఆయనను అరెస్టు చేసి జైలులో ఉంచారు. దాంతో ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో ఆయన విశ్వాసపాత్రుడు చంపైసోరెన్ తాత్కాలికంగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది జులైలో హేమంత్ సోరెన్ బెయిలుపై విడుదలయ్యారు. దాంతో చంపైసోరెన్ జులై 3న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. వెంటనే హేమంత్ సోరెన్ నాటి గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని అభ్యర్థించారు. ఆ మరునాడే జులై 4వ తేదీన హేమత్ సోరెన్‌కు మూడవసారి ముఖ్యమంత్రి బాధ్యతలు తీసుకున్నారు. ఆయన సారథ్యంలో 'ఇండియా' కూటమి మరోసారి ఎన్నికల్లో పోటీచేసింది. ఈనెల 13న పోలింగ్ ప్రక్రియ పూర్తికాగా, 23వ తేదీ శనివారంనాడు ఎన్నికల ఫలితాల్లో జెఎంఎం నాయకత్వాన 'ఇండియా' కూటమి తిరిగి ఘన విజయం సాధించడంతో హేమంత్ సోరెన్ నాలుగోసారి పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

**సిఎం పదవికోసం 'మహాయుతి'లో పోటాపోటీ**

మహారాష్ట్రలో ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మరోసారి పదవీ బాధ్యతలు చేపడతారని శివసేన వర్గాలు ధీమా వ్యక్తం చేశాయి. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే నాయకుడు ఎవరో కూటమి సమావేశంలో నిర్ణయిస్తామని షిండే చెప్పారు. మహాయుతి కూటమిలో అత్యధికంగా 132 స్థానాలు సంపాదించుకున్న బిజెపి కూడా ముఖ్యమంత్రి పదవిపై కన్ను వేసింది. ఉపముఖ్యమంత్రి ఫడ్నవీస్ ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్నారు. మరో ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు కూడా సి.ఎంగా అవకాశం ఉందని ఎన్.సి.పి నేత చగన్ భుజ్‌భల్ మీడియాతో అన్నారు. కాగా ముఖ్యమంత్రి ఎవరనేది 'మహాయుతి' నాయకులు, బిజెపి నాయకత్వం నిర్ణయిస్తుందని మహారాష్ట్ర బిజెపి శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవన్‌కులే చెప్పారు.

# ఉద్దేశపూర్వకంగానే..

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా అదానీకి చెందిన రెన్యూవబుల్ ఎనర్జీ సంస్థలో ఫ్రాన్స్ సంస్థ పెట్టుబడులు పెట్టే సమయానికి అతనికి అమెరికాలో అనుమానాస్పద లంచాల గురించి దర్యాప్తు జరుగుతున్న సంగతి తెలుసని ప్రాసిక్యూటర్లు వెల్లడించినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. చట్టపరమైన పత్రాలలో ఈ విషయాలు ఉన్నట్టు పేర్కొంది. సదరు విదేశీ సంస్థ ఖవ్డా సోలార్ పార్క్‌లో వాటాను కొనుగోలు చేసినప్పుడు ఆరోపించిన లంచం, మోసం తదితర ఆరోపణలపై అదానీని యుఎస్ అధికారులు విచారిస్తున్నారన్న విషయం తెలుసా? లేదా? వివరించాలన్న ప్రాసిక్యూషన్ అభ్యర్థనపై టోటల్ ఎనర్జీస్ వెంటనే స్పందించలేదని సమాచారం. రాయిటర్స్ కథనం మేరకు సోలార్ ప్రాజెక్ట్ విజయవంతం కావడానికి 2024 మధ్య కాలంలో భారతీయ అధికారులకు వాగ్దానం చేసి, ఆ తర్వాత అక్రమ చెల్లింపులు చేశారని, భారతీయ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ, అతని మేనల్లుడు సాగర్ అదానీతో పాటు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్కి చెందిన మాజీ సిఇఒ సహా 8 మందిపై యుఎస్ ప్రాసిక్యూటర్లు అభియోగాలు మోపారు. 2024 సెప్టెంబర్‌లో ఖవ్డా సోలార్ పార్క్‌లో 1.15 గిగావాట్ల సోలార్ ఇన్‌స్టలేషన్స్‌లో 50 శాతం వాటా కోసం అదానీ గ్రీన్ ఎనర్జీతో జాయింట్ వెంచర్‌కు టోటల్‌ఎనరీజెస్ 444 మిలియన్ డాలర్లు చెల్లించింది. వాస్తవానికి ఇది లంచం ఆరోపణలకు కేంద్రంగా ఉన్న ప్రాజెక్టు. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న క్రిమినల్ కేసులో ఫ్రెంచ్ ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీ పేరు లేదు. ఈ మొత్తం వ్యవహారంపై అదానీ గ్రూప్ ఆరోపణలను పూర్తి నిరాధారమైనవిగా పేర్కొంది. నేరారోపణల ప్రకారం ఎఫ్‌బిఐ ప్రత్యేక ఏజెంట్లు అదానీ గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీకి సెర్చ్ వారెంట్, గ్రాండ్ జ్యూరీ సబ్పోనాతో మార్చి 2023లో సేవలందించారు. టోటల్‌ఎనరీస్‌కు విక్రయించడానికి ఒక సంవత్సరం కంటే ముందు. ఈ పత్రాలు అదానీ గ్రీన్ ఎనర్జీ దాని మాజీ ఇసిఒ వినీత్ జైన్, చైర్మన్ గౌతమ్ అదానీ సంస్థకు వ్యాపార ప్రయోజనాలను పొందేందుకు లంచం తీసుకున్నారనే ఆరోపణలపై విచారణలో ఉన్నట్లు గుర్తించారు. టోటల్ ఎనర్జీస్ జనవరి 2021లో అదానీ గ్రీన్ ఎనర్జీలో 20 శాతం వాటాను కొనుగోలు చేసింది. మొత్తానికి అదానీపై కొనసాగుతున్న లంచాల ఆరోపణలు ఆ కంపెనీలో పెట్టుబడులు పెట్టిన ఎంతో మందిని ఇరుకున పెడుతున్నాయి. వారంతా భారీగా నష్టపోతున్నారు. తెలిసితెలిసీ మోసం చేసిన అదానీపై యుఎస్ కోర్టు ఎలాంటి చర్య తీసుకుంటుందో చూడాలి.

# శీతాకాల సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

అన్ని పక్షాలను సభ సజావుగా నడిచేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. అదానీ అంశంపై చర్చకు ప్రతిపక్షాల డిమాండ్ గురించి ప్రశ్నించగా, సభలో తీసుకోవాల్సిన అంశాలపై లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ అనుమతితో ఆయా సభల బిఎసిలు నిర్ణయం తీసుకుంటాయన్నారు. అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ సభ్యులు అదానీ , మణిపూర్ అంశాలను లేవనెత్తారు. కాంగ్రెస్ నేత గౌరవ్ గొగొయ్ మాట్లాడుతూ తమ పార్టీ అదానీపై చర్చ జరగాలని కోరుతోందని, అలాగే మణిపూర్ జాతుల ఘర్షణపై కూడా చర్చించాలని అన్నారు. ఒకవైపు జార్ఖండ్ ముఖ్యమంత్రి అరెస్టు చేశారని, మరోవైపు వరుసగా జాతుల హింసాకాండ కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం మణిపూర్ ముఖ్యమంత్రిపై విశ్వాసం ఉంచింద్న విమర్శించారు. ఉత్తర భారతదేశంలో పెరుగుతున్న కాలుష్యం, రైలు దుర్ఘటనలపై కూడా చర్చించలని కోరారు. కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యే సోమవారం నాడే అదానీ అంశాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. సౌర శక్తి ప్రాజెక్టుల కేటాయింపు కోసం రాజకీయ నాయకులు, అధికారులకు రూ.2300 కోట్లు చెల్లించడమనేది దేశ ఆర్థిక, భద్రత ప్రయోజనాల విషయంలో తీవ్రమైన అంశమని ఆరోపించారు.

**ఈ సమావేశాలలో 16 బిల్లులు**

వక్ఫ్ సవరణ బిల్లు సహా 16 బిల్లులను శీతాకాల సమావేశాల సందర్భంగా సభలో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ వారం చివరికల్లా జెపిసి నివేదిక రాగానే వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టేందుకు అధికార పక్షం ఏర్పాట్లు చేస్తోంది. అయితే, జెపిని నివేదిక సమర్పించే గడువు పెంచాలని ప్రతిపక్ష సభ్యులు కోరుతుండగా, జెపిసి గడువు పొడిగింపుకు నిబంధన ఉందని , అయితే , దానిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్చ జరగలేదని కిరణ్ రిజిజు తెలిపారు. పొడిగింపుపై చర్చించేందుకు బిఎసినే సరైన వేదిక అని చెప్పారు. శీతాకాల సమావేశాలలో పంజాబ్ కోర్టుల సవరణ బిల్లు, మర్చెంట్ షిప్పింగ్ బిల్లు, కోస్టల్ షిప్పింగ్ బిల్లు, ది ఇండియన్ పోర్ట్స్ బిల్లులను ప్రవేశపెడతారు. ప్రస్తుతం వక్ఫ్ సవరణ బిల్లు, ముసల్మాన్ వక్ఫ్ ఉపసంహరణ బిల్లులు సహా ఎనిమిది బిల్లులు లోక్‌సభలో పెండింగ్‌లో ఉన్నాయి. రెండు బిల్లులు రాజ్యసభలో పెండింగ్‌లో ఉన్నాయి. భారతీయ వాయుయాన్ విధేయక్ బిల్లు లోక్‌సభలో ఆమోదింపబడి రాజ్యసభలో పెండింగ్‌లో ఉంది. అయితే, జమిలీ ఎన్నికల బిల్లు ప్రస్తుత సమావేశాలలోనే ప్రవేశపెడతారనే ప్రచారం జరిగినప్పటికీ, ఈ బిల్లు శీతాకాల సమావేశాలలో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాలో ప్రస్తుతానికి లేదు.

# కల్లాలకు మంత్రులు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మంత్రి రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పలువురు మంత్రులు, అధికారులు కలిపి 5,240 కొనుగోలు కేంద్రాలను తనిఖీలు చేశారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం అయిన నాటి నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 7,990 కేంద్రాల ద్వారా 3,50,311 మంది రైతుల నుంచి 21.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డు రకం 16.06 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, సన్నాలు 5.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంది. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం ధాన్యం విలువ రూ.5040.01 కోట్లు కాగా, ఇందులో రైతులకు ఇప్పటివరకు రూ.2760.22 కోట్ల చెల్లింపులు జరిగాయి. అదేవిధంగా సన్న రకాలకు బోనస్ రూపంలో రూ.283.25 కోట్లు కాగా ఇందులో ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.8.17 కోట్లను చెల్లించింది. గత ఖరీఫ్‌లో ఇదే సమయానికి మొత్తం 20.6 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా, ఈ ఖరీఫ్‌లో నవంబర్ 24 నాటికి 21.73 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించింది. గత ఏడాదితో పోల్చితే 1.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా సేకరించారు. గత సంవత్సరం ఈ సమయానికి రూ. 2414.23 కోట్లు చెల్లించగా, ఈ ఏడాది రూ.2,760.22 కోట్లు చెల్లింపులు జరిగాయి. గతంతో పోల్చితే రూ.345.99 కోట్లు అధికంగా కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించింది.

**రైతులు తొందరపడోద్దు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

:కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతు అనుకూల నిర్ణయాలతో రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి సాధించామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తంకుమార్‌రెడ్డి తెలిపారు. దాదాపు 40 లక్షల మంది రైతులు 66.07 లక్షల ఎకరాలను సాగు చేయగా 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ఇది యావత్ దేశంలోనే సరికొత్త రికార్డ్ అని చెప్పారు. ధాన్యం కొనుగోలులో రైతులు ఎవరికీ ఆందోళన అవసరం లేదని, చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అప్పటివరకు కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోళ్ళకు చెల్లింపులలో జాప్యం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశాలు జారీచేశారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల వ్యవధిలో చెల్లింపులు చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు.

## కుటుంబ సర్వే డోర్‌లాక్, వలసల వివరాలు
# సమగ్రంగా సేకరించాలి

**అధికారులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశం**



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** సమగ్ర కుటుంబ సర్వేలో డోర్‌లాక్, వలసలు వెళ్లిన వారి వివరాలను సేకరించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సంబంధింత అధికారులను ఆదేశించారు. జార్ఖండ్ రాజధాని రాంచీ నుంచి డిప్యూటీ సిఎం ఆదివారం ఉన్నతాధికారులు, కలెక్టర్లతో సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్‌లో సమిక్షించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వే సమయంలో పట్టణ ప్రాంతాల్లో డోర్‌లాక్, ఇంటివద్ద కుటుంబం అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలున్న నేపథ్యంలో వారికి ఫోన్‌కాల్ చేసి సర్వే అంశాన్ని వివరించడం ద్వారా ఆ వివరాలను క్రమబద్ధకరించుకోవాలని, వారిని అందుబాటులో ఉండమని కోరాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వలస వెళ్లిన వారి వివరాలను జాగ్రత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు. సమగ్ర కుటుంబ సర్వేలో వివరాల సేకరణ ఒక ఎత్తైతే , డేటా ఎంట్రీ దశ చాలా కీలకమైందని, ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రతలు తీసుకోవాలని అధికారులను డిప్యూటీ సిఎం అదేశించారు. కొన్ని వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదతున్న నేపథ్యంలో పాఠశాలలో ఆహార, పరిశుభ్రతపై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ ప్రత్యేక దృష్టికి సారించిందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈరకమైన సమస్యలు తలెత్తకూడదనే మెస్, కాస్మోటిక్ ఛార్జీలను ప్రభుత్వం పెంచిందని తెలిపారు. ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత అంశాలకు తావు లేకుండా పక్కా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్, సుల్తానియా, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రవెంకటేశం, జిహెచ్‌ఎంసి కమిషనర్, అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## 'టెయిల్ ఎండ్'.. సమస్యలకు
# 'పత్తిపాక' పరిష్కారం

**రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు**



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** టెయిల్ ఎండ్ ప్రాంతాల ఆయకట్టు సమస్యలకు శాశ్వత పరిష్కారంగా పత్తిపాక రిజర్వాయర్ నిలుస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం ధర్మారం మండలంలో పత్తిపాక గ్రామంలో నిర్మించు ప్రతిపాక రిజర్వాయర్ స్థలాన్ని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్పు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌లతో కలిసి పరిశీలించారు.అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం ద్వారా పెద్దపెల్లి జిల్లా రైతాంగానికి మేలు జరుగుతుందని ఆలోచనతో ఇక్కడి ప్రజాప్రతినిధులు నీటి పారుదల శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి ప్రాథమిక పనులు ప్రారంభించామని అన్నారు. రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన స్థలం, భూసేకరణ ప్రతిపాదనలు , ఇతర అంశాలతో కూడిన డిపిఆర్ తయారు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టే పత్తిపాక రిజర్వాయర్ ద్వారా జిల్లాలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతూ 2 లక్షల 40 వేల ఎకరాల స్థిరీకరణతో పాటు నూతనంగా 10 వేల ఎకరాల ఆయకట్టు వస్తుందని అన్నారు. అతి తక్కువ ఖర్చుతో అధిక లాభం సమకూరే విధంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. టెయిల్ ఎండ్ ప్రాంతాల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా పత్తిపాక రిజర్వాయర్ నిలుస్తుందని మంత్రి అన్నారు. గతంలో కూడా జిల్లాకు ఆయకట్టు అందించే ఎస్ఆర్ఎస్‌పి, ఎల్లంపల్లి, వరద కాలువ, మిడ్ మానేరు, లోయర్ మాలేరు డాం ప్రాజెక్టులను తమ హయాంలోని నిర్మించామని అన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం కోసం స్థానిక ప్రజా ప్రతినిధులైన ప్రభుత్వ విప్ అడ్లూరు లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రభుత్వంపై బాగా ఒత్తిడి తీసుకొని వచ్చారని అన్నారు. పెద్దపల్లి జిల్లా రైతుల చిరకాల ఆకాంక్ష పత్తిపాక రిజర్వాయర్ నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగుల వేస్తుందని, రైతులతో సంప్రదింపులు జరుగుతూ ప్రణాళిక సిద్ధం చేసుకుని ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, ప్రజలకు ఇచ్చిన హామీ అమలు చేస్తున్నామని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో గతంలో ఎన్నడు లేని విధంగా మన రైతు సోదరులు అత్యధికంగా వరి సాగు జరిగే ఉత్పత్తి సాధించారని, వరి పంటకు మద్దతు ధరతో పాటు సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు ప్రతి బస్తాకు నాలుగు నుంచి ఐదు కేజీలు తరుగు పేరుతో మోసం చేశారని, తమ ప్రజా ప్రభుత్వం రాగానే తరుగు లేకుండా పూర్తి స్థాయి పంట కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి సన్న రకం ధాన్యం వడ్లకు బోనస్ రైతులకు అందుతుందని, ఈ కార్యక్రమం వల్ల రైతులు చాలా సంతోషంతో ఉన్నారని మంత్రి తెలిపారు. ఆర్థిక వనరులను సమకూరుస్తూ ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తామని అన్నారు. మన జిల్లా నుంచి గోదావరి జిల్లాలో తరలిస్తూ ఇక్కడ ఆయకట్టు పెంచడంలో గత ప్రభుత్వాలు ఘోర వైఫల్యం పొందాయని, మన దగ్గర బ్యారేజీలు నిర్మించినా ఎటువంటి అదనపు ఆయకట్టు రాలేదని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలోనే శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ప్రభుత్వంతో మాట్లాడి యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలను మంజూరు చేయించారని, తన శాసనసభ పరిధిలోని ఆరోగ్యం, పాఠశాలలు రోడ్ల నిర్మాణ పనులకు ప్రత్యేక కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు, రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, నీటిపారుదల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధ్వాన్నంగా మారిన ఎఫ్ఓబిల నిర్వహణ

**నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగింత**
**టెండర్లు ఆహ్వానించిన జిహెచ్‌ఎంసి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాదచారుల సౌకర్యార్థం నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు (ఎఫ్ఓబిలు) నిర్వహణ లోపంతో ప్రజలు వినియోగించుకోలేని పరిస్థితుల్లోకి వెళ్లాయి. సొంతంగా నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్న మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) వాటి నిర్వహణ బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని నిర్ణయించింది. ఇటీవలనే వాటి నిర్వహణ కోసం టెండర్లను సైతం ఆహ్వానించింది. నిర్వహణ లోపంతో చెత్తాచెదారంతో పేరుకపోవడంతో పాటు అపరిశుభ్రతతో దుర్గంధ భరితంగా మారాయి. లిఫ్టులు లేకపోవడంతో పాటు, ఉన్న వాటిలో పనిచేయకపోవడంతో నిరూపయోగంగా మారాయి. భారీ సంఖ్యలో ఉన్న ఎఫ్ఓబిల మెట్లు ఎక్కాల్సి, దిగాల్సి రావడంతో సాధారణ పాదచారులు వాటిని వినియోగించుకునేందుకు వెనకాడుగు వేస్తున్నారు. అన్ని మెట్లు ఎక్కి అలసిపోయే బదులు నడిచేందుకు చోటు లేని ప్రాంతాల్లో సైతం రోడ్డు డివైడర్‌ను దూకడానికైనా సిద్ధపడుతున్న వారే ఎక్కువగా ఉన్నారు. దీంతో పాదచారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో పాదచారుల సౌకర్యార్థం నిర్మించిన అసలు ఉద్దేశం నెరవేరకుండా ఎఫ్ఓబిలు నిరూపయోగంగా మారాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పాదచారుల కోసం కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఎఫ్ఓబిలను వినియోగించుకునేవారు లేక వెలవెల బోతున్నాయి. ఇటీవలనే జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎఫ్ఓబిల ఎస్కలేటర్లు, ఎలివేటర్ల నిర్వహణ కోసం ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించారు. ఎస్కలేటర్లు, ఎలివేటర్లు లేని ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేసి నిర్వహించాల్సి ఉంటుంది.

**నిర్వహణలో భాగంగా..**

ప్రజలు వినియోగించుకునేలా ఎఫ్ఓబిలను వాడుకలోకి తెచ్చేందుకుగాను నిర్వహణ చేపట్టే ఏజెన్సీలు వాటిని ప్రజలు సునాయాసంగా వినియోగించుకునేలా ఉంచాలి. అందుకుగాను క్రమం తప్పకుండా తనిఖీలు చేసి అవసరమైన సర్వీసింగ్, మరమ్మతులు చేయాలి. దెబ్బతిన్న స్పేర్‌పార్ట్స్‌లను 24 గంటల్లోగా కొత్తవి అమర్చాలి. ప్రతి ఎఫ్ఓబి వద్ద ఇద్దరు కేర్‌టేకర్లను షిఫ్టుకొకరు చొప్పున నియమించాలి. వారు ఎఫ్ఓబిల క్యాబిన్లు శుభ్రంగా, సౌకర్యంగా ఉండేలా చూడాలి. ఎస్కలేటర్ల హ్యాండ్ రెయిల్స్, మెట్లు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఉండాలి. లైటింగ్ ఏర్పాట్లుండాలి. డిస్‌ప్లే పనిచేస్తుండాలి. పనిచేసే ఫోన్ ఉండాలి. సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత అధికారికి తెలపాలి.

**నగరంలో ఎఫ్ఓబిలు ఉన్న ప్రాంతాలు..**

అనూటెక్స్(సైనిక్‌పురి), హెచ్‌పి పెట్రోల్‌బాంక్ (రామంతాపూర్), నేషనల్ పోలీస్ అకాడమీ(రాజేంద్రనగర్), గగన్‌పహడ్, మహవీర్ హాస్పిటల్, (మాసబ్‌ట్యాంక్), ఎన్‌టిఆర్ మార్గ్ (ట్యాంక్‌బండ్), గ్రీన్ ల్యాండ్స్ గెస్ హౌస్, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రి, ముఫకంజా కాలేజ్(బంజారాహిల్స్), భారతీయ విద్యాభవన్, ఫిల్మ్ నగర్, ఖాజాగూడ, ఐఎస్‌బి, ఐటిసి కోహినూర్, మియాపూర్ క్రాస్ రోడ్స్, మదీనగూడ, మలేషియా టౌన్‌షిప్, కెపిహెచ్‌బి 4, కళామందిర్(కెపిహెచ్‌బి కాలనీ), ఐడిపిఎల్, మెట్టుగూడ, రైల్‌నిలయం, హైదరాబాద్ పబ్లిక్కస్కూల్. బాలానగర్, చెన్నయ్ షాపింగ్‌మాల్, (మదీనగూడ), మియాపూర్, ఇఎస్ఐ హాస్పిటల్(ఎర్రగడ్డ), హైదరాబాద్ సెంట్రల్‌మాల్, నేరేడ్‌మెంట్ బస్టాప్, సెయింట్ జోసఫ్ స్కూల్(సికింద్రాబాద్), తార్నాక, స్వప్న థియేటర్ (రాజేంద్రనగర్), ఒమర్ హోటల్, రంగభుజంగథియేటర్, మూసాపేట క్రాస్‌రోడ్స్‌లలో ప్రస్తుతం ఎఫ్ఓబిలు ఉన్నాయి.

## 'కోటి దీపోత్సవం'తో ఆధ్యాత్మిక పరిమళాలు : కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోటి దీపోత్సవం భక్తులకు ఆధ్యాత్మిక పరిమళాలు అందిస్తుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న కోటి దీపోత్సవం కార్యక్రమంలో కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ విశ్వప్రసన్న తీర్థ స్వామి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మంత్రి సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ కోటి దీపోత్సవంలో పాల్గొనడం దివ్యానుభూతిని ఇచ్చిందన్నారు. కోటి దీపోత్సవం కార్యక్రమం లో భాగంగా ఈ రోజు జరిగిన శ్రీ సీతారాముల కల్యాణంలో పాల్గొనడం పట్ల మంత్రి సురేఖ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీతారాముల వారి కల్యాణంతో నేడు ఎన్‌టిఆర్ స్టేడియంలో మరో భద్రాచలం ఆవిష్కృతమైందన్నారు. 2012లో లక్షదీపోత్సవంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆ తర్వాత కోటి దీపోత్సవంగా భక్తులకు ఆధ్యాత్మిక పరిమళాలు అందిస్తున్నదని మంత్రి సురేఖ ప్రశంసించారు. భక్తి టివి ఆధ్వర్యంలో ప్రతి యేడు లాగే ఈ యేడు అత్యంత వైభవోపేతంగా కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని చేపడుతున్నందుకు గాను ఎన్‌టివి చైర్మన్ నరేంద్ర చౌదరిని మంత్రి సురేఖ అభినందించారు.

## అదానీ అవినీతితో ప్రజలకు భారీ నష్టం

**సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్‌కె.నారాయణ**



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** పారిశ్రామిక, వాణిజ్యవేత్త అదానీ అవినీతి పర్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు లక్షల కోట్ల మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్‌కె.నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అదానీ అవినీతి పర్వం ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోందని, దాని ప్రభావం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై పడి ఢిల్లీ దాకా పాకిందన్నారు. రాజకీయ, ఆర్థిక అవినీతికి అదానీ స్కామ్ పరాకాష్ట అని, దీనిపై సమగ్ర విచారణ జరిపి అదానీని, ఇందుకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయల్లో ఆర్థిక అవినీతికి మూల కారణం అమెరికానా అని డాక్టర్ నారాయణ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న డాక్టర్ నారాయణ అమెరికా దేశంలో న్యూయార్క్ కోర్టులో అదానీపై లంచం కేసు నమోదు కావడంపై నారాయణ స్పందిస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశా రు. భారతదేశం మాదిరిగా కాకుండా అమెరికాలో జాప్యం చేయకుండా కేసులను త్వరగా పూర్తి చేస్తారని, అయితే ఈ కేసును అమెరికన్ ప్రభుత్వం సీరియస్ తీసుకుంటుందా లేక అదానీకి మద్దతుగా మోదీ అడ్డంపడతారా వేచి చూడాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాని మోదీ అడ్డుపడకుండా ఉంటే ఆయనకు స్వచ్ఛత వస్తుందని నారాయణ తెలిపా రు. అయితే అమెరికా ప్రభుత్వం, ప్రధాని మోదీ కుమ్మక్కై ఈ అవినీతి కేసు ను రూపుమాపాలని ప్రయత్నించడం సరైంది కాదన్నారు. ఈ కేసు సత్వర పరిష్కారానికి పెద్దఎత్తున ప్రజా ఉద్యమం రావాలని డాక్టర్ నారాయణ కోరారు.

## ప్రతీ గ్రామంలో సోషల్ మీడియాను సిద్ధం చేసుకోండి: ఎమ్మెల్సీ కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:**ప్రతి గ్రామంలో వాట్సాప్ గ్రూప్‌లను,సోషల్ మీడియాను సిద్ధం చేసుకోవాలని, కెసిఆర్ హయంలో ఎలా ఉన్నది?,ప్రస్తుతం ఎలా ఉన్నదనే అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత సూచించారు. కులగణన విషయంలో సోమవారం డేడికేషన్ కమిషన్‌కు నివేదికను అందజేయనున్నట్టు ఆమె తెలిపారు. బిసి నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులతో హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎంఎల్‌సి కవిత ఆదివారం సమావేశమయ్యారు. యునైటెడ్ ఫులే ఫ్రంట్, తెలంగాణ జాగృతి, బిసి కుల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం జగిత్యాల నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులతో కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని, పార్టీ నుండి కార్యకర్తలకు, స్థానిక నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని భరోసానిచ్చారు. ఎంఎల్‌ఎ పదవికి రాజీనామా చేయకుండా గోడ మీద పిల్లి లాగ ఉండటం తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడం లాంటిదని అన్నారు. అలాంటి వ్యక్తులను ప్రజలు క్షమించబోరన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఏ ఒక్క పనిని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేకపోతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జెడిపి చైర్ పర్సన్ దావ వసంత సురేష్, జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, బిసి నాయకులు గట్టు రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సుందరంగా నగర జంక్షన్లు, ఫ్లైఓవర్లు

- చిత్రాకళారూపాలతో ఫ్లైఓవర్ల ముస్తాబు
- జంక్షన్‌లలో శిల్పకళా ప్రతిమల ఏర్పాటు
- రూ.149.84 కోట్లతో పనులు చేపట్టిన జిహెచ్‌ఎంసి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని ఫ్లైఓవర్లు, జంక్షన్‌లలో జీవం ఉట్టిపడేలా కళారూపాలు దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో దివంగత జాతీయ నేతల చిత్రాలతో చారిత్ర నేపథ్యం స్ఫూరణకు వచ్చేలా కనిపిస్తున్నాయి. ఫ్లైఓవర్లు, జంక్షన్‌లను మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) సుందరీకరిస్తోంది. చూపరులను ఆకట్టుకునేలా రంగులతో విభిన్నమైన చిత్రాలను ఫ్లైఓవర్ గోడలపై కళాకారులతో చిత్రిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రధాన జంక్షన్‌లు, కూడళ్లను జంతువుల ప్రత్యేక శిల్పాలు, ప్రతిమలు, చిత్రాలతో సుందరీకరణ పనులు చేపట్టారు. నగరంలో సుందరీకరణ పనులకు జిహెచ్‌ఎంసి పరిధిలోని ఆరు జోన్‌లకుగాను రూ. 149.84 కోట్ల అంచనా వ్యయంతో 224 పనులు చేపట్టారు. అందులో రూ. 5.33 కోట్ల విలువైన 15 పనులు పూర్తి కాగా, మిగిలిన 209 పనులు వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయి. చిన్నారులకు, యువతకు స్ఫూర్తినిచ్చేలా ప్రతిమలు, చిత్రాలు ఉన్నాయని పలువురు నగరవాసులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో చేపట్టిన పచ్చదనంలో అంతర్జాతీయ గ్రీన్ సిటీగా అవార్డును దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నగరంలో ప్రజలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించేందుకు వినూత్న పద్ధతిలో పచ్చదనం పెంపొందించడంతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఫారెస్ట్ విస్తీర్ణం పెరిగినట్లుగా జాతీయంగా గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే గ్రేటర్ హైదరాబాద్‌ను సుందర నగరంగా తీర్చిదిద్దే క్రమంలో 6 జోన్‌లకు మొత్తం రూ. 149 కోట్లను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ల వద్ద కళాత్మక చిత్రాలు, వివిధ వన్య ప్రాణుల కళారూపాలను ఏర్పాటు చేశారు. సెంట్రల్ మీడియం, జంక్షన్‌లలో శిల్పాలు ఆకర్షించే ప్రత్యేక థీమ్‌లతో నగరాన్ని సుందరంగా ముస్తాబు చేసే పనులు జిహెచ్‌ఎంసి చేపట్టింది.





## ప్రాణం పోయినా.. బిఆర్ఎస్‌ను పొగడను !

**బండ్ల గణేష్ సంచలన వ్యాఖ్యలు**

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆయన ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బిఆర్ఎస్ పార్టీపై అసహనం వ్యక్తం చేశారు. గతంలో రాష్ట్రాన్ని శాసిస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎదురు తిరిగానని బండ్ల గణేష్ అన్నారు. ప్రాణం పోవడానికైనా సిద్ధపడతా.. కానీ బిఆర్ఎస్‌ను పొగడనని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను.. కాంగ్రెస్.. కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటూ చెప్పుకొచ్చారు. తాను 2000 సంవత్సరం నుంచి పార్టీకి సన్నిహితంగా ఉన్నట్లు తెలిపారు. తనకు ఇష్టమైన నటుడు చిరంజీవి పార్టీ పెట్టిన సమయంలో కూడా పార్టీ మారలేదన్నారు. అదేవిధంగా జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ పార్టీ పెట్టిన కూడా పోలేదని, తనకు కాంగ్రెస్ పార్టీ అంటే అంత అభిమానమని చెప్పారు. మరోవైపు మన ఇండియాలో ఉన్నటువంటి 29 రాష్ట్రాల్లో బెస్ట్ సిఎం ఎవరైనా ఉన్నారంటే అది రేవంత్ రెడ్డి మాత్రమేనని కొనియాడారు. రేవంత్ రెడ్డి సిఎం అయినప్పటికీ ఆయనకు మాత్రం ఆ ఆహం లేదన్నారు.

## రూ.8.14 కోట్ల స్టాక్ ట్రేడింగ్ మోసంలో వ్యక్తి అరెస్ట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్టాక్ ట్రేడింగ్ మోసానికి పాల్పడి రూ.8.14 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాడిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అధికారులు ఆదివారం అరెస్టు చేశారు.బంజారాహిల్స్‌కు చెందిన ఓ వ్యాపారికి గత నెలలో ట్రేడింగ్‌కు సంబంధించిన వాట్సాప్ గ్రూప్‌లో చేరమని అజ్ఞాత వ్యక్తి నుంచి మెసేజ్ వచ్చింది. దీనిపై ఆసక్తి ఉన్న సదరు వ్యాపారి ట్రేడింగ్ వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. ఆ తరువాత అజ్ఞాత వ్యక్తి పలానా స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మించాడు. దీంతో వ్యాపారి రూ.8,14,48,000 స్కామ్ లింక్ చేయబడిన ఖాతాలకు బదిలీ చేశాడు. చివరకు తాను సైబర్ నేరగాడి చేతిలో మోసపోయానని గ్రహించిన సదరు వ్యాపారి సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు, నిందితుడు రాజస్థాన్‌కు చెందిన శర్వణ్‌కుమార్ శర్మ అలియాస్ శ్రవణ్‌కుమార్ శర్మ (43)గా గుర్తించారు. దీంతో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు రాజస్థాన్‌కు వెళ్లి చాకచక్యంగి నిందితుడిని అరెస్టు చేశారు.

**అప్రమత్తంగా ఉండాలి: శిఖాగోయల్**

ఆన్లైన్ ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) డైరెక్టర్ శిఖాగోయల్ ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారాల్లో అనుచిత లింక్‌లపై క్లిక్ చేయరాదని తెలిపారు.ఏదైనా నిధులను బదిలీ చేయడానికి ముందు ట్రేడింగ్ ప్లాట్‌ఫారామంలను,, స్టాక్ బ్రోకింగ్ అప్లికేషన్లు, పెట్టుబడి పథకాల యొక్క ప్రామాణికతను ధృవీకరించుకోవాలని శిఖాగోయల్ పేర్కొన్నారు.ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు, ఆన్లైన్ మోసానికి గురైనట్లయితే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

# 29న 'దీక్షాదివస్' : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 29న బిఆర్ఎస్ జిల్లా కార్యాలయాల్లో 'దీక్షా దివస్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు అన్ని జిల్లాలకు సీనియర్ నాయకులను ఇన్‌ఛార్జ్‌లుగా నియమించామని, ఈ నెల 26న అన్ని జిల్లాల్లో సన్నాహాక సమావేశాలను నిర్వహిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన కెసిఆర్ నిరాహార దీక్ష రోజును దీక్షా దివస్‌గా నిర్వహిస్తున్నామన్నారు. కెసిఆర్ తన దీక్షను ముగించిన డిసెంబర్ 9న మేడ్చల్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామన్నారు. నిమ్స్ ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారిందని, అందుకే ఆ రోజు నిమ్స్ హాస్పిటల్‌లో అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ చేస్తామని వివరించారు. ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో మళ్లీ రగిలించేలా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఈ దుర్మార్గ కాంగ్రెస్,బిజెపిలకు బుద్ధి చెప్పాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కెటిఆర్ తెలిపారు. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఏప్రిల్ 27, 2001న కెసిఆర్ గులాబీ జెండాను ఎగరవేశారని కెటిఆర్ గుర్తు చేశారు.

**మినీ అంగన్‌వాడీల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి**

మినీ అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ మినీ అంగన్వాడీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి తదితరులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను కెటిఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 3,989 మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గేడ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, ఈ ప్రక్రియ పూర్తిగా అమలులోని కి రాలేదని తెలిపారు. జనవరి నెల నుండి మినీ అంగన్వాడీ టీచర్లకు ప్రధాన అంగన్వాడీ టీచర్లతో సమానంగా రూ.13,650 వేతనాలు చెల్లించినప్పటికీ మార్చి నెల నుండి మళ్లీ పాత వేతనం రూ.7,800 మాత్రమే అందింస్తుండడంతో అసమతుల్యత నెలకొన్నదని వారు కెటిఆర్‌కు వివరించారు.

## అబద్ధాలు ప్రచారంలో సిఎం రేవంత్‌కు డబుల్ పిహెచ్‌డి

**సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు**



**ప్రజాపక్షం / హుజురాబాద్ :** అబద్ధాలు ఆడటంలో రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పిహెచ్‌డితో పాటు డాక్టరేట్ ఇవ్వవచ్చని మాజీ మంత్రి, సిద్దిపే ట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ చాలా రోజుల తరువాత హుజురాబాద్ జర్నలిస్టులతో మాట్లాడడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి అబద్ధాలు ప్రచారంలో డబుల్ పిహెచ్‌డి ఇవ్వవచ్చన్నారు. పట్టపగలు గోబెల్స్ ప్రచారం చేస్తుంటాడని అన్నారు. కర్ణాటక, తెలంగాణలో గ్యారంటీల పేరుతో మోసం చేశారని, మహారాష్ట్రలోను గ్యారంటీ పేరుతో మోసం చేయబోయారని, అక్కడి వెళ్లి మహిళలకు మూడు వేలు, రైతులకు రుణమాఫీ చేస్తామన్నారని, కానీ అక్కడి ప్రజలు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని గ్రహించి బుద్ధిచెప్పారన్నారు. భట్టీ విక్రమార్క ఆర్థిక మంత్రి ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారని, దళితులకు మీరు చేసే మేలు ఇదేనా అని ప్రశ్నించారు. జూలై 19 నాడు ఫార్మా సిటి అని గెజిట్ ఇచ్చి, మాట మార్చి ఇప్పుడు ఇండస్ట్రియ్ ఎస్టేట్ అంటున్నారని, ముందు సిఎం ఇచ్చిన గెజిట్ వాపస్ తీసుకోవాలన్నారు. ఒక వైపు కాళేశ్వరం నీటితో మూసీ పునరుజ్జీవం చేస్తామని చెబుతున్నారు, సగం తెలంగాణకు మంచి నీరులో ఇచ్చేది కాళేశ్వరం అని, సిఎం చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. అక్రమ అరెస్టులు, కేసులు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.

ఫోకస్

# ఆరోగ్యం

# వయసుతోపాటు పెరిగే ఆరోగ్య సమస్యలు

వయసు పెరిగేకొద్దీ ఎన్నో ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. అప్పటి వరకూ 'ఆరోగ్యానికి పర్యాయపదం నేనే అనుకుంటూ తిరిగిన వారు కూడా క్రమంగా ఏదో ఒక రుగ్మత బారిన పడడం మొదలవుతుంది. కొందరిని 40 లేదా 45 ఏళ్లలోనే అనారోగ్యం పలకరిస్తుంది. మరికొందరు 50 లేదా 60 ఏళ్లు దాటిన తర్వాత ఆరోగ్యపరంగా సమస్యలు ఎదుర్కోవచ్చు. వయసు తేడా తప్ప, పెరిగే వయసులో శరీరం శిథిలం కావడం ప్రారంభమవుతుందనేదిచేదినిజం. అలాంటి రుగ్మతల్లో మొదటగా ప్రస్తావి ంచాల్సిన అంశం ఎముకల క్షీణత. యవ్వనంలో తెలియకుండా తిరిగేస్తాంగానీ ఒక వయసుకు వచ్చేసరికి ఎముక క్షీణత ఎక్కువగా ఉంటుంది. 4550 ఏళ్లు దాటిన వారిలో ఎముకలు ఎండుపుల్లల్లా పెళుసుగా, బోలుగా తయారవ్వటమన్నది చాలా ఎక్కువ. ఈ ముప్పు స్త్రీలలో మరీ ఎక్కువ. దీనివల్ల చీటికీమాటికీ పడిపోవటం, ఏ చిన్నదెబ్బ తగిలినా ఎముకలు విరిగిపోవటం చాలా తరచుగా చూస్తుంటాం. పైగా ఒకసారి విరిగితే వీరిలో అంత త్వరగా అతకవు కూడా. దీంతో మొత్తానికి కదలికలు తగ్గిపోవటం, తనపని తాను చేసుకునే పరిస్థితి కూడా లేకపోవటం వంటి ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఎముక సాంద్రత తగ్గటంవల్ల వెన్నుపూసలు విరిగిపోవటం కూడా వీరిలో ఎక్కువే. అసలీఎముక బోలు సమస్య (ఆస్టియోపొరోసిస్)వృద్ధాప్యంలో చాలా సహజమని అం తా నమ్ముతుంటారుగానీ ఇది నిజం కాదు. ముందు నుంచీ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే దీని బారిన పడాల్సిన అసరమే లేదు. పొగ తాగకుండా ఉండటం, క్యాల్షియం అధికంగా ఉండే పదార్థాలు ఎక్కువగా తీసుకోవటంఅవసరం. మ న జీవక్రియలకు తగినంత క్యాల్షియం అవసరం. మన ఆహారంలో క్యా ల్షి యం తగినంత లేకపోతే మన శరీరం దాన్ని ఎముకల నుంచి వెనక్కి తెచ్చుకుంటుంది. దీంతో ఎముకలు బలహీనపడతాయి. అలాగే కడుపులో బిడ్డ ఎదిగేటప్పుడు, బిడ్డకు పాలిచ్చే తల్లుల శరీరం నుంచి చాలా క్యాల్షియం బిడ్డకు వెళ్లిపోతుంది. దీంతో స్త్రీలు ఆస్టియోపొరోసిస్ బారినపడే అవకాశాలు చాలా ఎక్కువ. కాబట్టి క్యాల్షియం ఎక్కువగా ఉండే పాల పదార్థాలు, ఆకుకూరలు, సోయా, గోబీ, చేపలవంటివి తీసుకోవాలి.ఈ తీసుకున్న క్యాల్షియం ఎముకలకు పట్టేందుకు వ్యాయామం చెయ్యటంకూడా అవసరం.కాస్త ఎండలో తిరిగితే విటమిన్‌డి దక్కుతుంది, ఎముక బలానికి ఇదీ



ముఖ్యమే. ఒక వయసు రా గానే అందరూ వైద్యులను సంప్రదించి ఎముక సాంద్రత పరీక్ష చేయించుకుని,ఆస్టియోపొరోసిస్ ఉంటే తగు జాగ్రత్తలు, చికిత్స తీసుకోవటం అవసరం. అలాగే బాత్రూముల్లో పడిపోకుండా నేల నునుపుగా జారిపోయేలా లేకుండా చూసుకోవటం,ఇంట్లో నడిచేటప్పుడు పరిస్థితిని బట్టి నాలుగుకోళ్ల కర్ర సా యం తీసుకోవటం, తలతిప్పు, తూలురావటం వంటి లక్షణాలు కనబడుతుం టే తక్షణం వైద్యులకు చూపించుకుని, చికిత్స తీసుకోవటం కూడా చాలా అవసరం.

## మతిమరుపు..



పెద్దలు సరిగా వినలేకపోతున్నా, సరిగా గుర్తుపెట్టుకోలేక పోతున్నా, విషయాలను సరిగా గ్రహించలేకపోతున్నా ఇంట్లో వాళ్లు చాలామంది 'ఈ ముసలితనంలో ఇంతేలే!, చాదస్తం పెరిగింది, మతిమరుపు వచ్చేసింది..' ఇలా అనుకుని సర్దిచెప్పేసుకుంటుంటారు. కానీ ఈ ధోరణి సరికాదు. ఎందుకంటే వృద్ధాప్యంలో జ్ఞాపకశక్తి తగ్గేమాట కొంత వాస్తవమే అయినా ఇది అందరికీ రావాలనేం లేదు. ముఖ్యంగా తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు వంటి సమస్యల్లో కూడా ఇలాంటి లక్షణాలు కనబడే అవకాశం లేకపోలేదు. వృద్ధాప్యంలో కుంగుబాటు (డిప్రెషన్) చాలా ఎక్కువ కూడా. కాబట్టి ఇలాంటివేమైనా ఉన్నాయేమో వైద్యులకు చూపించుకోవచ్చు. ఎంత వయసు వచ్చినా శరీరాన్నీ, మెదడునూ చురుకుగా ఉంచుకోవటం అవసరం. నిత్యం వ్యాయామం చెయ్యటం ఎంత అవసరమో మెదడుకు పదును పెడుతుండటం కూడా అంతే అవసరం. ఇందుకోసం ఎప్పుడూ ఏదో ఒక కొత్త పని, కొత్త విద్య నేర్చుకోవటానికి ప్రయత్నించటం, కొత్త పుస్తకాలు చదవటం, చదరంగంపదకేళిచిన్నచిన్న లెక్కలు చెయ్యటం వంటి పనుల్లో తలమునకలు కావటం మంచిది. సామాజిక సంబంధాలు చురుకుగా ఉంచుకోవటం, తమ వయసు వారితో కలిసి గడపటం, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండటమూ అవసరం. అలాగే ఒకేసారి చాలా పనులు చేసెయ్యాలని తాపత్రయపడటం మాత్రం మంచిది కాదు. బిడ్డలు దూరంగా ఉండటం, ఆరోగ్య సమస్యలు వేధిస్తుండటం, ఇష్టమైన వారు మరణిస్తుండటం, శరీరం సరిగా సహకరించకపోవటం, అనుకోని ఒంటరితనం.. ఇవన్నీ మానసికంగా ఒత్తిడిని పెంచేవే. కాబట్టి ఇటువంటి నిజ జీవన సందర్భాలను స్థైర్యంగా ఎదుర్కొనటం, అవసరమైతే వైద్యుల సహాయం తీసుకోవటం మంచిది. సాంత్వన, ఏకాగ్రత పెంచే యోగ వంటి వాటిని ఆశ్రయించొచ్చు. ముఖ్యంగా అల్జీమర్స్ వంటి కొన్నికొన్ని తీవ్ర సమస్యల్లో కనబడే మొదటి లక్షణం కూడా మతిమరుపే కాబట్టి దీన్ని నిర్లక్ష్యం చెయ్యకూడదు. ఇలా అనిపించినప్పుడు ఒక్కసారి వైద్యులతో చర్చించటం అవసరం.

## మలబద్ధకం..అతి మూత్రం

మలివయసు వారిని ప్రతి నిత్యం ఇబ్బందికి గురిచేసే ముఖ్యమైన సమస్య మలబద్ధకం. తగి నంత శారీరక శ్రమ లేకపోవటం, దానికి తోడు సరిగా నమల లేక పీచు పదార్థాలుకూర గాయల వంటివి బాగా తగ్గించి, నమలాల్సిన అవసరం అంతగా లేని తేలిగ్గా తినటానికి వీలైన శుద్ధి చేసిన (రిఫైన్డ్) పదార్థాలనే ఎక్కువగా తీసుకోవటం వల్ల ఈ సమస్య మరింతగా ము దురుతుంది. కాబట్టి దీనికి పరిష్కారమేమిటో మనకు తేలిగానే అర్థమవుతోంది. పీచు ఎక్కు వగా ఉండే కూరగాయలు, పండ్లు, ముడి ధాన్యాల వంటివి ఎక్కువగా తినాలి. నీరు సమృ ద్ధిగా తాగాలి. పీచులేని, బాగా శుద్ధి చేసిన పదార్థాలు తగ్గించాలి. ముఖ్యంగా ప్రతిరోజూ మల విసర్జన జరిగితేనే హాయిగా ఉంటుందన్న భావన నుంచి బయట పడటం అవసరం. మల విసర్జన రోజుకు మూడు సార్ల నుంచీ వారానికి మూడు సార్ల వరకూ... సహజమే. కాబట్టి ప్రతి రోజూ విసర్జన జరగాల్సిందేనన్న భావనతో ఆలోచనలన్నీ దానిచుట్టూనే తిప్పుకోవటం అనవసరం. మలబద్ధకం ఇబ్బంది పెడుతున్నప్పుడు వైద్యులను సంప్రదిస్తే ఆహారపరమైన మార్పులతో పాటు అవసరాన్ని బట్టి సబ్జాగింజల పొట్టు వంటి సహజమైన, నీటిలో కలుపుకొని తాగే పొడి వంటివాటినీ సిఫార్సు చేస్తారు, వీటితో తేలికగానే బయటపడొచ్చు.ఇక కారణాలు వేరైనా మలివయసులో



స్త్రీపురుషులు ఇవరువురినీ కూడా మూత్రం ఆపుకోలేని సమస్య ఇబ్బ ంది పెట్టొచ్చు. 50 55 ఏళ్లు దాటిన స్త్రీలకు కటి కండరాలు బలహీ నపడటం వల్ల మూత్రం లీకవటం, ఆపుకోలేకపోవటం, తరచూ వెళ్లాల్సి వస్తుండటం వంటి బాధలు చాలా ఇబ్బంది పెడతాయి. అలాగే పురుషుల్లో ఈ వయసుకు వచ్చేసరికి ప్రోస్టేటు గ్రంథి ఉబ్బటం వల్ల మూత్రం ఆపుకోలేకపోవటం, బొట్టు బొట్లుగా రావటం, ఎంత వెళ్లినా ఇంకా పూర్తి విసర్జనకాని భావన కలగటం వంటి లక్షణాలు వేధిస్తుంటాయి. వీరు ఒక్కసారి వైద్యులకు చూపించుకుని సమస్యేమిటన్నది కచ్చితంగా నిర్ధారణ చేయించు కోవ టం ముఖ్యం. ఎందుకంటే ఈ వయసులో కొన్నిరకాల క్యా న్సర్లలో కూడా ఇలాంటి లక్షణాలే కనబడొ చ్చు. కాబట్టి వీటిని నిర్లక్ష్యం చెయ్యరాదు. మూత్రం ఆపుకోలేని సమస్యకు ఇప్పుడు స్త్రీపురుషులకు ఇరువురికీ కూడా చాలా రకాల చికిత్సా మార్గాలు, పరిష్కారాలున్నాయి. కాబట్టి వీటి గురించి వైద్యులతో చర్చించటం ఉత్తమం.

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం) ప్రతి సోమవారం

- 'ఖుదై ఖిద్మత్ గార్స్' దళాన్ని ఏర్పాటు చేసింది ఎవరు?
  ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్
- తెలంగాణ ఇంజినీర్ల దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు?
  జులై 11
- ఈశాన్య రాష్ట్రాల్లో శాసనోల్లంఘన ఉద్యమానికి నాయకత్వం వహించింది ఎవరు?
  రాణి గైడిన్ ల్యూ
- నీటి ఉపయోగిత వంద శాతం ఉన్న నీటిపారుదల పద్ధతి ఏది?
  బిందు సేద్యం
- 1935వ చట్టములోని ముఖ్యాంశం?
  భారత సమాఖ్య ఏర్పడుట
- సముద్రంలో సోడియమ్ క్లోరైడ్ కాక ఎక్కువగా వుండే ఇతర లవణాలు
  పైవన్నియూ
- రాజస్థాన్ రాజధాని ఏది?
  జైపూర్
- కోల్కతా రేవు ఎగుమతులలో ఒకటి
  తేయాకు
- ప్రపంచ కాన్సర్ రోజు
  ఫిబ్రవరి 4
- తమిళనాడులో ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించింది ఎవరు?
  సి. రాజగోపాలాచారి
- అత్యంత పొడవైన రైలు కమ్ రోడ్ బ్రిడ్జి ఏ ప్రాంతాల మధ్య ఉంది?
  రాజమండ్రి కొవ్వూరు
- భారతదేశంలో అతి పొడవైన కాలువ ఏది?
  ఇందిరా గాంధీ కాలువ
- గాంధీజీ దండి యాత్రను ఏ రోజున ప్రారంభించారు?
  1930 మార్చి 12
- రౌండ్ టేబుల్ సమావేశాలు ఎక్కడ జరిగాయి?
  లండన్
- ఇప్ప చెట్ల పూల నుండి......తయారుచేస్తారు.
  ఇప్పసారా
- నీటిలో ముంచిన కర్ర వంగి కనిపిస్తుంది. కారణం
  వక్రీభవనం
- వేసవిలో గట్టిగాను, శీతాకాలంలో జిగటగాను ఉండే మృత్తికలు
  నల్లరేగడి మృత్తికలు
- చైనా టిబెట్ పై దాడి చేసినది
  1950
- హఠాత్తు వరదలు, వర్షాలకు భూమి పైపొర పొరలు పొరలుగా కొట్టుకొనిపోవుట.
  పట క్రమక్షయం
- ఆల్పైన్ ఉద్భిజ్జాలు ఇచట పెరుగుతాయి.
  ఎత్తు ఎక్కువగా ఉన్న హిమాలయాలలో
- ప్రపంచ జనాభా దినోత్సవం?
  జులై 11
- 1929లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి ఎవరు అధ్యక్షత వహించారు?
  జవహర్ లాల్ నెహ్రూ
- భారతదేశంతో అత్యంత ఎక్కువ భూభాగం సరిహద్దుగా ఉన్న దేశం ఏది?
  బంగ్లాదేశ్
- ఉప్పు సత్యాగ్రహం?
  1930
- ఆఖరి మొగలాయి చక్రవర్తి
  రెండవ బహదూర్ షా

## నష్టపోయిన ఆటో కార్మికులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదే

ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాచలం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోయి నష్టపోయిన ఆటో కార్మికులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎఐటియుసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్‌కె సాబీర్‌పాషా కోరారు. ఎఐటియుసి జిల్లా కార్యాలయం శేష గిరి భవన్‌లో ఆదివారం జరిగిన ఎఐటియుసి అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా తృతీయ మహాసభకు సాబీర్‌పాషా ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. మహాలక్ష్మి పథకాన్ని స్వాగతిస్తున్నామని, కాగా ఈ పథకంతో ఆటో, క్యాబ్, ఇతర రవాణా రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, కుటుంబాలను పోషించుకోలేక, నెలవారీ వాయిదాలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులకు భృతి, జీవిత బీమా, పెన్షన్, చెలానాల నుండి మినహాయింపుతో పాటు మోటార్ వాహన చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఇతర పన్నుల భారం వారిపై మోపకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు వంటి సౌకర్యాలతో కార్మికులను ఆదుకోవాలని కోరారు. సంక్షేమ బోర్డు ఏర్పాటుకు రవాణారంగం కార్మికులు కేంద్రంపై పోరాటాలు చేసి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. మహాసభలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, సిపిఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, వి.మల్లిఖార్జున్, నెరేళ్ల మరేష్, ఆటోయూనియన్ నాయకులు మద్రి కృష్ణ, అనీల్, హమీద్, బడుగు భాస్కర్, అబ్బులు, సత్యనారాయణ, కృష్ణ, పాషా తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక చట్టాలు రద్దుచేయాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక నల్లచట్టాలను అమలు చేయాలని చూస్తోందని, ఈ రైతువ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు దొండపాటి రమేష్ , తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక దొండపాటి భవన్‌లో ఆదివారం తండు సోమయ్య అధ్యక్షతన జరిగిన రైతుసంఘం సమావేశంలో వారు మాట్లాడారు. నల్లచట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో కార్మిక , కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. పంటలకు మద్దతుధర , పంటల రుణమాఫీ చట్టాలను ఏర్పాటు చేసి పంటల భీమా పథకం చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సబ్సిడిపై వ్యవసాయ పరికరాలు అందజేయాలన్నారు. 55 సంవత్సరాలు దాటిన ప్రతి రైతుకు ఐదు వేల రూపాయల పించన్ ఇవ్వాలని, రూ.10 లక్షల వరకు హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. సమావేశంలో రైతుసంఘం నాయకులు స్వర్ణ రమేష్ , కొమ్మినేని వెంకయ్య, దడిపిన్ని వెంకటేశ్వర్లు, బండారు వెంకటేశ్వర్లు, తుప్పతి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 30, డిసెంబర్ 1న హనుమకొండలో ఐఎఎల్ రాష్ట్ర మహాసభలు

సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** హనుమకొండలో నవంబర్ 30, డిసెంబర్ 1 తేదీలలో జరుగనున్న భారత న్యాయవాదుల సంఘం (ఐఎఎల్) రాష్ట్ర ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ కోరారు. ఆదివారం ఐఎఎల్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం ఆహ్వానసంఘం చైర్మన్, రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్ అధ్యక్షతన పట్టణంలోని నక్కలగుట్టలోని హరిత హోటల్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా బొమ్మగాని ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ 1983లో దేశం గర్వించతగిన న్యాయమూర్తులు విఆర్ కృష్ణ అయ్యర్, జస్టిస్ పిఎస్ భగవతి, డిఎ దేశాయ్, జస్టిస్ సిఒ చిన్నపరెడ్డి, జస్టిస్ వెంకటరామనరసయ్య, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు కెకె వేణుగోపాల్, పి.శివశంకర్, పిపిరావు, జితేందర్‌శర్మ, హరిస్వరూప్ వంటి యోధాను యోధులు దేశరాజ్యాంగ మౌలిక లక్ష్యాల అమలు, న్యాయ వ్యవస్థలో న్యాయవాదులు, లావిద్యార్థుల భవిష్యత్తు, సామాజిక న్యాయలక్ష్యాలు వంటి కర్తవ్యాలతో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్‌ను స్థాపించారన్నారు. నేడు




దేశంలో, రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, న్యాయవాదులకు తగిన రక్షణ చట్టాలు లేవని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకొని రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ప్రజా సంక్షేమం కోసం, చట్టాలు, హక్కుల అమలుకు కృషిచేస్తూ సామాజిక పురోగతికి దోహదపడుతున్న న్యాయవాదుల జీవితాలకు ఎలాంటి గ్యారంటీ లేదని, నిధుల కేటాయింపులు లేవన్నారు. జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్, హౌసింగ్ స్కీమ్, వృద్ధాప్యంలో ప్రవేశించిన సీనియర్ న్యాయవాదులకు సమగ్ర ఆరోగ్య పథకం, సంక్షేమ నిధి పెంపు వంటి చర్యలను ప్రభుత్వాలు తీసుకోవాలన్నారు. గ్రాడ్యుయేట్స్ టీచర్స్‌కు ఉన్న మాదిరిగా శాసనమండలిలో న్యాయవాదుల ఎమ్మెల్సీ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, ఐబిసి వర్గాలకు చెందిన జూనియర్ న్యాయవాదులందరికీ లైబ్రరీ, కంప్యూటర్ కోసం ఆర్థిక సహకారం అందించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సెక్షన్–35 భారతీయ నాగరిక సురక్ష సన్నిహిత 41 ఎసి ఆర్‌పిసి సవరణ ద్వారా ప్రజలకు మేలు జరగకపోగా మరింత నష్టం వాటిల్లున్నదని, దీనిపై పార్లమెంట్ పునఃసమీక్ష చేయవలసిన అవసరం ఉన్నదన్నారు. న్యాయవాదుల సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి భీమనాదం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ప్రేమ్‌సాగర్‌రావు, వలస సుధీర్, బిళ్ళ ప్రభాకర్, ట్రెజరర్ గంజి గణేష్, సహాయ కార్యదర్శి వలీ ఉల్లా ఖాద్రి, ప్రచార కమిటీ కోఆర్డినేటర్లు కొత్తపల్లి చిరంజీవి, మెరుగు సుభాష్, కమిటీ సభ్యులు సత్యనారాయణ, దిలీప్, భాను కార్తీక్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల త్యాగాలు మరువలేనివి

బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/తిరుమలగిరి:** కమ్యూనిస్టుల త్యాగాలు మరువలేనివని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తొండ గ్రామంలో ఇక్బాల్ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో బెజవాడ మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా సిపిఐ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రైతులు మిల్లుల్లో విక్రయించిన ధాన్యానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎల్లముల యాదగిరి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జంపాల మల్లయ్య, మండల కార్యదర్శి ఎండి ఫయాజ్, శ్రీకాంత్, జంపాల శ్రీనివాస్, పి.వెంకన్న, స్వరూపా, కనుక అశోక్, ఎల్లముల కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.




## మున్సిపల్ కార్మికులకు కనీసవేతనాలు

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం డిమాండ్

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం డిమాండ్ చేశారు. రాష్ట్ర మున్సిపల్ సాఫ్‌అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి హనుమకొండ జిల్లా ప్రథమ మహాసభ సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి అధ్యక్షతన ఆదివారం హనుమకొండలోని బాలసముద్రం సంఘం కార్యాలయంలో జరిగింది. మహాహభకు ఏసురత్నం, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కార్మికులకు గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కనీస వేతనాలు పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు పెంచేంతవరకు పోరాటాలు సాగుతాయన్నారు. రాష్ట్రంలో కొన్ని మున్సిపాలిటీలలో రెండు పూటల పని విధానాన్ని నిర్వహిస్తున్నారని, ఈ విధానాన్ని రద్దు చేసి ఉదయం ఆరుగంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కార్మికులను పనుల్లో కొనసాగించాలన్నారు. ఉదయం చలి ఎక్కువగా ఉంటున్న దృష్ట్యా కార్మికుల హాజరు ఉదయం 6:30 గంటలకు తీసుకోవాలని కోరారు. జిఒ నెంబర్ 60 ప్రకారం డ్రైవర్లు, వాటర్ సప్లై, ఎలక్ట్రీషన్, సూపర్‌వైజర్స్, డేటా ఆపరేటర్స్‌లకు రూ.19500 వేతనం అమలు చేయాలని, కంప్యూటర్ ఆపరేటర్స్, వర్క్ ఇన్స్పెక్టర్, కార్మికులకు రూ.22,750ల వేతనాలు అమలు చేయాలని, జిఒ ఇచ్చిన నాటినుండి రావాల్సిన ఏరియర్స్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. 60 సంవత్సరాలు




పైబడిన మునిసిపల్ కార్మికుడికి రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, కార్మికులకు ఉచిత వైద్యం అందించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**జిల్లా యూనియన్ నూతన కమిటీ...** సభలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా వేల్పుల సారంగపాణి, ప్రధానకార్యదర్శిగా ఏల్పుల ధర్మరాజు, ఉపాధ్యక్షులుగా డి ధయాకర్, ఎస్‌కె. షమీమ్, ఘంటసాల సదానందం, సహాయ కార్యదర్శులుగా మల్లయ్య, వెంకటయ్య, కోశాధికారిగా ఎ.ఎల్ల స్వామి, కమిటీ సభ్యులుగా టి.విజయ్, యాదవ్, తిరుపతి, బొక్కల రజిత, కొలిపాక యాదమ్మ, మస్కుల కోర్ నేల్, మట్టెడ ప్రభ,కొడకండ్ల లక్ష్మి ఎన్నికయ్యారు. మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కురాజు గౌడ్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పాశం రవి యాదవ్, జెఎసి అధ్యక్షులు బొట్ల రమేష్, రాజారపు భాస్కర్, టిఎమ్‌ఆర్‌పిఎస్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు మున్యం రఘు, రఘుపతి, మూర్తి రాజు, మున్సిపల్ ప్రైవేట్ ఉద్యోగ,సఫాయి కార్మికులు పాల్గొన్నారు.

## బస్వాపురం బాధితులకు నష్టపరిహారం

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు డిమాండ్



**ప్రజాపక్షం/భువనగిరి :** బస్వాపురం రిజర్వాయర్ బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ భువనగిరి మండల, పట్టణ సమితిల సమావేశం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో వస్తువుల అభిలాష్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై గోదా శ్రీరాములు మాట్లాడుతూ బస్వాపురం రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన బాధితులకు చాలా సంవత్సరాలుగా నష్టపరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. వీరి భూములలోనే రిజర్వాయర్ నిర్మించారని, అనేక సంవత్సరాలు గడుస్తున్నా ఇవ్వాల్సినటువంటి నష్టపరిహారం గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ ఇవ్వలేదని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంకూడా నష్టపరిహారం ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. భూములు పోయిన ప్రతి రైతుకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పట్టా పాస్ బుక్కులు లేకుండా కబ్జాలో ఉన్న అర్హులైన వారి జాబితా ప్రభుత్వమే నిర్ణయించిందని వారు అందరూ కబ్జాలో ఉన్నట్టుగా విచారించి సుమారు 100 మంది ఉన్నారని నిర్ణయించారన్నారు. ఆ జాబితాలో ఉన్న వారందరికీ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బాధితులంతా న్యాయం కోసం హైకోర్టులో కేసు వేశారన్నారు. హైకోర్టు నుండిచి ఉత్తర్వులు ఉన్నాయని, ఈ భూములలో ఎలాంటి పనులు జరగకూడదని ఆదేశాలు ఉన్నప్పటికినీ కాంట్రాక్టర్లు దౌర్జన్యం చేసి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారన్నారు. రిజర్వాయర్ పనులు నాణ్యత లేదని ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం పనులు అన్నింటి పైన ఉన్నతాధికారులచే సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ తరపున రైతులకు నష్టపరిహారంతో పాటు ప్రాజెక్టు లోటు పాట్లు అన్నింటిని వారి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునే విధంగా రైతులకు నష్టపరిహారం అందేవిధంగా పోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, భువనగిరి మండల కార్యదర్శి మరిపెల్లి రాములు, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు వస్తువుల అభిలాష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి లక్ష్మయ్య, మండల కార్యవర్గ సభ్యులు ఉడుత రాఘవులు, కౌన్సిల్ సభ్యులు కూరాకుల అబ్బులు, ఏదునూరి శంకర్ పాల్గొన్నారు.

# బాబాయిపై 'అబ్బాయే' పైచేయి !

## మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌సిపి (ఎపి) వర్సెస్..ఎన్‌సిపి (ఎస్‌పి) యుద్ధం
## 29స్థానాలలో ప్రత్యర్థిపార్టీని మట్టికరిపించిన ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్

**ముంబయి :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో రెండు ప్రత్యర్థి వర్గాల మధ్య జరిగిన పోటీలో అజిత్‌పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి 29స్థానాలలో ఆయన బాబాయి శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి(ఎస్‌పి)ని ఓడించింది. శనివారం నాడు ఎన్నికల సంఘం ప్రకటించిన ఫలితాల ప్రకారం ఎన్‌సిపి (శరద్ పవార్) ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో విజేతగా నిలిచింది. కాగా మహాయుతికి చెందిన ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్ ఎన్‌సిపి పోటీ చేసిన 51స్థానాలకు గాను 41స్థానాలలో గెలుపొందింది. శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి) మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో 86మందిని పోటీకి నిలుపగా కేవలం 10మంది అభ్యర్థుల గెలుపుతో మాత్రమే సరిపెట్టుకోవాల్సివచ్చింది. శరద్‌పవార్ స్థాపించిన ఎన్‌సిపి గత సంవత్సరం విడిపోయింది. అజిత్‌పవార్ 41మంది ఎమ్మెల్యేలతో విడిపోయారు. మహాయుతి ప్రభుత్వంలో భాగమయ్యేందుకు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, బిజెపితో జతకట్టారు. ఇది క్రూరమైన అంతర్‌కుటుంబ పోటీని ప్రేరేపించింది. ఎప్పుడైతే ఆయన కజిన్, శరద్‌పవార్ కూతురు సుప్రియా సూలే అతని భార్య సునేత్ర పవార్‌ను సొంతగడ్డ అయిన బారామతిలో ఓడించడంతో 2024లోక్‌సభ ఎన్నికలలో అజిత్‌కుమార్‌కు పెద్ద ఎదురుదెబ్బతగిలిందింది. శనివారం నాడు అజిత్ పవార్ తన మేనల్లుడు యుగేందర్ పవార్‌ను, 83ఏళ్ల శరద్‌పవార్‌ను ఒక లక్ష ఓట్ల తేడాతో ఓడించడంతో ఆ అనుభవజ్ఞుడైన మహానాయకుడు శరద్‌పవార్‌కు మొట్టమొదటిసారిగా ఎదురుదెబ్బ తగిలింది. ఎన్‌సిపి అభ్యర్థులతో ప్రత్యక్షపోరులో ఎన్‌సిపి కైవసం చేసుకున్న 29స్థానాలలో సింధుఖేడ్ రాజా కూడా ఉంది. ఇక్కడ మనోజ్‌ఖయాండే సిట్టింగ్ ఎమ్మెల్యే రాజేంద్ర షియాంగేను ఓడించాడు. అతడు గతంతో అజిత్‌పవార్‌తో కలిసిఉన్నప్పటికీ ఆ తర్వాత తన మాతృపార్టీకి ఆయన తిరిగొచ్చాడు. ఎన్‌సిపికి చెందిన ధర్మారావు ఆత్రం తన కుమార్తె ఎన్‌సిపికిచెందిన భాగ్యశ్రీని ఓడించడంతో అహేరి మరో అంతర్‌కుటుంబ యుద్ధాన్ని చూడాల్సివచ్చింది. పూసాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంద్రనీల్‌నాయక్ ఎన్‌సిపి (ఎస్‌పి)కి చెందిన శరద్ మయింద్‌ను ఓడించడంతో, బస్మత్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్‌సిపి (ఎస్‌పి) అభ్యర్థి జైప్రకాష్ దండేగావ్‌కర్ తో జరిగిన ముఖాముఖి పోటీలో



చంద్రకాంత్ నవ్‌ఘరే అగ్రస్థానంలో నిలిచారు. ప్రముఖ ఓబిసి నాయకుడు, మహారాష్ట్ర మంత్రి యెఓలా అసెంబ్లీ నియోజకవర్గంలో ఛాగన్‌భుజ్‌బల్ ఎన్‌సిపి (ఎస్‌పి)కి చెందిన అభ్యర్థి మాణిక్‌రావు షిండేను ఓడించారు. కాగా సిన్నార్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్‌సిపి(ఎస్‌పి)కి చెందిన ఉదయ్‌సంగలేపై అజిత్‌పవార్‌కు చెందిన ఎన్‌సిపి(ఎపి) అభ్యర్థి మాణిక్‌రావు కొకటే విజయం సాధించారు.మహారాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నరహరి జిర్వాల్ సునీతా చరోస్కర్‌పై గెలుపొంది తన దిండోరి స్థానాన్ని నిలబెట్టుకున్నారు. షహాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో దౌలత్ దరోడా పాండురంగ్ బరోరాపై విజయం సాధించగా, మాజీ మంత్రి నవాబ్ మాలిక్ కూతురు సనామాలిక్ ముంబైలోని అణుశక్తినగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో నటి స్వర భాస్కర్ భర్త ఎన్‌సిపి (ఎస్‌పి) అభ్యర్థి ఫహద్ అహ్మద్‌పై విజయం సాధించారు. కోస్టల్ శ్రీవర్ధన్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్‌సిపి(ఎస్‌పి)కి చెందిన అనిల్ నవ్‌గణే మంత్రి అదితి టట్కరే పైచేయిని సాధించారు. అంబేగావ్ నియోజకవర్గంలో ఆమె మంత్రివర్గ సహచరుడు దిలీప్ వాల్సే పాటిల్ దేవ్‌దత్ నికమ్‌ను ఓడించారు.శిరూర్‌లో ఎన్‌సిపి(ఎస్‌పి)కి చెందిన అశోక్‌పవార్‌పై జరిగిన హోరాహోరీ పోరులో ధ్యానేష్వర్ ఖట్కే విజయం సాధించారు. పింప్రిలో ఎన్‌సిపి (ఎస్‌పి) అభ్యర్థి సులక్షణ ధార్‌ను అన్నా బాండ్‌సోడే ఓడించారు. కోపర్‌గాంలో ఎన్‌సిపి(ఎస్‌పి)కిచెందిన సందీప్ వార్పేపై అశుతోష్ కాలే గెలిచారు. అహ్మద్‌నగర్‌లో ఎన్‌సిపి(ఎస్‌పి)కి చెందిన అభిషేక్ కలంకార్‌ను సంగ్రాంమ్ జగ్‌తప్ ఓడించారు. మజల్‌గాం అసెంబ్లీ నియోజకవర్గంలో మోహన్ జగ్‌తప్‌పై ప్రకాష్ సోలంకే విజయాన్ని సొంతం చేసుకున్నారు. మరట్వాడా ప్రాంతంలోని బీడ్‌జిల్లా పర్లిలో మంత్రి ధనుంజయ్ ముండే ఎన్‌సిపి (ఎస్‌పి) అభ్యర్థి రాజాసాహెబ్ దేశ్‌ముఖ్‌పై 1.4లక్షల ఓట్ల భారీ ఆధికత్యతో విజయం సాధించారు. అహ్మద్‌పూర్‌లో బాబాసాహెబ్ పాటిల్ ఎన్‌సిపి(ఎస్‌పి) అభ్యర్థి వినాయక్‌పాటిల్‌ను ఓడించారు. ఉద్గీర్‌లో ఎన్‌సిపి(ఎస్‌పి)కి చెందిన సుధాకర్ భాలేరావుపై బాండ్‌సోడే గెలుపొందారు.ఫాల్టాన్‌లో ఎన్‌సిపి(ఎస్‌పి)కి చెందిన దీపక్ చవాన్‌ను సచిన్ పాటిల్ ఓడించారు. వయ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయన పార్టీ సహచరుడు మకరంద్‌పాటిల్ ఎన్‌సిపి(ఎస్‌పి) అభ్యర్థి అరుణాపిసల్‌ను ఓడించారు. చిప్లూన్‌లో ఎన్‌సిపి(ఎస్‌పి)కి చెందిన ప్రశాంత్‌యాదవ్‌పై శేఖర్ నికమ్ విజయం సాధించారు.కాగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో మంత్రి హసన్ ముష్రీఫ్ సమర్జిత్ ఘాట్గేను ఓడించి విజయాన్ని నమోదు చేశారు. పార్నర్‌లో ఎన్‌సిపి(ఎస్‌పి) అభ్యర్థి రాణీలంకేపై కాశీనాథ్ డాటే గెలుపొందగా, తుమ్సర్‌లో ఎన్‌సిపి(ఎస్‌పి)కి చెందిన చరణ్ వాగ్మారేపై రాజు కరేమోర్ విజయం సాధించారు. ఇందాపూర్‌లో బిజెపి నుంచి ఎన్‌సిపి(ఎస్‌పి)లోకి చేరి పోటీచేసిన హర్షవర్ధన్ పాటిల్‌పై దత్తా భార్నే విజయం దక్కించుకున్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో శరద్‌పవార్ పార్టీకి మొత్తం ఓట్లలో 11.28 శాతం ఓట్లు వచ్చాయి. కాగా ఎన్‌సిపి(ఎపి)కి 9.01శాతం ఓట్లు లభించాయి. ప్రత్యర్థులను ద్రోహులుగా పేర్కొంటూ శరద్‌పవార్ వారిని నిర్ణయాత్మకంగా ఓడించాలని ఓటర్లను కోరినప్పటికీ శరద్‌పవార్ విజ్ఞప్తిని ఓటర్లు పట్టించుకోలేదని తేటతెల్లమైంది.



# కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించిన బిజెపి, జెడిఎస్ !



**రామంగారా (కర్నాటక) :** కర్నాటక రాష్ట్రం చెన్నపట్న ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి పొంతబలంతో విజయం సాధించాడా? అనే ప్రశ్నకు ఉప ముఖ్యమంత్రి డికె.శివకుమార్ ఆయన మాటల్లో వెల్లడించిన ప్రకారం కాదనే సమాధానం వినిపించింది. బిజెపిలో, జెడి(ఎస్) పార్టీలో అంతర్గతంగా చీలికలు, కుమ్ములాటలే కాంగ్రెస్ పార్టీ చన్నపట్న అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి సిపి.యోగీశ్వర విజయానికి దోహదం చేసిందని కర్నాటక ఉపముఖ్యమంత్రి డికె.శివరామయ్య అన్నారు. ఆయన ఈ రెండు పార్టీల మధ్య సఖ్యత లోపించిందని చెప్పకనే చెప్పారు. జెడి(ఎస్) అభ్యర్థి నిఖిల్ కుమారస్వామి ఓటమిపాలై కాంగ్రెస్ అభ్యర్థి సిపి.యోగీశ్వర విజయానికి నిజంగా క్రెడిట్ బిజెపి, జెడి(ఎస్)దేనని డిప్యూటీ శివరామయ్య వ్యాఖ్యానించారు. చన్నపట్న అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సిపి.యోగీశ్వర తన సమీప ప్రత్యర్థి, ఎన్‌డిఎ అభ్యర్థి నిఖిల్ కుమారస్వామిపై 25,413ఓట్ల ఆధిక్యతతో గెలుపొందాడు. కర్నాటక రాష్ట్రానికి సంబంధించి ఉప ఎన్నికల ఫలితాలు శనివారం నాడు వెలువడ్డ విషయం తెలిసిందే. కర్నాటక రాష్ట్రంలోని చెన్నపట్న, సండూర్,షిగ్గావ్ అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికలు మూడింటిలోనూ కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. నిఖిల్ కుమారస్వామి కేంద్ర మంత్రి కుమారస్వామి కుమారుడు, మాజీ ప్రధానమంత్రి దేవగౌడకు మనవడు అవుతారు. గతేడాది సెప్టెంబరులో జెడి(ఎస్)పార్టీ బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో చేరింది. ఈ ఉప ఎన్నికలో (చెన్నపట్న అసెంబ్లీ నియోజకవర్గం) బిజెపి, జెడి(ఎస్)పార్టీలకు చెందిన చాలామంది కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి కేవలం 16,000 ఓట్లు మాత్రమే వచ్చాయన్నారు. లోక్‌సభ ఎన్నికలలో ఆ ఓట్ల సంఖ్య పెరిగిందని శివకుమార్ ఆదివారం నాడు ఇక్కడ విలేకరులతో మాట్లాడిన సందర్భంగా తెలిపారు. 'బిజెపి, జెడి(ఎస్) నాయకులు మాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇవ్వని పక్షంలో మా పార్టీ చెన్నపట్న అభ్యర్థి సిపి.యోగీశ్వరకు అన్ని అత్యధిక ఓట్లు వచ్చేవి కాదన్నారు. నేను వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కూడా అయిన డికె.శివకుమార్ చెప్పారు. కర్నాటక రాష్ట్రంలో 19స్థానాలు కలిగి ఉన్న జెడి(ఎస్) ఇప్పుడు 18కి పడిపోయిందని డిప్యూటీ సిఎం డికె.శివకుమార్ చమత్కరించారు. చన్నపట్న అసెంబ్లీ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా తీర్పు ఇచ్చినందుకు ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అయితే ఉపముఖ్యమంత్రి శివకుమార్ చేసిన వ్యాఖ్యలపై అటు బిజెపి నుంచి కానీ ఇటు జెడి(ఎస్)నుంచి కానీ వెంటనే స్పందించకపోవడం గమనార్హం.

# మహిళలకు ప్రోత్సాహం ఏదీ?



**ముంబయి :** ఎన్నికలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు కాకపోవడం అందరినీ ఆశ్చర్యచకితులను చేయడమే కాకుండా చర్చనీయాంశంగా మారింది. రాజకీయ పార్టీల నేతల ఉపన్యాసాల వరకే పరిమితం అయ్యిందా అనే అనుమానం తలెత్తుతోంది. 288సీట్లు ఉన్న మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో 21మంది మహిళలు విజయం సాధించగా, వారిలో ఒకరు మాత్రమే ప్రతిపక్షం నుంచి గెలుపొందడం గమనార్హం. విజయం సాధించిన వారిలో బిజెపి నుంచి అధికంగా 14మంది మహిళలు గెలుపొందారు. వీరిలో 10మంది తిరిగి ఎన్నికయ్యారు. శ్వేతా మహాలే (చిక్లి అసెంబ్లీ నియోజకవర్గం), మేఘనా బోర్డికర్ (జింటూర్), దేవయాని ఫరాండే (నాసిక్ సెంట్రల్), సీమా హిరాయ్ 'నాసిక్ వెస్ట్), మంద మహత్రే (బేలాపూర్), మనీషా చౌదరి (డహిసర్), విద్యా ఠాకూర్ (గోరేగాం), మాధురి మిసాల్ (పార్వతి). మోనికా రాజాలే (షెవ్‌గాం), నమిత ముండడ (కైజ్) ఉన్నారు. కాగా శనివారం నాడు ప్రకటించిన ఎన్నికల సంఘం ప్రకటించిన ఫలితాల ప్రకారం బిజెపి నుంచి నలుగురు కొత్త మహిళా విజేతలు శ్రీజయ్ చవాన్ (భోకర్ అసెంబ్లీ నియోజకవర్గం), సులభా గైక్వాడ్(కళ్యాణ్ ఈస్ట్), స్నేహపాండి (వసాయి), అనురాధ చవాన్ (పులాంబరి) ఉన్నారు. అధికార శివసేన పార్టీ నుంచిమంజుల గవిత్ (సక్రి నియోజకవర్గం), సంజన జాదవ్ (కన్నడ్ ) గెలుపొందారు. అధికార నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) నుంచి సుల్భా ఖోడ్కే(అమరావతి), సరోజ్ అహిరే (డియోలలి), సన మాలిక్ (అణుశక్తినగర్), అదితి టట్కారే (శ్రీవర్ధన్) గెలుపొందారు. కాగా కాంగ్రెస్ పార్టీకి చెందిన జ్యోతి గైక్వాడ్(ధవరి) ప్రతిపక్షం నుంచి గెలుపెందిన ఏకైక ఎమ్మెల్యేగా ఉన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌కు వర్ష సూచన

**అమరావతి:** ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న హిందూ మహాసముద్రంలో ఏర్పడిన అల్పపీడనం బలపడిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈనెల 27 బుధవారం నుంచి 30వ తేదీ శనివారం వరకూ కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. అల్పపీడనం పశ్చిమవాయువ్య దిశగా కదిలి రేపు 25న దక్షిణ బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించారు. ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న హిందూ మహాసముద్రంలో ఏర్పడిన అల్పపీడనం బలపడిందని తెలిపారు. అల్పపీడనం పశ్చిమవాయువ్య దిశగా కదిలి సోమవారం నాటికి దక్షిణ బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించారు. మరో 2 రోజుల్లో వాయువ్య దిశగా తమిళనాడు–శ్రీలంక తీరాల వైపు వాయుగుండంవెళ్లే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వివరించారు దీని ప్రభావంతో కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో నవంబర్ 24న అల్పపీడనం ఏర్పడిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్,



యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య గాలులు వీస్తున్నాయి. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో సోమవారం కూడా వాతావరణం పొడిగా ఉండే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఎల్లుండి తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని తెలిపింది. రాయలసీమలో సోమవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. మంగళవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది.

# పంట నమోదు అస్తవ్యస్తం ...
# అధికారుల తప్పులకు రైతులు బలి !



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** దిలావర్పూర్ మండలంలోని కొన్ని గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారులు పంట నమోదులో తప్పుల తడకగా నమోదు చేసుకొని రైతులకు నష్టం చేకూరుస్తున్నారు. రైతులు గ్రామాలలోకి వచ్చి సక్రమంగా సర్వేలు నిర్వహించకపోవడం కొందరు మహిళా ఏఈవోలు కావడం వారి బంధువుల వద్ద కొన్ని నమోదు చేసుకోవడం,చివరకు గ్రామ పంచాయతీకి వచ్చి నమోదు చేయడం పట్ల రైతులకు సరైన సమాచారం పోకపోవడం వీటన్నిటికీ మూల్యం చెల్లించుకోవాల్సింది రైతులే రైతులు సన్న రకపు వరి పంట పండించినప్పటికి ఈ గ్రామంలో దొడ్డు రకపు వడ్లు పండిస్తున్నారని నమోదుచేసుకోవడం,కొన్ని గ్రామాల రైతులకు తీవ్రనష్టం కలిగించే విధంగా ఉంది కొనుగోలు కేంద్రంలో సన్న రకపు వడ్లు పోసి కూడా చివరకు దళారులకే అమ్ముకుంటున్న వైనం.ఈ విషయమై అధికారులను నిలదీస్తే వ్యవసాయ అధికారులు చేసిన తప్పిదాలకు మేము ఏం చేయలేదని జాయింట్ కలెక్టర్, డి.డిఎస్‌ఓ అధికారులు సమాధానం చెబుతున్నారు.వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేయకపోవడం,రైతులు ఏ పంట వేశారని పరిశీలించకపోవడం,సలహాలు సూచనలు చేపట్టకపోవడమే ఈ రోజు వారు చేసిన తప్పిదాలకు ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు వస్తుందని చెప్పాలి.రైతులకు గిట్టుబాటు ధర లభించక చెప్పిన ధరలకే అమ్ముకుంటూ దిక్కు తోచని స్థితిలో ఉన్నారు.ప్రభుత్వం 2350 చెల్లిస్తూ బోనస్ 500 రూపాయలు ఇవ్వడంతో రైతుకు 2850 రావడం రైతుకు లాభం చేకూర్చిందనుకుంటే,చివరకు 2300 వందల రూపాయలకే ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.పంట నమోదు కాకపోవడానికి వ్యవసాయ శాఖ అధికారులకు ప్రభుత్వ పని భారం ఎక్కువగా ఉండడం వల్ల సరిగా నమోదు చేయలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి పంట నమోదు పక్కన పెట్టి రైతులు పండించిన సన్న రకపు పంటను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని,దీనికి జిల్లా అధికారులు కూడా సరైన మార్గదర్శకాలు ఆలోచించి రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

**ప్రభుత్వ తప్పిదం వల్లే రైతులకు నష్టం..**

ప్రభుత్వం రైతులకు 500 రూపాయలు బోనస్ ఇస్తామంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం,రైతులు ఈ సన్న రకాలకు వడ్లు పెడితేనే బోనస్ లభిస్తుందని చెప్పకపోవడం,ఇది ప్రభుత్వం చేసిన తప్పిదమే కాదా..?రైతులు అత్యధికంగా సన్న రకాలైన సూపర అమాన్ వడ్లు అత్యధికంగా సాగు చేయడం రైతులకు శాపంగా మారింది.కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్తే ఈ రకపు వడ్లు కొనుగోలు చేయమని రైతుకు కేంద్రాలలో తెగేసి చెప్పడంతో ఆ సన్న రకపు వడ్లని తక్కువ ధరకే దళారులకు అమ్ముకుంటున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల పట్ల కనికరించి రైతులు పండించిన సన్న రకమైన వడ్లని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

# మార్కెట్ల తీరుపై వీడని సందేహాలు



**ముంబయి:** ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న అనేకానేక పరిణామాలు స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచ స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. భారత దేశం విషయానికి వస్తే, వరుసగా రెండు వారాలుగా దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలను చవిచూశాయి. ప్రస్తుతం నెలకొన్న నష్టాల పర్వం సోమవారం నుంచి ప్రారంభమయ్యే కొత్త వారంలో ముగుస్తుందా లేక 'బేర్' పరుగు కొనసాగుతుందా? అన్న అనమానాలు ఇన్వెస్టర్లను వేధిస్తున్నాయి. స్టాక్ మార్కెట్లలో పరిస్థితులు తిరిగి సాధారణ స్థితికి వస్తాయా లేక మార్కెట్లు ఎటు పయనిస్తాయన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. గత వారం ట్రేడింగ్‌కు చివరి రోజైన శుక్రవారం మాత్రం మార్కెట్లు మెగా ర్యాలీని చూసి కేవలం ఒక్క రోజే దాదాపు 2000 పాయింట్ల మేర సెన్సెక్స్ ర్యాలీని నమోదు చేసింది. ఇప్పుడు అందరి చూపు రానున్న వారంలో మార్కెట్లను ప్రభావితం చేయనున్న వివిధ అంశాలను పరిశీలిస్తే, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో పాటు అదానీ గ్రూప్‌పై తాజాగా వెలుగులోకి వచ్చిన లంచం ఆరోపణలు దేశీయ స్టాక్ మార్కెట్లను అస్థిరతకు గురిచేశాయి. అయితే రానున్న నవంబర్ చివరి వారంలో పెట్టుబడిదారులు ప్రధానంగా దేశంలో మెవడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, విదేశీ నిధుల ప్రవాహం, రష్యా–ఉక్రేన్ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యూఎస్ బాండ్ ఈల్డ్, యూఎస్ డాలర్, ముడి చమురు ధరలు, ప్రపంచ సంకేతాలు, దేశీయప్రపంచ స్థూల ఆర్థిక అంశాలతో సహా కీలక ట్రిగ్గర్లను నిశితంగా పరిశీలిస్తున్నారు. నిఫ్టీ సూచీ 2.39 శాతం పెరిగి 23,907.25 వద్దకు చేరుకోగా, సెన్సెక్స్ 2.54 శాతం లాభపడి 79,117.11 పాయింట్లకు చేరింది. రెండు వారాల నిరంతర పతనంతో పోరాటం తర్వాత ఇది వచ్చింది. శుక్రవారం భారతీయ ఈక్విటీ మార్కెట్లలో సంచలన ర్యాలీకి దేశీయ సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి కొనుగోళ్ల జోరు ముఖ్య కారణంగా ఉండగా.. ఇదే క్రమంలో అమెరికా మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల ధోరణి బుల్స్ తిరిగి పుంజుకోవటానికి మద్దతుల నిలిచినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. దీనికి తోడు కరెక్షన్ దారిలో ఉన్న మార్కెట్లలో రికవరీతో పాటు ఇండెక్స్ హెవీవెయిట్లలో బేరసారాల వేట కారణంగా సూచీలు గరిష్ట స్థాయికి చేరుకోవడానికి సహాయపడినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎన్నికల్లో కీలకంగా ఉన్న మహారాష్ట్రలో నిన్న బీజేపీ కూటమి ఎన్నికల్లో విజయాన్ని అందుకోవటంతో సోమవారం మార్కెట్లు దానికి సానుకూలంగా ప్రభావితం అవుతాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. దీనికి ముందు రెండు వారాలను పరిశీలిస్తే.. ప్రధానంగా త్రైమాసిక ఫలితాల్లో పేలవమైన కార్పొరేట్ ఆదాయాలతో పాటు విదేశీ మదుపరులు భారత్ మార్కెట్లను విడిచిపెట్టడం ప్రధానంగా బేరిష్ మొమెంటం (బేర్ పరుగు లేదా అమ్మకాల ఒత్తిడి) కొనసాగించేలా చేశాయి. రియల్టీ, ఆటో, ఎఫ్‌ఎంసీజీ రంగాలు పెరుగుదలలో ముందుండగా.. ఇంధనం మినహా చాలా రంగాలు పుంజుకోవడానికి దోహదం చేశాయి. నష్టాలను తగ్గించుకోవటంతో పాటు బెంచ్మార్క్స్ రికవరీని నడపడంలో ఐటీ, బ్యాంకింగ్ రంగాలకు చెందిన కంపెనీల షేర్లు కీలకంగా వ్యవహరించాయని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం అమెరికాతో పాటు భారతదేశంలో సైతం అదానీ లంచాల వ్యవహారంపై దర్యాప్తు చేయాలని కొందరు కోర్టు మెట్లు ఎక్కటంతో రానున్న వారంలో ఈ గ్రూప్ కంపెనీల లిస్టెడ్ స్టాక్స్ ప్రభావితం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇదే క్రమంలో ఐపిఒల మార్కెట్ కూడా రానున్న వారంలో కీలకంగా మారనుంది. ఏదిఏమైనా, వచ్చే వారం లావాదేవీల పరిస్థితిని ఊహించడం ప్రస్తుతానికి కష్టంగానే ఉంది.

# మావోయిస్టుల కోటలో మరో మూడు సిఆర్‌పిఎఫ్ కేంద్రాలు



**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ ప్రభావం తీవ్రంగా ఉన్న బస్తర్ ప్రాంతంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సిఆర్‌పిఎఫ్) మూడు ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్(ఎఫ్ఒబి) కేంద్రాలను ఏర్పాటు చేసింది. మావోయిస్టులపై తీవ్ర స్థాయిలో విరుచుకపడేందుకు వ్యూహాత్మకంగా వీటిని ఏర్పాటు చేశారు. సుక్మా జిల్లాలోని తుంపల్‌పాడ్, రాయగూడెం, బీజాపూర్ జిల్లాలో కొండపల్లిలో ఎఫ్ఒబిలను ఏర్పాటు చేసినట్లు సిఆర్‌పిఎస్‌ఫ అధికారులు 'పిటిఐ'తో మాట్లాడుతూ వెల్లడించారు. కీలక ప్రాంతాలలో నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్‌లను చేపట్టేందుకు ఎఫ్ఒబిలను సిఆర్‌పిఫ్ సహా అన్ని భద్రతా బలగాలు, రాష్ట్ర పోలీసు యూనిట్‌లు లాంచింగ్ పాడ్‌లుగా వినియోగించుకుంటాయి. తాల్పేరు నది తీరంలోని కొండపల్లి గ్రామం మావోయిస్టులకు సంబంధించి అత్యంత కీలకమైన పిఎల్‌జిఎ బెటాలియన్ నెంబర్ వన్ రిక్రూట్‌మెంట్ కేంద్రమని సిఆర్‌పిఎఫ్ వర్గాలు వెల్లడించాయి. ఇక్కడ మావోయిస్టుల శిక్షణ ప్రాంతంగా కూడా ఉందన్నారు. అలాగే చింతవాగు నది తీరంలోని తుంపల్‌పాడ్ హాల్ట్ ఏరియా అని తెలిపారు. ఇక్కడ ఎఫ్ఒబిని 74వ బెలాలియన్ బలగాలతో నిర్వహిస్తారు. కొండపల్లి ఎఫ్ఒబిని 170వ సిఆర్‌పిఎఫ్ యూనిట్‌తో ఏర్పాటు చేశారు. ఈ మూడు ఎఫ్ఒబిలకు కమాండ్ బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ (కోబ్రా) క్రియాశీల బృందాలను అందిస్తుందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతాలలో నక్సల్స్ స్వేచ్ఛగా తిరగకుండా ఎఫ్ఒబిలు భౌతిక హద్దులుగా వ్యవహరిస్తాయన్నారు. ఇప్పటి వరకు అక్కడకు ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా బలలగాలు వెళ్ళకుండా నిరోధించారని తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో సిఆర్‌పిఎఫ్ ఇప్పటి వరకు 40కి పైగా ఎఫ్ఒబిలను గడిచిన నాలుగేళ్ళలో ఒడిషా, తెలంగాణ సరిహద్దుల్లో ఏర్పాటు చేశాయి. అలాగే బిఎస్‌ఎఫ్, ఐటిబిపి వంటి ఇతర సాయుధ పోలీస్ బలగాలు కూడా ఇలాంటి ఎఫ్ఒబిలను అక్కడ ఏర్పాటు చేసాయి. కేంద్ర మంత్రి అమిత్ షా ఇటీవల తమ ప్రభుత్వం 2026 మార్చి నాటికి దేశంలో వామపక్ష అతివాదాన్ని అంతమొందించటమే లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకు అనుగుణంగా భద్రతా బలగాలు శక్తివంతమైన, నిర్దయతో కూడిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని లక్ష్యాన్ని చేరోకోవాలని కోరారు.

# వక్ఫ్ సవరణల బిల్లుతో ప్రజాస్వామ్యానికి ముప్పు

## ఎపి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**అమరావతి:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణల బిల్లు ఆమోదం పొందితే దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డు సవరణల బిల్లును వ్యతిరేకిస్తూ అన్ని ముస్లిం సంఘాలు, జమాత్‌ల మద్దతుతో నిరసన సభ జరిగింది. స్థానిక ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన ఈ సభలో సిపిఐ (ఎపి) రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ వక్ఫ్ బిల్లులో అత్యంత ప్రమాదకరమైన సవరణలు ఉన్నాయన్నారు. ఓటర్లలో మత విభజన తీసుకువచ్చేందుకే ఈ బిల్లు తీసుకువస్తున్నారని స్పష్టం చేశారు. టిటిడిలో హిందూవేతరులు ఉండకూడదని ఒకవైపు చెపుతూ మరో వైపు వక్ఫ్‌బోర్డులో హిందువులు ఉండాలని పేర్కొనటం దుర్మార్గం అన్నారు. వక్ఫ్‌బిల్లు పార్లమెంటులో వీగిపోయేందుకు ఎపి సిఎం చంద్రబాబు, బీహార్ సీఎం నితీష్ కుమార్ ముందుకు రావాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, అఘోరి ఇద్దరూ సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీ విధానాలు హిందువులందరికీ అనుకూలం కాదన్నారు. కులాల మధ్య విబేధాలు సృషిస్తుందన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చ్‌ల ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వక్ఫ్ బిల్లును పార్లమెంటులో, బయట సిపిఎం వ్యతిరేకించిందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పాలక, ప్రతిపక్ష పార్టీలు ఏపీలో ఒకవిధంగా, ఢిల్లీలో మరో విధంగా మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత షేక్.మస్తాన్‌వలి మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టేందుకు మోదీ ప్రభుత్వం సవరణల బిల్లు తీసుకువచ్చిందన్నారు. సభకు అధ్యక్షత వహించిన లౌకిక రాజ్యాంగ పరిరక్షణ



వేదిక చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ విహెచ్‌పి, ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో పరిపాలన చేస్తున్నారని, వారికి అనుకూలమైన తీర్పులు ఇప్పించుకుని రామమందిరం నిర్మించారని, కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేశారని చెప్పారు. మాజీ పార్లమెంటు సభ్యుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ఉమ్మడి జాబితాలో ఉన్నందున్న రాష్ట్రాల అభిప్రాయాలు కూడా తీసుకోవాల్సి ఉందన్నారు. హిందువుల మంగళసూత్రాలు తీసి ముస్లింలకు ఇస్తారని, ముస్లిం రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామని పాలకులు మాట్లాడుతుంటే ఎన్నికల కమీషన్ ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. చేగువేరాని ఆదర్శంగా భావించినట్లు చెప్పిన రాజకీయ నాయకుడు సనాతన ధర్మం గురించి మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. పరమత సహనం గురించి స్వామి వివేకానంద చేసిన ప్రసంగాన్ని పవన్ కల్యాణ్ విని తెలుసుకోవాలని సూచించారు. జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు రఫీక్ అహ్మద్, అహెహదీజ్ జమాత్ రాష్ట్ర అధ్యక్షుడు ఫజ్లుర్ రహమాన్ ఉమ్రి, సున్నతుల్ జమాత్ అధ్యక్షుడు ముక్తియార్, మజ్లిసుల్ ఉలేమా అధ్యక్షుడు ముఫ్తి యూనఫ్, ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడు జాఫర్ పులి, లౌకిక పరిరక్షణ వేదిక విజయవాడ అర్బన్ కన్వీనర్ అబ్దుల్ మతీన్, ముస్లిం జేసీ కన్వీనర్ షేక్.మునీర్ అహ్మద్, పైగామ్ ఇన్‌సానియాత్ అధ్యఓఉడు మౌలానా మక్బుల్ అహ్మద్ సద్వి, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు చిష్టి, ప్రముఖ న్యాయవాది సలీమ్, సామాజిక, రాజ్యాంగ అధ్యాయన కేంద్రం నిర్వాహకులు ఆరిఫ్ మహ్మద్ తదితరులు ప్రసంగించారు. అతిథులను ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ అఫ్సర్ సభ ఉద్ధేశాన్ని వివరించారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సభ్యులు షేక్ బాజీ సయాద్ స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్ అభ్యుదయ గీతాలు ఆలపించారు. విజయవాడ ఆటోగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్ కోశాధికారి ఎస్‌ఎస్ హూసేనీ(బాబా) వందన సమర్పణ చేశారు.

# పాక్ ప్రభుత్వానికి ఇమ్రాన్‌ఖాన్ భయం

## 22వేలమంది భద్రతాదళాల మోహరింపు



**ఇస్లామాబాద్ :** మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ పిటిఐ పార్టీ నిరసన ర్యాలీని భగ్నం చేసేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. పాకిస్థాన్ ప్రభుత్వానికి ఇప్పుడు ఇమ్రాన్‌ఖాన్ భయం పట్టుకుంది. తనతోపాటు జైళ్ళల్లో మగ్గుతున్న తెహ్రిక్ ఎ ఇన్సాఫ్ పార్టీ కార్యకర్తలను, నాయకులను విడుదల చేయాలని కోరుతూ ఇస్లామాబాద్ వరకూ ఇమ్రాన్‌ఖాన్ ఈ ర్యాలీకి పిలుపు ఇచ్చారు. దీంతో ఇస్లామాబాద్‌ను అష్టదిగ్బంధనం చేశారు. 22,000 మంది భద్రతా దళాలను మోహరించారు. పంజాబ్‌రాష్ట్రంలో 144వ సెక్షన్ విధించారు. బహిరంగంగా ప్రజలు గుమిగూడటాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఇమ్రాన్‌ఖాన్ భార్య బుష్రా బీబీపై ఇప్పటికే ఏడు కేసులు నమోదు చేశారు. వీటిల్లో కుట్ర, రాజద్రోహం, పాకిస్థాన్ సంప్రదాయాలకు వ్యతిరేకంగా ప్రవర్తించడం వంటి అనేక కేసులు బనాయించారు. ఆమె మతద్వేషాన్ని విస్తరించేందుకు ప్రయత్నించారని కేసులు పెట్టారు. గడ ఏడాది ఆగస్టు నుండీ ఇమ్రాన్‌ఖాన్ జైలులో ఉన్నారు. ఆయనపార్టీ పిటిఐని ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధించారు. ఇప్పుడు ప్రజాస్వామ్యబద్ధమైన ర్యాలీ చేసేందుకు ఆటంకాలు పెట్టారు.

# సాహితీ విహారి

# వచన కవిత్వానికి బాటలు వేసిన శిష్ట్లా..

## వైవిధ్యం.. వైరుధ్యం..

శిష్ట్లా కవిత్వానికి ఎన్ని పోకడలు ఉన్నాయో... ఆయన ఆలోచనల కూ అన్నే పార్శ్వాలున్నాయి. తొందరగా అర్థంకాడు. ఫలానా పద్ధతిని అనుసరించాలి అని అంటే వినదే వినడు. తన ఇంటిపేరును'శిష్టా్ల' ను విడగొట్టి... సాగదీసి 'శిష్ట్లా'గా రాసుకు న్నాడు. ఇది కాదా ఆయన ధిక్కార ధోర ణికి పరిచయం. ఇది కాదా ఆయన ఎల్లలు లేని స్వేచ్ఛాతత్వానికి నిదర్శనం. అందుకే వైవిధ్యానికి ఆయన మారుపేరయ్యాడు. ఏటుకూరి ప్రసాద్, యామిజాల ఆనంద్ సంపాదకత్వ బాధ్యతలు వహించి తీసుకొచ్చిన 'శిష్ట్లా ఉమామహేశ్వరావు సర్వ లభ్య సాహి త్యం' చదివితే ఈ విషయం స్పష్టమవుతుంది. ఇందులో 'కవనం' విభా గంలో 41 కవితలు.. 'కథనం'లో 39 కథలు ఉన్నాయి. ఆరు 'ఆకాశవా ణి కథలు', 10 'గొబ్బి జాతక కథలు', 18 'బాల వినోద కథలు', 21 'సిపాయి కథలు' ఉన్నాయి. రూపకాల విభాగంలో పది నాటకాలు, వచ నం విభాగంలో 25 వ్యాసాలు కూడా ఉన్నాయి. శిష్ట్లా గురించి, ఆయన కవిత్వం గురించి 23 పరిశీలనలు కూడా ఉన్నాయి. సమీక్షలు.. అభిప్రాయాలు 'కదంబం'గా దర్శనమి స్తాయి. ఈ పుస్తకం శిష్ట్లా కవిత్వానికి ఓ సమగ్ర రూపం. ఇందులోని ప్రతి అక్షరం సాహితీ పరిమళాలను వెదజల్లుతుంది. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని 'దేశ చరిత్రలు' గేయాన్ని అనుకరిస్తూ, 'మన చిత్ర చరాత్రలు' అంటూ విసిరిన వ్యంగ్య బాణాలు ఔరా అనిపిస్తాయి.

**'ఏ తెలుగు ఫిల్మ చూసినా**
**ఏమున్నది గర్వకారణం?**
**మన చిత్రచరిత్ర సమస్తం**
**బహుభార్య సమస్య కథనం**

**మన చిత్రచరిత్ర సమస్తం**
**ఇమిటేటెట్ గానప్రవాహం**
**మన చిత్రచరిత్ర సమస్తం**
**తలనొప్పికి తబలా మ్రోతలు'**

అంటూ ఎద్దేవా చేస్తాడు. చివరిలో..

**'ఏ ఘట్టం? ఏ సంగీతం?**
**ఏ పాత్రది ఎట్టి పోషణ?**
**ఏ చిత్రం ఈ దేశంలో**
**సాధించినదే పరమార్థం?**
**ఏ శిల్పం ఏ విజ్ఞానం**
**ఏ శాస్త్రం ఏ గాంధర్వం**
**ఏ చిత్రం ఏ సందేశం**
**అర్పించిందీ దేశానికి?'**

అంటూ ముక్తాయింపుని స్తాడు. 'విష్ణుధనువు' ను ఎక్కుపెట్టి, ఛాందసవాద విధానాలను తుత్తినియలు చేస్తాడు. ఇవి మచ్చుకు కొన్ని. శిష్ట్లా సాహిత్యం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎ న్ని విశేషణా లున్నా కరువే. ఆయన రచనలను ఆకళింపు చేసుకొని ఆనందించాలంటే, 'శిష్ట్లా ఉమామహేశ్వరావు సర్వలభ్య సాహిత్యం' పుస్త కం చదవాల్సిందే.

**పుస్తకం పేరు:**
**సంపాదకులు:**
**వెల: రూ. 600**
**ప్రతులకు సోల్ డిస్ట్రిబ్యూటర్**
**నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్).**
**జిఎస్ఐ పోస్టు**
**హైదరాబాద్: 500 068**
**ఫోన్: 040 29884453/54**






శిష్ట్లా రచనలు అధ్యయనం చేయడానికి అర్హత కావాలి. ఆయన సృష్టించిన అంతటి విస్తారమైన సాహితీసాగరాన్ని ఈదడం ఎలావున్నా... మునకలు వేసినా జన్యధన్యమవుతుంది. అలాంటి ది ఆయన సాహిత్యాన్ని సమీక్షించడానికి ఎంతటి సాహసం ఉండాలి. 'ఈ యుగం నాది... ఇది శ్రీశ్రీ యుగం' అంటూ నిర్భీతిగా ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీశ్రీ తనపై శిష్ట్లా ప్రభావం ఉందని ప్రకటించాడు. ఇది చాలదా శిష్ట్లా ప్రతిభ ఎలాంటిదో చె ప్పడానికి? ఇది చాలదా ఆయన ఘనతను చాటడానికి? భావకవిత్వం ఊబిలో కూరుకుపోయి తెలుగు సాహిత్యం ఉక్కిరిబిక్కిరవుతున్న కాలం అది. ఆ భావనను భుజాన వేసుకొని తిరుగుతూ, కవిత్వానికి నిర్వచనం అదేనన్న అభిప్రాయాన్ని నరనరానా జీర్ణించుకున్న వారిని ధిక్కరించడానికి శిష్ట్లా వంటి మొండివాడుకాకపోతే, ఎవరు ముం దుకొస్తారు? తెలుగు సాహిత్యానికి కొత్త దిశలో నడిపిన శిష్ట్లా ఎప్పుడు పుట్టాడనే విషయంపై భిన్నాభిప్రాయాలున్నాయి. 1912గా కొంతమంది పేర్కొంటారు. అయితే, శిష్ట్లా 1909 నవంబర్ 2న జన్మించారని, 1953 అక్టోబర్ 16న అనుమానాస్పదంగా మరణించారని ఆయన రచనలతోపాటు, వ్యక్తిగత జీవితంపైన కూడా లోతైన అధ్యయనం చేసి, కుటుంబ సభ్యులు, బంధువులను కలిసి, వివరాలు సేకరించిన యామిజాల ఆనంద్ స్పష్టం చేశారు. కాబట్టి, ఈ తేదీలను ప్రామాణికం గా భావించ వచ్చు. కేవలం 44 సంవత్సరాల వయసులోనే తనువు చాలించి, ఏదో పనివున్నట్టు హడావుడిగా వెళ్లిపోయాడు శిష్ట్లా. అయితేనేం.. తెలు గు సాహితీలోకాన్ని తన రచనలతో సుసంపన్నం చేశాడు. దురదృష్టవశాత్తు ఆ రచనలను స్వయం గా భద్రపరచుకోలేదు. అప్పట్లో ఆ బాధ్యత తీసుకున్నవారు కూడా లేరు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, వాటిని సేకరించి, తాము సంపాదకీయం వహించి 'శిష్ట్లా ఉమామహేశ్వరరావు సర్వలభ్య సాహిత్యం' పేరుతో పుస్తక రూపంలోకి తీసుకొచ్చిన ఏటుకూరి ప్రసాద్, యామిజాల ఆనంద్ ధన్యులు. ప్రస్తుత తరానికే కాదు... భవిష్యత్ తరాలకు కూడా శిష్ట్లా కవిత్వాన్ని పరిచయం చేయాలన్న సంకల్పం అభినంద నీయం. సరికొత్తగా ఆలోచించడం శిష్ట్లా నైజం. ఆధునిక భావాలు ఆయ న నేస్తాలు. అందుకే, ఆయన వ్యక్తిత్వం విలక్షణ మై ఎవరికీ అందనంత ఎత్తులో వినువీధుల విహరించింది. భావకవిత్వ శృంఖలాలు తెంచుకోవాలంటూ నలుదిశలు పెక్కుటిల్లేలా నినదించింది. తెలుగు సాహితీలోకంలో కొత్త ఒరవడికి... నూతన శకానికి బీజం వేసింది. తమను మించిన కవులు లేరని ఎంతో మంది విర్రవీగుతున్న సమయంలో, శిష్ట్లా ధిక్కార స్వరం వినిపించాడు. అసలుసిసలైన కవిత్వం ఇదేనంటూ, వచన కవిత్వానికి బాటలు వేశాడు. సంప్రదాయ రచనా విధానాన్ని అటకెక్కించి, ఆయన చేసిన రచనలు ఝంఝామారుతంలా తెలుగు సాహిత్యాన్ని చుట్టేశాయి. రాశిలోనేకాదు.. వాసిలోనూ ఆయనది అందె వేసిన చేయి. మాటలకు అర్థాలు మారాలని చెప్పడమేకాదు... ఆచరణలో పెట్టాడు. తెలుగు సాహిత్యాన్ని కొత్త దారిని అందించాడు. పాఠకులకు కొత్త రుచిని చూ పించాడు. ఆధునిక సాహిత్యానికి ఆద్యుడయ్యా డు. శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు వంటి ఎం తో మందిని ప్రభావితం చేశాడు. కాలానికంటే ముందు నడిచాడు. కలాన్ని కొత్త పుంతలు తొక్కించాడు. భవిష్యత్ తరాలకు మార్గదర్శిగా అయ్యా డు. కానీ, ఆయనకు రావాల్సినంత గుర్తింపు రా లేదు. ఆ విషయాన్నే 'సర్వలభ్య సాహిత్యం' పుస్త కం ముందుమాటకు 'దారి మలచిన వాణ్ణి మరచి న మనం' అంటూ వాస్తవాలను చూడని, నిద్రమ త్తు వీడని వారి తీరుపై కొరడా ఝళిపించారు ఏ టుకూరి ప్రసాద్. 'తెలుగు సాహిత్యంలో కళ్లు మిరుమిట్లు గొలిపే, బైర్లు కమ్మేంతగా మెరుపులొచ్చాయి. సాహితీవేత్తల గుండెల దిరే ఉరుములొచ్చాయి. అప్పటి వరకూ ప్రశాంతంగా ఉన్న తెలు గు సాహితీ సరోవరంలో అదాట్న పెద్ద బండ రా యి పడేసినట్లయింది. అల్లకల్లోలం అయింది. ముఖ్యంగా కవితాలోకం సంభ్రమాశ్చర్యాలకు లోనైంది. అంతవరకూ భావకవిత్వ ధోరణికి అలవాటుపడ్డ సాహితీలోకం ఓ కొత్తమాట విన్నది. ఓ కొత్త ధోరణిని చూసింది. ఆనాటికే భావకవిత్వం లో తలలు పండిన వాళ్లు దీన్ని ఎద్దేవా చేశారు. నూనూగు మీసాల వాళ్లు ఆశ్చర్యంలో కొత్త ధోరణి కి ఆహ్వానం పలకడానికి సిద్ధమయ్యారు' అం టూ శిష్ట్లా ఆగమనం గురించి గొప్పగా చెప్పారు. రకరాల పేర్లతో, సాహిత్యంలోని ఎన్నో ప్రక్రియల్లో రచనలు చేసిన వైనాన్ని ప్రస్తావిస్తూ, 'చూడగలిగిన కన్నుండాలేకానీ రచయితకు వస్తువు కరువు లేద న్న దానికీ, కాదేదీ రచనకనర్హం అన్న దానికీ శిష్ ట్లా రచనలే సాక్షం' అని పేర్కొన్నారు. యామిజా ల ఆనంద్ ఉపోద్ఘాతంలో శిష్ట్లా చిన్నతనాన్ని ప్రస్తావిస్తూ, అల్లరిచిల్లరగా.. విశృంఖలంగా తిరిగి న వైనాన్ని వర్ణించారు. చాలా మందికి తెలియని, ఎంతోకాలంగా వెలుగులోకి రాని శిష్ట్లా వ్యక్తిగత జీవితాన్ని కూడా వివరించారు. పెను ఉప్పెనలా తెలుగు సాహితీలోకంలోకి అడుగుపెట్టిన వైనాన్ని పరిచయం చేశారు. 1933లో బరంపురం వేదికగా జరిగిన 'అభినవాంధ్ర కవి పండిత సభ'లో పట్టుమని పాతికేళ్లయినా లేని ఓ యువకుడు

**'మారో మారో.. మారో మారో**
**ఒకటి రెండు.. మూడు నాలుగు**

మారో మారో.. మారో మారో' అంటూ కొనసాగిన కవితను వినిపించి సభికులను సంభ్రమాశ్చర్యాల కు గురిచేశాడు. ఆ యువకుడే శిష్ట్లా. విభిన్న కో ణాల్లో దర్శనమిచ్చే బహురూపి. కొందరికి అతను అరాచకవాది. మరి కొందరికి మార్గదర్శకం చేసే అభ్యుదయవాది. విచిత్రం ఏమిటంటే, ఎవరు ఏ కోణంలో చూస్తే, వారికి ఆ విధంగానే కనిపిస్తాడు. తెలుగు సాహితీలోకం మొత్తం తన గుప్పెట్లో పెట్టుకున్నట్టు తన ప్రస్తానాన్ని కొనసాగించాడు. చదువు... ఉపాధ్యాయ వృత్తి... విచ్చలవిడి జీవితం.. రామలతో వివాసం వంటి పలు ఘట్టాలను యామిజాల ఆనంద్ వివరించారు. కొంత మంది బలవంతంగా మద్యం తాగించి, విషమిచ్చి హత్య చేసినట్టు తమకు అందిన సమాచారాన్ని కూడా పంచుకున్నారు. తెలుగు సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించిన ఒక మహారచయిత జీవితం విషాదాంతం కావడం దురదృష్టకరం.

**– బిఎల్**

## కొత్తదారుల్లో నడక..

శిష్ట్లా రాసిన 'విష్ణుధనువు'కు ముందుమాట రాస్తూ... 'ఆధునిక కవిత్వం అనేక ముఖాల ప్రవహిస్తున్నది. కొంత మంది కవులు అప్రయత్నంగా నిరంకుశులై, నిజేచ్ఛానుసారంగా నడుస్తున్నారు. సంప్రదాయానికి సంబంధించినంత వరకూ దేనికైనా ఆదరము. మామూలు మార్గం మంచిగా కన బడినట్టు కొత్త మార్గం గోచరించదు. రంజన కోసం రాత్రింబగళ్ళు కష్టపడే కవులవలె కాకుండా నవీనులకు ఆదరం కావలె అనే అభిలాష కూడా లేనే లేదు. నిజాశయం వ్యక్తం చేసే కొద్ది మంది కవికుమారుల కృషి సఫలమయిందా లేదా అని చూస్తూ ఉంటే, కొంతవరకు ఫలవంతమయిందని తోస్తున్నది. గతానుగతికంగా కవితావాహినిని కదలనివ్వక పెడతోవల తొక్కినవారి వల్లనే కావ్యక్షేత్రాలు కళకళలాడుతున్నవి' అన్నారు ప్రముఖ సాహితీవేత్త తల్లావఝ్జల శివశంకరశాస్త్రి. తనకు తెలిసినంత వరకూ అందరూ వెళ్లే తోవ ను కాదని, తన కంటూ ఒక మార్గాన్ని నిర్మించుకొని, ఆ నవీన మార్గంలో నడిచిన మొదటి రచయితగా శిష్ట్లాను అభివర్ణించారు. పూడిపెద్ది వెంకట రమణ య్య, శ్రీశ్రీ, నారాయణబాబు, పురిపం డా అప్పల స్వామి, రుక్మిణీనాథ శాస్త్రి, కొ డాలి ఆంజనేయులు వంటి ఎంతో మంది హేమాహేమీలు శిష్ట్లాను అనుసరించారు. మన సంగీతంతోపాటు తెల్లవారి సంగీతం కూడా తెలిసిన వాడు కావడంతోవల్లే కొంత విపరీత మార్గంలో విహరించాడని తల్లావఝ్జల అభిప్రాయం. అదీ నిజమే. కవి సర్వస్వతంత్రుడైనప్పుడు ఛందస్సుల సంకెళ్లెందుకు? యతిప్రాసన గుదిబండలెందుకు? 'విష్ణుధనువు' ప్రథమంలో పచ్చివెలక్కాయ గొంతున పడ్డట్టుంటుందని, ఓపిక పట్టి చదివితే ఆయన కావ్యహృదయం కనుక్కోవచ్చునీ కితాబునిచ్చారు తల్లావఝ్జల. ఆయన చెప్పిన విధంగానే శిష్ట్లాలో ప్రతిభావంతుడి లక్షణాలన్నీ కనిపిస్తాయి. అతని భావన బసుముఖాల పరిగెత్తి, ఎక్కడెక్కడి విషయాలనో ఏర్చి కూర్చుతుంది. అతని పంక్తుల్లో ఎన్ని ఉపమానాలు... ఎన్ని ఉత్ప్రేక్షలు.. ఎన్ని రూపకాలు కిటకిటలాడుతున్నాయో! శిష్ట్లా రచనలు మెదడునుకాదు.. మనస్సును తాకుతాయి. ఆరోజుల్లో అతని విధానం పెడసరంగా అనిపించ ఉండవచ్చు. కానీ, అతని నిబద్ధతతకు, గుండెధైర్యానికి జేజేలు పలకాలి. మొదట మార్గం వేసిన వాడికే రాళ్ల దెబ్బలు... ముళ్ల చురుక్కులు. ఆ తర్వాత నడిచేవారంతా అదృష్టవంతులు. శిష్ట్లా తెంపరితనమే వందలు... వేల మందిని నడిపిస్తున్నది. తెలుగు సాహిత్యానికి కొత్త సొబగులు అద్దింది.





అరుదైన ఫొటో

**ఊల్ఫ్ క్రికెట్ ప్రాక్టీస్..**

ఈ ఫొటోలో సీరియస్‌గా ప్రాక్టీస్ చేస్తున్నది బ్రిటన్‌కు చెందిన ప్రముఖ నవలా రచయిత్రి వర్జీనా ఊల్ఫ్. పక్కన నిలబడి చూస్తున్నది ఆమె సోదరి వెనెస్సా బెల్. 1882 జనవరి 25న లండన్‌లో జన్మించిన ఊల్ఫ్ 1941 మార్చి 28న తుదిశ్వాస విడిచింది. ఆమె అసలు పేరు ఎడెలైన్ వర్జీనియా స్టెఫెన్. లండన్‌లో నివసించే జూలియా ప్రిన్సెప్ జాక్సన్, లెస్లీ స్టెఫెన్ దంపతుల ఏడో సంతానంగా జన్మించిన ఊల్ఫ్ చిన్నతనం నుంచే అటు చదువులోనూ, ఇటు ఆటపాటల్లోనూ ఉత్సాహంగా ఉండేది. అద్భుతమైన రచనా శైలిని అలవరచుకొని, 20వ శతాబ్దపు అత్యుత్తమ సాహితీకారుల్లో ఒకరిగా పేరు సంపాదించింది. 1894లో తీసిన ఈ ఫొటోలో, ఊల్ఫ్‌తోపాటు ఉన్న ఆమె సోదరి ప్రముఖ కళాకారిణిగా గుర్తింపు సంపాదించింది. బ్లూమ్స్‌బరీ గ్రూప్‌లో కీలక వ్యక్తిగా ఎదిగింది. వీరిద్దరూ కలిసి క్రికెట్ ఆడుతున్న దృశ్యం, ఆ రోజుల్లో సంఘంలో ఒక హోదాను సంపాదించిన వారి సాధారణ జీవితానికి అద్దం పడుతుంది. రోజువారీ కార్యకలాపాలతోపాటు, మేధో, కళాత్మక ప్రయత్నాలను సమతుల్యం చేసే జీవన శైలిని ఊల్ఫ్ అనుసరించిందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నది. క్రికెట్ ఆట బ్రిటీష్ సంప్రదాయం. ఏ కొద్దిపాటి సమయం దొరికినా క్రికెట్ ఆడడం ఒక అలవాటు. ఈ ఆటవిడుపే ఊల్ఫ్, వెనెస్సాలను తమతమ రంగాల్లో అత్యున్నత శిఖరాలకు చేర్చింది.

## నాటక రచనల్లో మేటి ఆస్కార్ వైల్డ్



నేడు వర్ధంతి

ఆంగ్ల నాటక రచయితల్లో అగ్రస్థానాన్ని ఆక్రమించే కొద్ది మంది ప్రముఖుల జాబితాలోకి వస్తాడు ఆస్కార్ వైల్డ్. ఐర్లాండ్‌లోని డబ్లిన్‌లో 1854 అక్టోబర్ 16న జన్మించిన వైల్డ్ తల్లిదండ్రులు విద్యాధికులు కావడంతో, చిన్నతనం నుంచే సాహిత్యం పట్ల మక్కువ పెంచుకున్నాడు. తండ్రి సర్ విలియమ్ వైల్డ్ ఐర్లాండ్‌లోనే పేరొందిన కన్ను, చెవి వ్యాధుల స్పెషలిస్టు. వైద్య రంగానికి చేసిన సేవలకుగాను బ్రిటిష్ ప్రభుత్వం 1864లో ఆయనకు 'సర్' బిరుదునిచ్చి సత్కరించింది.ఆయన పురావస్తు శాస్త్రం, జానపద కళలపై కొన్ని పుస్తకాలు రాసి, రచయితగా కూడా తనను తాను నిరూపించుకున్నాడు. వైల్డ్ తల్లి జేన్ ఫ్రాంకెస్కా ఆ కాలంలో మంచి రచయిత్రిగా పేరు సంపాదించుకుంది. అంతేగాక ఆమె యంగ్ ఐర్లాండర్స్ అనే విప్లవ సంస్థకు రచనలు చేసింది. జీవితాంతం ఐరిష్ జాతీయురాలిగానే గడిపింది. డబ్లిన్‌లోని ట్రినిటీ కాలేజీ వెనుకగల లింకన్ ప్లేస్‌లో విలియమ్ ఒక డిస్పెన్సరీని నడుపుతూ, పేదలకు ఉచిత సేవలు అందించేవాడు. తల్లిదండ్రుల నుంచి సమాజ సేవ వైల్డ్‌కు వారసత్వంగా సంక్రమించింది. తల్లిని స్ఫూర్తిగా తీసుకొని రచనా వ్యాసాంగాన్ని కొనసాగించాడు. నవలలు, కథలు, కవితలు కూడా రాసేవాడు. అయితే, వైల్డ్ నాటకాలు జగత్ప్రసిద్ధి పొందాయి. 'ది ఇంపార్టెన్స్ ఆఫ్ బీయింగ్ ఎర్నెస్ట్', 'ది పిక్చర్ ఆఫ్ డార్సియన్ గ్రే' వంటి రచనలు ఆయనకు ఆంగ్ల సాహితీ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపును సంపాదించిపెట్టాయి.1900, నవంబర్ 30న తన 44వ ఏట తుదిశ్వాస విడిచిన వైల్డ్, జీవితాంతం నిజాయితీగా బతికాడు. అద్భుతమైన రచనా పాటవాన్ని ప్రదర్శించడంతో, ఆయనకు వేల సంఖ్యలో అభిమానులయ్యారు. సమకాలీన రచయితల్లో అగ్రగణ్యుడిగా కీర్తి గడించిన వైల్డ్ రచనలు అప్పట్లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాయి. అతను సృష్టించిన పాత్రలు, కథనంలో అవి ఇమిడిపోయిన వైన్యం భవిష్యత్ తరాల వారికి మార్గదర్శకంగా నిలుస్తాయి. ఇంగ్లీషులోనేగాక, ఫ్రెంచ్‌లోనూ వైల్డ్ పలు రచనలు చేశాడు. భార్య కాన్‌స్టన్స్ లాయిడ్, పిల్లలు సిరిల్ హాలాండ్, వైవయాన్ హాలాండ్‌తో చక్కని జీవితాన్ని గడిపాడు.

## అనుభవాలను రంగరించిన రచనలు..



నేడు జయంతి

శామ్యూల్ లాంగార్న్ క్లెమెన్స్ అంటే చాలా మందికి తెలియకపోవచ్చు... కానీ, మార్క్ ట్వెయిన్ అంటే ఇట్టే గుర్తుపడతారు. 'టామ్ సాయర్ సాహస యాత్రలు' (ది అడ్వంటచర్స్ ఆఫ్ టామ్ సాయర్), హికల్బెరీ ఫిన్ సాహస యాత్రలు (ది ఎడ్వంచర్స్ ఆఫ్ హిక్బెరీ ఫిన్), 'రాజు పేద' (ది ప్రిన్స్ అండ్ పాపర్) వంచి రచనలతో ప్రపంచ ప్రఖ్యాతి ఆర్జించాడు. శామ్యూల్ కలం పేరు 'మార్క్ ట్వెయిన్' వెనుక ఆసక్తికరమైన కథ ఉంది. అప్పట్లో పడవ ముందుకు వెళ్లేందుకు సరిపడ లోతు ఉందో లేదో చెప్పడానికి, కర్రతో నీటిని కొలిచేవారు. నీరు తగినంత ఉంటే, 'బై ది మార్క్, ట్వయిన్' అని అరిచేవారు. అంటే, ట్వెయిన్ (12 అడుగులు) కంటే ఎక్కువగానే ఉందని అర్థం. ఆ వాక్యంలోని మార్క్ ట్వెయిన్‌ను శామ్యూల్ తన కలం పేరుగా మార్చుకున్నాడు. అతని రచనలన్నీ అనుభవాల ఆధారంగా చేసినవే. అందుకే అవి అంతగా పాఠకుల మనసుల్లోకి వెళ్లిపోయాయి. 1835, నవంబర్ 30న, జాన్ మార్షల్, జన్నే లాప్టన్ క్లెమెంట్స్ దంపతులకు ఆరో సంతానంగా జన్మించిన శామ్యూల్ సంపన్న కుటుంబంలో జ న్మించినప్పటికీ, చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో పేదరికాన్ని అనుభవించాడు. కొంతకాలం ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేశాడు. అక్కడ ఇమడలేక దేశ దిమ్మరిలా న్యూయార్క్, ఫిలడేల్ఫియా తదితర ప్రాంతాల్లో కొంతకాలం పని చేశాడు. చివరికి మిసిస్సిపీ నదిపై తిరిగే పడవ కళాసీగా చేరాడు. అక్కడే ఎక్కువ కాలం పనిచేసి, సరంగుగా ఎదిగాడు. సాహి త్యం పట్ల ఉన్న అభిమానం అతనిని రచయితగా మార్చింది. చిన్నతనంలో తమ ఇంట్లో నీగ్రోలు పనిచేయడం, వారు ఎ న్నో కష్టాలు పడడం అతనికి తెలుసు. ఆ అనుభవాలే అతని రచనల్లో పాత్రలుగా కనిపిస్తాయి. కళాసీగా తన అనుభవానికి ఊహను జోడించి, 'టామ్‌సాయర్' వంటి అద్భుతమైన పాత్రను సృష్టించాడు. 1910 ఏప్రిల్ 21న భౌతికంగా దూరమయ్యాడు. రచనల రూపంలో మాత్రం మన మధ్యే ఉన్నాడు.

## హిమశిఖర బోధ !



హిమ శిఖరాగ్రం చెబుతోంది..
మహోన్నత విలువలతో జీవించమని !
వెలిగే దీపం చెబుతుంది...
చమురు ఉన్నంత వరకే బతుకని !

రాలే ఆకు అంటోంది...
ఏదీ ఒక రోజు రాలిపోవల్సిందేనని !
పూసిన పువ్వు చెబుతోంది..
పరిమళ ఆకర్షణలు క్షణ భంగురాలని !

పచ్చని చెట్టు బోధిస్తోంది..
పూలు, పండ్లు, నీడనివ్వమని !
కష్టనష్టాలు తెలుపుతున్నాయి..
ధైర్యంగా ఎదుర్కొంటూ వెళ్లమని !

రాత్రి పగలు చెబుతున్నాయి..
సుఖం వెంట దుఃఖం ఉంటుందని !
జీవ నది పలుకుతోంది..
ఎండిన గొంతులు తడపమని !

కాల్చిన సిగరెట్టు పొగ చెబుతోంది..
పీల్చినోడి ఊపిరితిత్తులు కాలుస్తానని !
మట్టి మనిషితో అంటోంది..
ఏ నాటికైనా నాలో కలవాల్సిందేనని !

సముద్రం చెబుతోంది..
మనసు కలుషితమైతే చెడగొడతావని !
ఊట బాయి వివరిస్తోంది..
తోడిన కొద్ది శరీర శక్తి ఊరుతుందని !

శ్రమ స్వేదం చెబుతోంది..
లక్ష్యసిద్ధి సాక్షాత్కారమవుతుందని !
ఆత్మీయ ఆలింగనం చెబుతోంది..
మనసులు గెలుచుట సులభమని !

కాలి నడక అంటోంది...
జీవన పోరాటం ఒంటరిదని !
అన్యోన్య దాంపత్యం చెబుతోంది..
ఒకటి ఒకటి కలిస్తే ఒకటే అని !

**ఎంఎస్ఆర్, 9949700037**

## ఈ వారం కవితలు

## ఇంటి దీపాలు

పుట్టుకతోనే పసి నవ్వులు దాచి..
కాళ్ళ మట్టెలతో కదలికల్ని కుదించి..
పసుపు తాడుతో స్వేచ్ఛను హరించి..
గృహిణి పాత్రలో ఒదిగింది మగువ !

గృహమే కదా స్వర్గసీమంటూ..
ఇల్లే తన అనంత లోకమంటూ..
తనను తానే త్యాగం చేసుంటూ..
బంధాల బంధనాల్లో చిక్కింది స్త్రీ !

సృష్టికి ప్రతి సృష్టికే కదా..
ఆడ జన్మ అర్థం పరమార్థమని..
సహనమే సతికి పర్యాయపదమని..
శాంతి సంపదే ఆమె సొంతమైంది !

అతివ అన్నామృత వర్షిణి..
ఆమె హస్తమే అక్షయపాత్ర..
మగువేగా మర్యాదల పొదుగు..
ఇల్లాలే కదా ఇంటి దేదీప్య దీపం !

ఆమె మనసే అనంత సాగరం
అమ్మతనమే అత్యద్భుత వరం
ఆవిడ స్పర్శయే అపూర్వ లేపనం
శారదలా సకల విద్యల సమ్మిళితం !

ఆమె జననం అనివార్య అవసరం
ఆమె ఒడి ఆది గురువు నిలయం
ఆమె మది కష్టసుఖాల మందిరం
ఆమె లక్ష్యమే కుటుంబ సంతోషం !

స్త్రీయే కదా ఆర్థికశాఖ మంత్రిణి
జ్వరాలకే దడ పుట్టించే వైద్యురాలు
ఆమే కదా సకల విద్యల తావు రేవు
అశ్రువుల్నే అధిగమించగల అర్ధాంగి !

మగని మనసెరిగిన మేధావి
పిల్లల ఆకలి వినగల వివేకి
ఇంటినే కోవెలగా మార్చే జ్ఞాని
ప్రకృతి ప్రసాద వరమేగా పడతి !

ఆమెలో ఆది మహాశక్తిని చూద్దాం
అతివలో అమ్మను చూసి తరిద్దాం
చిన్నారిలో చెల్లిని తలచి మురుద్దాం
మహిళలో మహిమగల దుర్గను దర్శిద్దాం !

**మధుపాళీ ,**
**9949700037**

## నేనో తెల్ల కాగితాన్ని



కాగితాన్ని నేనో తెల్ల కాగితాన్ని అద్దం
వలె స్వచ్ఛమైన శ్వేత వర్ణాన్ని
ఊహల రెక్కల ఉత్తరాన్ని
అయినను కాను ఒక్క వర్తమానాన్ని
భూత భవిష్యత్తు వర్తమానాల స్వాగతాన్ని !

చట్ట సౌధాలలో పిలుచుకునే శ్వేత పత్రాన్ని
విషయాలను విస్పష్టపరిచే హంస
లక్షణాన్ని
సాధికార నిబద్ధతకు ప్రమాణ పత్రాన్ని
సవాళ్ల సుడిగుండంలో తేలిపోయే
వటపత్రాన్ని
ప్రకటనల జాతరలో నేను ఓ కరపత్రాన్ని !

రాజుల మధ్య రాజీకి రాయబారాన్ని
రణానికి స్నేహ హస్తానికి వార్తా మానాన్ని
స్నేహ సందేశాల శాంతి కపోతాన్ని
నానా విధ రూపురేఖల లేఖాస్త్రాన్ని
కవి పండితుల పంటల క్షేత్రాన్ని !

మీ చేరాతలే నా నుదుటి రాతలు
సందేశాత్మక గీతలు రాతలే భగవద్గీతలు
అలరించే ఆచరణాత్మక యదార్థ రాతలు
సాహిత్య సత్కారాలు ,సన్మానాలు
చెడు రాతల చీత్కారాలు ఛీదరింపులు!

నా హృదయాన్ని అద్దంలా పరిచాను
ఛీదరించి చింపి వేస్తే ముక్కలవుతాను
మీరు ఆదరిస్తే ఉనికిని నిలుపు కుంటాను
అందరికీ అందుబాటులో ఉంటాను
ఎట్లా చేసినా మీ చేతి చలువే కదా!

తాళపత్రాల నుండి ఎ ఐ మెసేజ్ ల వరకు
నా రూపం మారిన అపురూపమే కదా
స్వేత పత్రం అంటే ఎందుకు తెల్లబోతారు
ఏట్లా చూసినా మీ అంతరంగ ఆవిష్కర్తనే
కదా!
నేను ఓ తెల్ల కాగితాన్నే కదా !

**పి.బక్కారెడి, 9705315250**



# బాపూజీ ఆశయాలను సాధించాలి

కోదాడ ఎంఎల్ఎ ఉత్తమ్ పద్మావతి

**ప్రజాపక్షం/కోదాడ:** స్వాతంత్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్‌పద్మవతి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారిపై కోదాడ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ స్వాతంత్ర, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీలరమేష్, టిపిసిసి డెలిగేట్ సిహెచ్ లక్ష్మీ నారాయణ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, పద్మశాలి సంఘం తెలంగాణ ప్రాంత అధ్యక్షులు కందుల కోటేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షులు అప్పం శ్రీనివాసరావు, కార్యదర్శి సంగిశెట్టి గోపాల్, పట్టణ అధ్యక్షులు గోలి నాగరాజు, నియోజకవర్గ అధ్యక్షులు కొంగర నరసింహారావు, నక్క చంద్ర పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల చేయూత అభినందనీయం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** తాము చదువుకున్న ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనివ్వడం అభినందనీయమని జిల్లా అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్‌లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంఎఎం పాఠశాలలో 198687 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితుల పాత్ర ఎంతో కీలకమని, ఆట పాటలు, కష్ట సుఖం ఇలా ఏదైనా అన్నింట్లో స్నేహితుల సపోర్టు ఎంతో మనోధైర్యాన్ని కల్పిస్తుందన్నారు. పాఠశాల రోజులు అందరి జీవితాల్లో ఎంతో మధురమైందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాఠశాలకు నూతనంగా ఏర్పాటు చేసిన గేటును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెలుగు నాగార్జున, వాస కృష్ణ, సాయి కృష్ణ, బండ్ల రవి, ఓరుగంటి రాంమూర్తి, గందూరి కృష్ణ, విజయలక్ష్మీ, రాంబాయి, వర లక్ష్మీ, రాధా, సరళ, పాతిమా పాల్గొన్నారు

# 27 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత



**ప్రజాపక్షం/సూర్యాపేట:** అక్రమంగా తరలిస్తున్న 27.50 క్వింటాల నల్ల బెల్లం, 40 కెజిల బెల్లంతో పాటు 10 లీటర్ల నాటుసారాయిని పట్టుకున్నట్లు సూర్యాపేట ఎక్సైజ్ సిఐ మల్లయ్య తెలిపారు. నల్లగొండ జిల్లా ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్, జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్ లక్ష్మణ్ నాయక్‌ల ఆదేశాలతో ఆదివారం తెల్లవారుజామున చివ్వెంల మండలం లక్ష్మీ నాయక్తండా సమీపంలో ఎపి ఎన్‌ఫోర్స్‌మెంట్, నల్లగొండ బృందంతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఎక్సైజ్ సిఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం వాహనాల తనిఖీలో ఎపి 10యుఎ 1467 నెంబర్ గల డిసిఎంను తనిఖీ చేయగా అందులో 27.50 క్వింటాల నల్లబెల్లం, 40కెజిల పట్టిక, 10 లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డిసిఎంలోని వ్యక్తి నాగయ్యను అరెస్టు చేయగా ఏ2 లూనావత్ వెంకన్న, ఏ3 ఉపేందర్, ఏ4 వెంకటేశ్వర్లులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ రాకేష్, ఎక్సైజ్ ఎస్‌ఐలు సురేందర్ బెనర్జీ, గోపాల్ రావు, శోభారాణి, హెడ్ కానిస్టేబుల్‌లు అఫ్సర్, ఆయుబ్, గఫూర్, కానిస్టేబుల్ క్రాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

# 26న జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని టియుసిఐ జిల్లా అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని లెనిన్ నగర్‌లో నిరసన కార్యక్రమాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26న జిల్లా, మండల కేంద్రాల్లో జరిగే నిరసన ప్రదర్శనను టియుసిఐ, ఎఐపికెఎస్, ఎఐపికెఎంఎస్ సంఘాలు సంయుక్తంగా నిర్వహించాలన్నారు. దేశ వ్యాప్తంగా రూ. 26వేల కనీస వేతనం అమలు చేయాలన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో లబ్ధిదారులకు 14 రకాల ఆహార వస్తువనలుఉ అందించాలన్నారు. నిరసన కార్యక్రమాలకు ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, కా ర్మికులు, విద్యార్థులు, యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గులాం హుస్సేన్, పాల్వాయి రాములు, పుప్పాల ఉపేందర్, శ్రీరాం, జయమ్మ, లక్ష్మీ, రేణుక, చిట్టి పాల్గొన్నారు.

# జిల్లా సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఈనెల 26న జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించే జిల్లా సన్నాహక సమావేశాన్ని బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ చేపట్టిన దీక్ష దివాస్ 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను సన్నాహక సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, నాయకులు నిమ్మల శ్రీనివాస్ గౌడ్, గోపగాని వెంకటనారాయణ గౌడ్, ఉప్పల ఆనంద్, నెమ్మాది భిక్షం, బాషా, ముద్ద మధుసూదన్ రెడ్డి, రవీందర్ నాయక్ పాల్గొన్నారు.



# బిసిలను అగౌరవపరిస్తే సహించేది లేదు

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**ప్రజాపక్షం/ హాలియా :** బిసిల ఆత్మగౌరవాన్ని అగౌరవపరిస్తే చూస్తూ ఊరుకోబోమని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. ఆదివారం హాలియాలో కవయిత్రి మొల్ల విగ్రహ శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గతంలో ఇక్కడ కవయిత్రి మొల్ల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కొన్ని పనులు చేపట్టారు. అనంతరం జరిగిన పరిణామాలతో వారు నిర్మించిన చిన్నపాటి దిమ్మెను మున్సిపల్ అధికారులు కూలగొట్టారు. ఈ విషయమై నియోజకవర్గ శాలివాహన సంఘం నాయకులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను ఆశ్రయించారు. దీంతో తీన్మార్ మల్లన్న ఆదివారం హాలియాలో శాలివాహనులు నిర్మించుకున్న దిమ్మెను కూల్చిన ప్రాంతాన్ని పరిశీలించి అక్కడే తిరిగి మొల్ల విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బిసిల రిజర్వేషన్ల పై కుందూరు జానారెడ్డి ద్వంద వైఖరి ఎండగట్టాలని చెప్పారు. రాష్ట్రంలో బిసి జనాభా ఎక్కువ ఉన్నప్పటికీ వారికి చట్టసభల్లో కూర్చుని అవకాశాలు లేక ఈ అగ్రవర్ణాల వారు రాజ్యాన్ని ఏలుతున్నారని తెలిపారు. రానున్నది బీసీల రాజ్యమే అని ఈ అగ్రవర్ణాల వారు గుర్తించాలని హితవు చెప్పారు. డిసెంబర్లో అన్ని జిల్లాలో బిసి భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామని దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి బిసిల ఐక్యతను ఎత్తిచూపుతామని తెలిపారు. కవయిత్రి మొల్ల విగ్రహాన్ని ధ్వంసం చేయించిన మున్సిపల్ కమిషనర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అందరికీ ఆదర్శప్రాయురాలైన కవయిత్రి మొల్ల విగ్రహాన్ని హాలియాలో ఏర్పాటు చేసి తీరుతామని ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న శబదం చేశారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలకృష్ణ, సూర్యారావు, ఒట్టే జానయ్య యాదవ్, తండు సైదులు గౌడ్, మహేష్ గౌడ్, చంద్రశేఖర్, తమ్మడబోయిన అర్జున్, నల్గొండ సుధాకర్, పొదిల్ల శీను, సురభి రాంబాబు, వెంకటయ్య పాల్గొన్నారు.

# ఐకెపి కేంద్రంలో గిరిజన రైతు ఆత్మహత్యాయత్నం

కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లర్ తిరిగి పంపించారని మనస్థానం



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** ఐకెపి కేంద్రంలో కౌలు రైతు అమ్మకానికి తీసుకవచ్చిన ధాన్యాన్ని తగు నాణ్యత ప్రణాలు చూసి కాంటా వేసిన ధాన్యాన్ని కేంద్రం నిర్వహకులు లారీ లోడ్ చేసి కోదాడలోని రైస్ మిల్లుకు పంపించారు. ఆ ధాన్యాన్ని తరలించిన 8రోజుల తరువాత నాణ్యత లేదని సదరు రైస్ మిల్లర్ తిరిగి పంపించడంతో బాధిత రైతు ఆదివారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అన్నారం ఆవాసం సోమ్లాతండాకు చెందిన గుగులోతు కీమా నాయక్ దంపతులు అదే గ్రామానికి చెందిన పొగుల రామకృష్ణరెడ్డి పొలాన్ని కౌలుకు తీసుకున్నారు. దీంతో వారి ధాన్యాన్ని ఐకెపి కేంద్రానికి తరలించగా ఈనెల 16న 425 బస్తాల ధాన్యాన్ని కాంటా వేసిన కేంద్రం నిర్వహకులు కోదాడలోని వెంకటరమణ ట్రేడర్స్ మిల్లుకు ధాన్యాన్ని పంపించారు. ధాన్యాన్ని పరిశీలించిన మిల్లు నాణ్యత లేదని చెప్పడంతో ఈనెల 18న రైతు కీమా దంపతులు, కేంద్రం నిర్వహకులు మిల్లు వద్దకు వెళ్లారు. దీంతో మిల్లు యజమాని బస్తాకు 3కెజిల చొప్పున తరుగు తీస్తామని చెప్పడంతో కాము 1కెజి తరుగు తీయాలని చెప్పారు. అనంతరం ధాన్యాన్ని పరిశీలించిన టిఎ అధికారి 7కెజిలు ఇవ్వాలని చెప్పగా రైతు ఒప్పుకోలేదు. దీంతో నాలుగు రోజుల అనంతరం మిల్లు యజమాని శనివారం లారీ లోడును తిరిగి పంపడంతో కీమా దంపతులు తీవ్ర మనస్థాపానికి గురై కేంద్రం వద్ద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించారు. పక్కనే ఉన్న రైతులు వెంటనే స్పందించి వారిని రక్షించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ దయానంద్, వ్యవసాయ శాఖ ఏడి బాల కృష్ణ, ఎపిఎం రాంబాబులు సంఘటన స్థళానికి చేరుకోని విషయాన్ని పరిశీలించి వివరాలను జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబుకు అందించారు. దీంతో ఆయన సదరు లారీ లోడు ధాన్యాన్ని కోదాడ వెంకటరమణ మిల్లుకు తీసుకరావాలని ఆదేశించారు. దీంతో రైతు కీమాతో పాటు మరో ఇద్దరు రైతులు అధికారులకు ప్రత్యేక ధాన్యవాదాలు తెలిపారు. గతంలో ఈ మిల్లుకు వెళ్లిన ధాన్యాంకు బస్తాంకు 2కెజిల చొప్పున తరగు తీసినట్లు పలువురు రైతులు తెలిపారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు మిల్లర్లు తరుగు తీయకుండా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

# మన సంస్కృతీ సంప్రదాయాలు దేశానికే ఆదర్శం

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎస్):** మన సంస్కృతి, సంప్రదాయాలు దేశానికే ఆదర్శమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నెమ్మికల్ సమీపంలో సూర్యాపేట శ్రీ సంతోషిమాత అమ్మవారి దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించి కార్తీక వన సమారాధన మహోత్సవ వేడుకలకు ఆయన సతీమణి గుంటకండ్ల సునీత జగదీష్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిశ్రద్దలతో చేసిన పూజలు ఫలించి అందరి కోరికలు నెరవేరాలన్నారు. అన్ని రంగాలతో పాటు ఆధ్యాత్మీకతలోను సూర్యాపేట ముందు వరుసలో ఉందన్నారు. ఈ ప్రాంతంలో ప్రశాంతవాతావరణాన్ని పెంచుకొని అన్ని పండుగలు ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఈ వేడుకల్లో ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, సూర్యాపేట మున్సిపాలిటి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక దీపారాధన, పంచామృత అభిషేకం, జలదీపోత్సవం, గణపతి, శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మీక సంకీర్తనలను అలకించిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం భక్తులతో కలిసి సామూహిక కార్తీక వనభోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# చింతలపాలెం మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/చింతలపాలెం:** మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో పలు అభివృద్ధి పనులకు రూ. 32.97 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లారెడ్డిగూడెం, కిష్టపట్టె ప్రజలకు నాకు గత 30 సంవత్సరాల నుండి అనుబంధం ఉందని, నన్ను ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపిగా ఆదరించారన్నారు. నున్ను ఆదరించిన మీ అభివృద్ధి బాధ్యతను నేను తీసుకుంటానని చెప్పారు. చింతలపాలెం, కిష్టపట్టెకు రోడ్లు, లిఫ్టులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మండలంలోని ప్రతి లిఫ్టును నడిపించేలా కృషి చేస్తానన్నారు. మండల కేంద్రం ఏర్పాటై 8 సంవత్సరాలు వుతున్న నేటికి గత పాలకులు ప్రభుత్వ కార్యాలయాలకు స్వంత భవనాలు లేకపోవడం లేదన్నారు. తమ ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి రూ. 7.97 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అడిషనల్ ఎస్‌పి నాగేశ్వర్ రావు, ఆర్అండ్‌బి అధికారులు, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# భువనగిరిలో 16వ 'ఈశా గ్రామోత్సవం'



**ప్రజాపక్షం/యాదాద్రి :** 16వ ఈశా గ్రామోత్సవం భారతదేశ క్రీడా స్ఫూర్తి సమర్పించు రూరల్ ప్రీమియర్ లీగ్ 2024 సౌత్ ఇండియా లెవెల్, యాదాద్రి భువనగిరి జిల్లా స్పోర్ట్స్ డే కాంపిటేషన్ ప్రభుత్వ బాలుర జూనియర్ కలశాల భువనగిరిలో నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని వివిధ గ్రామల నుండి 16 సవంత్సరాల నుండి 50 సవంత్సరాల వరకు పై బాడిన మహిళలు, యువతి యువకులు ఈ క్రీడా పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. త్రో బాల్ 13 గ్రూపులు, వాలీ బాల్ 18 గ్రూపులు, అదేవిదంగ ఫన్నీ గేమ్స్, ముగ్గుల పోటీలు కూడా ఏర్పటు చేశారు. త్రో బాల్ 1 కోర్ట్, వాలీ బాల్ 3 కోర్ట్‌లు ఏర్పటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో క్రీడా స్థలము ఒక్క పండుగ వాతావరణము రంగుల ముగ్గులతో, పువ్వులు అలంకరించి ఆరట్టి చెట్టులతో తోరణాలు, పలేటూరి పండుగ వాతావరణము ఏర్పాటు చెయ్యడం జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా స్పోర్ట్స్ డే కాంపిటేషన్‌కు ముఖ్య అతిధిగా జిల్లా యువజన మరియు క్రీడల అదికారి కె.ధనంజనేయులు, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ బాల కృష్ణ, ఈశ ఫౌండేషన్ వాలెంటర్ పవన్, దివ్య వివిధ క్రీడలకు సంబందించి పిడి/పిఇటిలు పాల్గొన్నారు. అదేవిదంగా వివిధ గ్రామాలనుంచి ఆదిక సంఖ్యలో మహిళలు యువతి యువకులు 300 మంది వరకు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రి రోగులకు అల్పాహారం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక ఏరియా ఆసుపత్రిలోని రోగులకు, సహాయకులకు ప్రతి రోజు ఉదయం సమయంలో లయన్స్‌క్లబ్ శ్రీనివాస్ నేతృత్వంలో అల్పాహారం అందిస్తున్నారు. ఆదివారం నాటికి అల్పాహార కార్యక్రమం 750వ రోజుకు చేరుకుంది. కాడింగు సైదులు సతీమణి యాదమ్మ, దాసరి నరసింహా నాగమ్మ, చెల్లెలు మంగతాయారుల దాతృత్వంతో మీల్స్ అండ్ మీల్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోల సైదులు, బిఎం.నాయుడు, సింగు రాంబాబు, రాంరెడ్డి, గట్టు సేవిత, స్వప్న, విజయ, మాధవి, వెంకటేశ్వర్లు, నాగభూషణం, రమేష్, తారాసింగ్ పాల్గొన్నారు.

# ఫీజులకు డబ్బు లేక కూలీ పనుల్లో.... గిరిజన బిడ్డ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రస్తుతం ఓ హార్టికల్చర్‌లో సీటు వచ్చినా ఫీజు చెల్లించేందుకు డబ్బులు లేక నిరుపేద గిరిజన బిడ్డ కూలీ పనుల బాట పట్టింది. తన లక్ష్యం చేరుకునేందుకు సాయం చేసే చేతుల కోసం ఎదురుచూస్తుంది మౌనిక. మండలంలోని వాటర్‌ట్యాంక్ తండా గ్రామానికి చెందిన నూనావత్ లింగా, శాంతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు పెద్ద కూతురు మౌనిక, చిన్న కూతురు కల్యాణి. కాగా మౌనిక మూడేళ్ల వయస్సులో తల్లి మరణించగా తండ్రి మరో పెళ్లి చేసుకోని తన దారి తాను చూసుకున్నాడు. అప్పటి నుంచి అక్కా చెల్లెళ్లను వాళ్ల అమ్మమ్మ బాణావత్ లచ్చి మామయ్య శ్రీనులు వీళ్ల ఆలనాపాలన చూసుకున్నారు. మౌనిక చదువు కోసం నల్లగొండ చారుమతి అనాధశ్రమంలో చేర్చారు. చదువుపై తనకున్న ఆసక్తితో బైపీసీ విభాగంలో 9.9 గ్రేడ్ మార్కులతో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. పసి ప్రాయంలోనే తల్లిదండ్రుల ప్రేమకు దూరమైన ఆ యువతి జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతుంది. శ్యామల నాగసేనారెడ్డి ప్రోత్సాహంతో ఈఏపీ సెట్, నీట్ పరీక్షలను రాసింది. దీంతో మహబూబాబాద్ జిల్లా మాల్యాలలోని హార్టికల్చర్ కళాశాలలో కన్వీనర్ కోటాలో సీటు వచ్చింది. అయితే అమ్మమ్మ బానావత్ లచ్చి, మేనమామ శ్రీను కొంత చదువులకు సాయం చేస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో ఫీజు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో తన చదువును కొనసాగించేందుకు అవసరమైన ఫీజు చెల్లింపుకు ఉన్నత చదువుకు వ్యాపార, సామాజిక వేత్తలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తుంది. చదువుకోని డాక్టర్ అవుతానని తరువాత నాలాంటి వారికి చేయూతనిస్తానని మౌనిక అంటుంది.

# ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఆరు దశాబ్దాల పాటు ఎంతో మంది ఉద్యమకారులు పోరాడి సాధించుకున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు సామ అంజిరెడ్డి, ఉద్యమకారులు కుంట్ల ధర్మార్జున్‌లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చి వారికి తగిన గౌరవం కల్పించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో ఊరూరా నిర్వహించే పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్ళు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారు సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉద్యమించిన ఉద్యమకారులను విస్మరించిన ప్రభుత్వాలకు తగున గుణపాఠం తప్పదన్నారు. మలిదశ ఉద్యమకారులు 241కిలో మీటర్లు పాదయాత్రగా ఊరురా సాగుతూ ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పిస్తూ ఆఖరుగా భద్రాచలం చేరుకొని ఉద్యమకారులను గుర్తించే సద్బుద్ధిని ప్రభుత్వానికి కల్పించాలని శ్రీరామచంద్రుడికి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ఉద్యమకారులకు తగిన గౌరవం, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ 1969 తొలిదశ ఉద్యమకారుల సంఘం నాయకులు బొమ్మిడి లక్ష్మీ నారాయణ, మిర్యాల వెంకటేశ్వర్లు, కొణతం అప్పిరెడ్డి, కోతి మాధవి మధుసూదన్ రెడ్డి, ఎస్‌కె యూసుఫ్, గోపి, గంగయ్య, యాకయ్య, సోమయ్య, సాయిగౌడ్, శైలేందర్, రాములు, రహమాన్ అలి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వాగు గుంతలో పడి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/ మునుగోడు:** ప్రమాదవశాస్తు వాగు గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని చోళ్ళేడు గ్రామంలో చోటు చేసుకుంది గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన దోటి సత్తయ్య (31) చిన్నప్పటినుంచి మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఇంటి నుండి వెళ్లి రెండు మూడు రోజులకు ఒకసారి వచ్చేవాడని అదే తరహాలో ఈనెల 21 తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయి ఇంటికి తిరిగి రాలేదు ఆదివారం ఉదయం అదే గ్రామానికి చెందిన వంగూరి శంకరయ్య అనే వ్యక్తి పెద్దమ్మ గుడి దగ్గర వాగు గుంతలో నీటిలో తేలాడుతున్న సత్తయ్య మృతదేహాన్ని చూసి అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నీటి గుంతలో నుంచి మృతదేహాన్ని తీసి పంచనామ నిర్వహించి శవ పరీక్ష నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు మా తమ్ముడు ప్రమాదవశాస్తు గుంటలో పడి చనిపోయాడని వృత్తిని సోదరుడు నరసింహా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమో దు చేసుకుని దర్యాప్తు జరుగుతున్నట్లు స్థానిక ఎస్సై ఈ రవితెలిపారు.

# గ్రామానికి వన్నె తెచ్చిన పేదింటి ఆణిముత్యం శిరీష



**ప్రజాపక్షం/నర్వ:** మండల పరిధిలోని ఉండేకోడు గ్రామంలోని ఈటె కాలమ్మ బాబు కుమార్తె శిరీష ఇటీవల వచ్చిన రిజల్ట్ డీఎస్సీలో టీచర్ జాబ్ రావడంతో గ్రామానికి వన్నె తెచ్చిన పేదింటి గ్రామ ఆణిముత్యం చదువు అనే ఆయుధంతో తన తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చేందుకు కష్టాల కడలి సామ్రాజ్యంలో పేదరికం అనే పునాదులను పెకిలించి తనకుంటూ పేజీని లీకించుకుని నేడు టీచర్‌గా సెలెక్టు కావడం జరిగింది. అందుకుగాను ఇంతకుముందు ఉండేకోడు జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పనిచేసిన టీచర్ లక్ష్మి నారాయణ ఆదివారం ఉండేకోడు వచ్చి తన దగ్గర చదువుకున్న విద్యార్థిని తానే స్వయంగా తయారు చేసిన సర్వీస్ బుక్కును అందజేసి శిరీషను అభినందించి వారి తల్లిదండ్రులను చిరు సన్మానం చేయడం జరిగింది. వారితో పాటు గ్రామం తరపున కూడా శిరీషను సత్కరించి అభినందించారు. గ్రామ పెద్దలను యువకులను ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నీరాజ్ ఉపాధ్యాయులు వెంకటేశ్, జగన్నాథ్, బాల్‌దాస్, ఉమాపతి, వెంకటయ్య , భగవంతు తదితరులు పాల్గొన్నారు.

# నర్వ మండల వాల్మీకి నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/నర్వ:** వాల్మీకి నూతన మండల కమిటీ ఎన్నిక నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల నీరజ్ అడ్వకేట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బీసీ కమ్యూనిటీ హాల్లో నూతన వాల్మీకి సంఘం మండల కమిటీని అన్ని గ్రామాల వాల్మీకి సభ్యులు కలిసి ఏ నర్వ మండల అధ్యక్షునిగా కావాలి అయ్యన్నను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా ఎం.రాములు గౌరవ అధ్యక్షులుగా ఎం.లక్ష్మణ్ ఉపాధ్యాక్షులు పెద్ద కడుమూరు ఆర్.నరసింహా ఉందేకోడు సహయక కార్యదర్శిగా చెరువు కృష్ణయ్య పాతరచెడు వీరితో పాటు మరో 10 మందిని సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నీరజ్ అడ్వకేట్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్చుటకు వాల్మీకులందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలో అన్ని గ్రామ కమిటీలు పూర్తి చేసి రాబోయే పంచాయితీ ఎలక్షన్లో వాల్మీకులందరు పోటీ చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న మండల కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అయ్యన్న ను అడ్వకేట్ పి.నిరాజ్ సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు సుధీర్, బి.ఉమాపతి, గడ్డం నరసింహా, మండల వాల్మీకి పెద్దలు నాయకులు వివిధ గ్రామాల వాల్మీకి సంఘం అధ్యక్షులు వాల్మీకి సభ్యులు పాల్గొన్నారు.



## నర్వ వాల్మీకి నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/నర్వ :** వాల్మీకి నూతన మండల కమిటీ ఎన్నిక నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల నీరజ్ అడ్వకేట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బీసీ కమ్యూనిటీ హాల్లో నూతన వాల్మీకి సంఘం మండల కమిటీని అన్ని గ్రామాల వాల్మీకి సభ్యులు కలిసి ఏ నర్వ మండల అధ్యక్షునిగా కావాలి అయ్యన్నను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా ఎం.రాములు గౌరవ అధ్యక్షులుగా ఎం.లక్ష్మణ్ ఉపాధ్యక్షులు పెద్ద కదుమూరు ఆర్.నరసింహా ఉందేకోడు సహాయక కార్యదర్శిగా చెరువు కృష్ణయ్య పాతరచెడు వీరితో పాటు మరో 10 మందిని సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నీరజ్ అడ్వకేట్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్చుటకు వాల్మీకులందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలో అన్ని గ్రామ కమిటీలు పూర్తి చేసి రాబోయే పంచాయితీ ఎలక్షన్లో వాల్మీకులందరు పోటీ చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న మండల కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అయ్యన్న ను అడ్వకేట్ పి.నిరాజ్ సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు సుధీర్, బి.ఉమాపతి, గడ్డం నరసింహా, మండల వాల్మీకి పెద్దలు నాయకులు వివిధ గ్రామాల వాల్మీకి సంఘం అధ్యక్షులు వాల్మీకి సభ్యులు పాల్గొన్నారు.

## భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య

**ప్రజాపక్షం/నర్వ:** నర్వ మండల పరిధిలోని జంగాంరెడ్డి పల్లి గ్రామానికి చెందిన కావలి కుర్మయ్య కొడుకు కావలి భగవంతు, 44 సం,, కులం బోయ వృత్తి వ్యవసాయం జంగంరెడ్డి పల్లి గ్రామం , ముగ్గురు అమ్మాయిలు, ఒక కుమారుడు కలరు నా రెండవ కుమార్తె అయిన ఆశ్విని భర్త మెట్ల సతీష్ 22 సం,, జంగంరెడ్డి పల్లి గ్రామం అదే గ్రామానికి చెందిన పెట్ల సతీష్ కొడుకు మెట్ల చెన్నప్పకు ఇచ్చి 2021 వ సం,,లో వివాహం చేశారు. వివాహం జరిగినప్పటి నుండి కొన్ని రోజులు బాగానే ఉన్నారు. తర్వాత వారికి ఒక ఆడ, మగ సంతానం కలదు. తర్వాత ఫిర్యాది అల్లుడు కుతుర్ని కోట్టి అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేదించేవాడు. తర్వాత రెండు, మూడు సార్లు పెద్దల సమక్షంలో మాట్లాడి సద్దిచెప్పి పంపించినాము కానీ అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు అదే విధంగా 8.11.2024 నాడు ఉదయం అందాజ 5 గంటల సమయంలో అట్టి బాదలు తట్టుకోలేక జీవితం పై విరక్తి చెంది గడ్డి మందు త్రాగింది. అతి గమనించిన అల్లుడు మొదటగా దర్శనీ హాస్పిటల్, మరికల్, తర్వాత ఎస్‌విఎస్ హాస్పిటల్ ఎంబిఎన్ఆర్, అపోలో హాస్పిటల్ హైదరాబాద్ లో చేర్పించినాము. చికిత్స పొందుతూ, కోలుకోలేక తేదిః23.11.2014 నాడు మధ్యాహ్నం 12 గంటల సమయంలో మరణించింది. నాకూతురి చావుకు కారణం అయిన నా అల్లుడు మెట్ల సతీష్‌తండ్రి చెన్నప్ప పై చట్టపరమైన చర్యలు తీసుకోగలరని ఫిర్యాదు పై కేసు నమోదు చేయనైనది అని తెలిపారు.



## 30న రైతు సదస్సు

**ప్రజాపక్షం / పెద్దమందడి :** ఈ నెల 30న మహబూబ్‌నగర్‌లో జరగనున్న రైతు సదస్సును రైతులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆదివారం పెద్ద మందడి మండలంలోని అలవాల, పెద్దమందడి, మణిగిల గ్రామాలలోని కొనుగోలు కేంద్రాల దగ్గరికి వెళ్లి రైతులను కోరడం జరిగింది. వ్యవసాయంలో వచ్చిన ఆధునాతన సాగు పద్ధతులు, మెలకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి సింగిల్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్ , సింగిల్ విండో డైరెక్టర్ నరేష్ ,కుమార్ ,కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, శ్రీనివాసులు, గట్టు మన్యం, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సిఎం సహాయ నిధి పేదలకు కొండంత భరోసా

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు పట్టణ కేంద్రంలో ఉమ్మడి మండలాలకు సంబంధించిన 27 మంది వివిధ శస్త్ర చికిత్సలు చేసుకున్న బాధితులకు డా. జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు పెబ్బేరు పట్టణ మండలం సంబంధించిన రూ. 32,2500 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ , పెబ్బేరు టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కారుపాకుల వెంకట్రాములు యాదవ్ , పెబ్బేరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి, రామాపురం సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే సంఘం సభ్యుల ఏకగ్రీవం

**ప్రజాపక్షం / కొత్తకోట :** వనపర్తి పట్టణంలోని రెయిన్‌బో స్కూల్‌లో నిర్వహించిన వనపర్తి జిల్లా కరాటే స్పోర్ట్స్ సోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నుంచి అబ్జర్వర్‌గా శంకర్ నాయక్ ని పంపించడం జరిగింది. వారి ఆధ్వర్యంలో ఈ నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. వీరిలో మన కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ కరాటే దు ఇండియాకి చెందిన మాస్టర్స్‌ని అనుకోవడం జరిగింది. వీరిలో ఉపాధ్యక్షులుగా జి. పరమేష్ , వడ్డే శివరాజ్ , జఫర్ సోదిక్ , జి. హరీష్ యాదవ్ , ఆర్గనైజర్ సెక్రటరీ జాయింట్ సెక్రటరీ, ఎండి కైసర్ జె. సుమలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మీ మాట్లాడుతూ ఇంతటి గొప్పటి అవకాశం రావడానికి మాకు సహకరించి మమ్మల్ని ఈ స్థాయిలో నిలిచిన మమ్మల్ని స్థాయికి తీసుకొచ్చి జిల్లాలో గౌరవాన్ని ఇచ్చి నా మా గురువుగారు అబ్దుల్ నబీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కుక్కల బెడదకు పరిష్కారం

**ప్రజాపక్షం/పెబ్బేరు :** అయ్యవారిపల్లి గ్రామంలో కుక్కల బెడద , వీధి కుక్కలు ఎక్కువ కావడం వలన గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్‌కి వెళ్లడానికి చిన్న పిల్లలు భయపడుతున్నారు. రోడ్డు మీద వెళ్లే వాహనాల వెంబడి పడుతున్నాయి. వీధి కుక్కల నుండి గ్రామస్తులను రోడ్డు వెంట వెళ్లే బాటసారులను రక్షించాలని తహసీల్దార్‌కి , ఎంపీడీఓకి వినతి పత్రం ఇచ్చిన 10 రోజులకే స్పందించి ఊరిలో ఉన్న కుక్కలను పట్టడం జరిగింది. పట్టుకున్న కుక్కలను సురక్షితంగా దూరప్రాంతంలో వదిలేస్తామని అన్నారు. ఈ విషయం గురించి ప్రత్యేక చొరవ తీసుకొని అధికారులతో మాట్లాడి తొందరగా స్పందించిన అధికారులకు అయ్యవారిపల్లి గ్రామ ప్రజల తరపున ముత్త లక్ష్మణ్ , వేణుగోపాల్ , కురుమూర్తి, రాముడు, శేఖర్ , బాలకృష్ణ, బాలరాజు, భాస్కర్ , సురేష్ , శంకర్ , నిరంజన్ రమేష్ , నవీన్ , గుంటి వెంకటేష్ , ఎల్లాస్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 30న ప్రజా విజయోత్సవ సభ

28 నుండి 30 వరకు రైతు సదస్సు నిర్వహణ

ప్రజలను భాగస్వాములను చేయాలి : మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అవుతున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకుంటున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 28 నుండి 30 వరకు మహబూబ్‌నగర్ లో పెద్ద ఎత్తున రైతుసదస్సు నిర్వహణ పై శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆలోచనల అనుగుణంగా పాలన చేస్తున్న ప్రజా ప్రభుత్వం , సంవత్సరం కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలుఉ ప్రజలకు తెలిపేందుకు ఈ నెల 30న ప్రజా విజయోత్సవ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొంటారని అన్నారు. రాష్ట్ర మంత్రులు శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. ఈ నెల 28 నుండి 30 వరకు ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంంగా మహబూబ్‌నగర్ భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌లో నిర్వహించే రైతు సదస్సులో ప్రజా ప్రతినిధులు , అధికారులు, ప్రజలను భాగస్వాములు చేస్తూ గొప్పగా, ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ రైతు సదస్సులో వ్యవసాయ శాఖ అనుబంధ శాఖలకు సంబంధించి 150 స్టాల్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ స్టాల్‌లో వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం, నూతన పద్ధతులు, ఆధునాతన సాంకేతిక పనిముట్లు, వంగడాలు, విత్తనాలు సంబంధించి రైతులకు అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా ముఖ్యమంత్రి స్వంత జిల్లా అని, ముఖ్యమంత్రి మహబూబ్‌నగర్ లో పాల్గొననున్న రైతు సదస్సు ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఈ సదస్సులో రైతులకు సూక్ష్మ సేద్య స్ప్రింక్లర్‌లు, డ్రిప్ ఇరిగేషన్ ప్రదర్శనలు, ఫామ్ ఆయిల్ సేద్యంపై అవగాహన కలిగించాలని అన్నారు. దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ సంవత్సరం కాలంలో రైతులకు రుణమాఫీ, అకాలవర్షాల వలన పంట నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం ఎకరాకు 10 వేల రూపాయలు చెల్లింపు రైతులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 30న బహిరంగసభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ జిల్లాలో ప్రజా విజయోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 19న మహబూబ్‌నగర్ శిల్పారామంలో ప్రజా విజయోత్సవాలు సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించినట్లు ప్రజాపాలన కళాయాత్ర ద్వారా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులచే ప్రతి రోజు మూడు గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మేఘారెడ్డి, డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రాష్ట్ర మైనార్టీ ఆర్థిక సంస్థ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కేంద్రబిజెపి ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని ఈనెల 26న నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో భారీ నిరసనలను జయప్రదం చేద్దామని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణకేంద్రంలో ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, ఐఎన్‌టియుసి నాగర్‌కర్నూల్ తాలుకా అధ్యక్షుడు మహ్మద్‌ఆలీ కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మోడి ప్రభుత్వం అమలుచేస్తున్న నాలుగు కార్మికకోర్సువల్ల కనీస వేతనం , ఉద్యోగభద్రత, సామాజికభద్రత, 8గంటల పనిదినం, ట్రేడ్‌యూనియన్ వంటి హామీలను రద్దుచేస్తున్నారు. ఈనాలుగు లేబర్‌కోడ్‌రద్దు చేయాలని కార్మికసంఘాలు సంవత్సరాలుగా పోరాడుతున్నాయన్నారు. బిజెపి ప్రభుత్వం రైతు, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ఈనెల 26న నిరసన కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలని కార్మికసంఘాలు పిలుపునిచ్చాయన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట లోకల్ ఆటో యూనియన్ ఆటోడ్రైవర్ కార్మికులు మహ్మద్‌ఆలీ, శ్రీనివాస్‌చారి, వెంకటేష్, జహంగీర్, బురాన్, ఖాజమియా, హరిసింగ్, అఖిల్, ఖాజాభాషా, ముస్తాక్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** కల్వకుర్తి పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీకి చెందిన శేఖర్‌యాదవ్ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌పార్టీ, మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ వెంటనే స్పందించి మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఇందిరానగర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కౌన్సిలర్లు రాంరెడ్డి, ఎజాస్, కాంగ్రెస్ నాయకులు ప్రవీన్‌కుమార్, షాకీర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



## వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ వి.సిలో మాట్లాడుతూ జిల్లాలో సమగ్ర సర్వే 99.5 శాతం పూర్తి అయ్యిందని తెలిపారు. ఈ నెల 28లోపు సర్వే డాటా ఎంట్రీ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైనీ కలెక్టర్ గరిమ నరుల అదనపు కలెక్టర్ బెన్ శాలం సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సకల సమస్యలకు పరిష్కారం మార్క్సిజం

**ప్రజాపక్షం / ఊట్కూర్ :** సమాజంలో అనేక సమస్యలు ఉత్పన్నమై మనుషలు తీవ్రమైన హింసకు గురవుతున్నారు. సమస్యల పరిష్కారానికి మార్క్సిజ సిద్దాంతమే మార్గమని ఎం. కృష్ణ, సీపీఐ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అన్నారు. ఆదివారం ఊట్కూర్ మండలం బిజ్వార్ గ్రామంలో సిపిఐ మాస్ లైన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి సందర్భంగా జిల్లా శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు బి. రాము, సిపిఐ మాస్ లైన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అధ్యక్షత వహించగా ఎం. కృష్ణ, సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఎం. కృష్ణ సిపిఐ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాట్లాడుతూ భారత దేశంలో నరేంద్రమోడి ప్రభుత్వం పెట్టుబడిదారుల కొమ్ము గాస్తుందని అన్నారు. దేశ ఉత్పత్తిలో భాగమైనటువంటి ప్రజలకు కడగండ్ల మిగులుతున్నాయన్నారు. ఈ దేశ రైతాంగం కార్మిక వర్గం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ మాస్ లైన్ నాయకులు, ఏ. సలీం, కాశీనాథ్ , ఎస్. కిరణ్ , యాదగిరి, బోయిన్‌పల్లి రాము, భగవంతు, ఈశ్వర్ , భుట్టో కృష్ణయ్య, వెంకట్ , రాములు, నర్సింహ, రవి, మల్లేష్ , బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## గద్దర్ ఆశయాలు కొనసాగిస్తాం

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ప్రజాయుద్ధనౌక, దివంగత గద్దర్ ఆశయాలను కొనసాగిస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని అమర వీరులస్తూపంపక్కన గద్దర్ విగ్రహా ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమాన్ని ఆదివారం విగ్రహా నిర్మాణకమిటి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి , రాష్ట్రసాంస్కృతికసారథిచైర్మన్ వెన్నెల, పిసిబిమెంబర్ బాలాజిసింగ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం గద్దర్ ఆలోచన విధానాలకు అనుగుణంగా పాలన చేస్తుందన్నారు. పీడితవర్గాల అభ్యున్నతికోసం చివరిశ్వాసవరకు పోరాడిన గొప్ప ప్రజా ఉద్యమనాయకుడు గద్దర్ అని ఆయన సేవలను కొనియాడారు. రాష్ట్ర సాంస్కృతికసారథిచైర్మన్‌గా నియామకమై మొదటిసారిగా కల్వకుర్తికి వచ్చిన వెన్నెలకు కవులు, కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు డప్పుచప్పుళ్లతో ఎదురేగి ఘనస్వాగతం పలికారు. అంతకుముందు పాలమూరుచౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గద్దర్‌విగ్రహా నిర్మాణకమిటి చైర్మన్ లక్ష్మణశర్మ, కవులు, కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు, కాంగ్రెస్‌పార్టీశ్రేణులు పాల్గొన్నారు.



## మహిళలకు చేదోడుగా చేయూత

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీకిచెందిన భాగ్యమ్మ గతకొన్నిరోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంది. విషయం తెలుసుకున్న భగత్‌సింగ్ ఓల్డ్‌సిటి హైదరాబాద్‌వారు రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆడబ్బులతో ఇందిరానగర్‌కాలనీ కమాన్‌దగ్గర భాగ్యమ్మకు పూలబండి ఏర్పాటుచేసి ఆర్‌ఎస్ఎస్ జిల్లా నాయకులు ఆంజనేయులు ప్రారంభంచేశారు. కార్యక్రమంలో భగత్‌సింగ్‌యూత్ సభ్యులు గన్నోజుబాబిదేవ్, విశ్వహిందూపరిషత్ ప్రఖండ ప్రముఖ్ గిరిధర్‌రెడ్డి, సీనియర్ గురుస్వాములు బృంగిశ్రీను, కార్యవాహ అరవింద్, నాయకులు దుర్గాప్రసాద్, బోడన ర్సింహ్మా, బృంగి వివేకానంద, హరిప్రసాద్‌చారి, వేణు, కిశోర్, మహేష్, శంకర్, వివిధ హిందూ సంఘాలనాయకులు పాల్గొన్నారు.



## మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు మాట్లాడుతూ వాహనదారులు మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. మద్యపానం సేవించి వాహనాలు నడపటం వల్ల రోడ్డు ప్రమాదానికి గురై అవకాశం ఉంటుందని, జాగ్రత్తగా వచ్చే వారి వాహనాలకు కూడా రోడ్డు ప్రమాదాలు జరిగా అవకాశం ఉంటుందని , వాహనదారులు మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానాతో పాటు జైలుకు పంపించడం జరుగుతుందని తెలిపారు. మద్యపానం సేవించడం వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవాకశం ఏకువ ఉంది. వాహనదారులు ఖచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ వారికి సహరించాలని ట్రాఫిక్ కానిస్టేబుల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు గోవింద్ , వాహనదారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## సర్వే డేటా ఎంట్రీ కీలకం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందని, సర్వే డేటా ఎంట్రీ చాలా కీలకమైందని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం ఉదయం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జడ్పిసిఈఓ వెంకటరెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ వివరాలు నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో వివరాలు నమోదు చేసుకొనని కుటుంబాలు ఉంటే వారి మండల పరిధిలోని ఎంపిడిఓలు, పట్టణంలో మున్సిపల్ కమిషర్‌లను సంప్రదించి తమ కుటుంబ వివరాలు వద్ద నమోదు చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 99.8 శాతం పూర్తి అయిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇంకా సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకొనని కుటుంబాలు ఎంపిడిఓ లను సంప్రదించాలని అడ్డాకుల ఎంపిడిఓ ఫోన్ నెంబర్ 8008901092, బాలానగర్ ఎంపిడిఓ ఫోన్ నెంబర్ 8008901006, భూత్పూర్ ఎంపిడిఓ ఫోన్ నెంబర్8008901007, సీసీ కుంట ఎంపిడిఓ ఫోన్ నెంబర్ 8008901051 దేవరకద్ర ఎంపిడిఓ ఫోన్ నెంబర్ 8008901051 , హన్వాడ ఎంపిడిఓ ఫోన్ నెంబర్ 8008901009, జడ్చర్ల ఎంపిడిఓ ఫోన్ నెంబర్ 8008901011 కోయిల్ కొండ ఎంపిడిఓ ఫోన్ నెంబర్ 8008901014 మహబూబ్‌నగర్ ఎంపిడిఓ ఫోన్ నెంబర్ 8008901021, నవాబుపేట ఎంపిడిఓ ఫోన్ నెంబర్ 8008901023 , మూసాపేట్ ఎంపిడివో ఫోన్ నెంబర్ 9491377825, గండీడ్ ఎంపిడిఓ ఫోన్ నెంబర్ 9949995465, రాజాపూర్ ఎంపిడిఓ ఫోన్ నెంబర్ 9912195696 మున్సిపాలిటీలలో మున్సిపల్ కమిషనర్లు వద్ద మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ ఫోన్ నెంబర్ 7331184222, జడ్చర్ల మున్సిపల్ కమీషనర్ ఫోన్ నెంబర్ 7337351867, భూత్పూర్ మున్సిపల్ కమిషనర్ ఫోన్ నెంబర్ 8121721965 లను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.



## నాగర్‌కర్నూల్ జిల్లాలో 96శాతం పూర్తి

### కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా,ఉపాధి, రాజకీయ, కులగణనసర్వే 96శాతం పూర్తయిందని సర్వేలో జిల్లాలో మొత్తం 2,50,596నివాసాలు గుర్తించగా శనివారంవరకు 2,39,921 నివాసాలలో సర్వేపూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ వీడియోకాన్ఫరెన్స్‌ద్వారా ఉపముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్కకు వివరించారు. రానున్న రెండురోజుల్లో వందశాతం సర్వేను పూర్తిచేయడం జరుగుతుందని, ఏదైనా కుటుంబాలవారు ఇతర ప్రాంతాలకువెళ్లి ఇంటిని తాళంవేసిన కుటుంబాలకుక సమాచారం అందించి, వారి కుటుంబసభ్యులతో వివరాలను కనుక్కొని సర్వే ప్రక్రియను పూర్తిచేస్తామని కలెక్టర్ వెల్లడించారు. సర్వే పూర్తయిన కుటుంబాలకు సంబంధించిన వివరాల కంప్యూటరీకరణ ప్రక్రియను సజావుగా సాగేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని, అందుకుకావాల్సిన అన్ని ఏర్పాట్లపై శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీచేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలు, వసతి గృహాలకు ప్రతి వసతిగృహానికి , గురుకులానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందని, ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలతోపాటు మెనూ ప్రకారం భోజనం అందించడంతోపాటు అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేయడంతోపాటు ప్రతి వారంలో రెండుసార్లు పాఠశాలలు,గురుకుల పాఠశాలలు, హాస్టల్స్‌ను తనతోపాటు అదనపు కలెక్టర్లుకూడా సందర్శిస్తున్నట్లు మల్లుభట్టివిక్రమార్కకు తెలియజేశారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క మాట్లాడుతూ సర్వేడేటా ఎంట్రీలో నాణ్యత చాలా ముఖ్యమైందని, రాష్ట్రప్రభుత్వం ఈఅంశంపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వేదశలో పట్టణ ప్రాంతాల్లో డోర్‌లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడంవంటి కొన్ని సమస్యలు తలెత్తాయి కాబట్టి వారికి ఫోన్‌కాల్‌చేసి సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆవివరాలను క్రమబద్ధికరించుకోవాలని , వారిని అందుబాటులో ఉండమని కోరాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైనవారి వివరాలను జాగ్రత్తగా క్రమబద్ధికరించుకోవాలని తెలిపారు. కొన్ని వసతిగృహాల్లో , రెసిడెన్షియల్ పాఠశాలలో పుడ్‌పాయిజన్ కేసులు నమోదవుతున్నాయని ఈపాఠశాలలో ఆహారం, పరిశుభ్రతపై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, యావత్‌క్యాబినెట్ ప్రత్యేకదృష్టి సారించిందని అధికారులు తగుచర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విత్తన విక్రయాలపై పర్యవేక్షణ లేని వ్యవసాయ శాఖ

**ప్రజాపక్షం / పెబ్బేరు :** మండల కేంద్రంలోనే కాకుండా గ్రామాల్లో కూడా పుట్టగొడుగుల్లా వెలిఇసిన ఫర్టిలైజర్ , పెస్టిసైడ్స్ , విత్తనాలు అమ్మె దుకాణాలు ఒక్కొక్క గ్రామానికి మూడు నుండి ఐదు వరకు నడుస్తున్నాయి. అడిగిన వారికి లేదనకుండా లైసెన్స్ ఇచ్చిన వ్యవసాయ శాఖ విత్తనాలు అమ్మే దుకాణాలపై పర్యవేక్షణ లేకపోవడంతో ఈ రబీ సీజన్‌లో ఇటు ట్రూత్ ఫుల్ సీడ్ గాని, సర్టిఫైడ్ సీడు , ఎలాంటి విత్తన ధృవీకరణ లేని రబీ విత్తనాలను అందమైన ప్లాస్టిక్ కవర్లలో ప్యాకె చేసి రైతులకు అమ్ముతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ప్రభుత్వం విత్తన నాణ్యతపై కొన్ని కఠినమైన చర్యలు తీసుకున్నప్పటికి రబీ సీజన్‌లో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వ్యాపారస్తులు అనుమతులు లేని సీడ్ తో రైతులను నట్టేట ముంచుతున్నారు. అంతేకాకుండా పెబేరు మండల కేంద్రంలోనే కాకుండా , గ్రామాలలో కూడా కొన్న ఫర్టిలైజర్ కు, ఎలాంటి రసీదులు ఇవ్వకుండా తెల్ల చీటిపై తమ ఇష్టం ఉన్న రేట్లకు ఫర్టిలైజర్ అమ్ముతూ , తిరిగి వాహనాలకు సంచులు ఎత్తేటప్పుడు బుక్క చీటీలను తిరిగి తీసుకుంటున్నారు. ఇలాంటి అక్రమాలకు వ్యాపారస్తులు పాల్పడుతున్న మండలంలో పట్టించుకునే వ్యవసాయ అధికారులు లేరు. జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు కాని, వ్యవసాయ శాఖ విజిలెన్స్ వారు మండలంలో లలోతుగా దర్యాప్తు జరిపితే అక్రమాలు బయటపడతాయని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పామిరెడ్డిపల్లిలో కొండ చిలువ కలకలం

**ప్రజాపక్షం / పెద్దమందడి :** మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం ఒక పెద్ద కొండ చిలువ కలకలం రేపింది. స్థానికంగా ఉంటున్న సాయికుమార్ రెడ్డి ఇల్లు గ్రామంలో చివరన వైరాగిచెరువు సమీపంలో ఉంది. ఆదివారం ఉదయం అందరూ చూస్తుండగానే పది అడుగుల కొండ చిలువ చెరువులో నుండి నేరుగా సాయికుమార్ రెడ్డి ఇంట్లోకి ప్రవేశించింది. అది గమనించిన అతను వనపర్తిలో ఉన్న అసోసియేషన్ ఫర్ బయోడైవర్సిటి కన్సర్వేషన్ అండ్ డెవలప్మెంట్ సభ్యులు , సర్పరక్షకుడు డా. బి. సదాశివయ్య శిష్యులు శివకుమార్ కు ఫోన్‌లో సమాచారం అందజేశారు. వెంటనే శివకుమార్ , అభిరాం పామిరెడ్డిపల్లికి చేరుకొని కొండ చిలువను చాకచక్యంగా పట్టుకున్నారు. అటవీ అధికారులు సహాయంతో అటవీ ప్రాంతంలో వదిలేస్తామని తెలిపారు.



# మాజీ ఎమ్మెల్యే ఉయికే అబ్బయ్య మృతి



ప్రజాపక్షం/భద్రాచలం : బూర్గంపాడు,ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే ఉయికే అబ్బయ్య (67) శనివారం అర్ధరాత్రి మృతిచెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 1980 దశకంలో పిన్నవయస్కుడైన శాసన సభ్యునిగా ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీ కుటుంబంలో జన్మించిన అబ్బయ్య తన 25వ ఏట ఇల్లెందు సమీపంలోని సుదిమళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా సిపిఐ నుండి ఎన్నికయ్యారు. 1983 సం.లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో అప్పటి బూర్గంపాడు నియోజకవర్గం నుండి పోటీ చేసి 26 ఏళ్ల వయసుకే శాసన సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1994 సం.లో ఇల్లెందు నుంచి సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసి 2వ సారి ఎంఎల్‌ఏగా గెలిచారు. ఆ తర్వాత టిడిపిలో చేరిన ఆయన 2009 సం.లో మరో సారి శాసనసభకు ఎన్నికయ్యారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలు సంతాపం ప్రకటించాయి.

## అబ్బయ్య మృతి బాధాకరం : కూనంనేని

మాజీ ఎమ్మెల్యే ఉయికే అబ్బయ్య మృతి బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చిన్ననాటి నుండే ప్రజా సమస్యల పట్ల అవగాహన ఉన్న అబ్బయ్య సిపిఐ నుండి మూడుసార్లు శాసనసభకు ఎంపికయ్యారన్నారు. తొలినాళ్ల నుండి కమ్యూనిస్టు కుటుంబానికి చెందిన ఆయన అతి పిన్న వయస్సులో ప్రజాప్రతినిధిగా గెలిచి బూర్గంపాడు, ఇల్లెందు నియోజకవర్గాల్లో పనిచేశారన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన హైదరాబాద్ ఆస్పత్రిలో శనివారం రాత్రి మృతి చెందారని, ఆయన మృతికి తెలంగాణ రాష్ట్ర సిపిఐ కమిటీ తరపున ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు కూనంనేని తెలిపారు.

# నేడు కొత్తగూడెంకు మంత్రి తుమ్మల

## కూనంనేనితో కలిసి అభివృద్ధి పనులకు శంఖుస్థాపన

ప్రజాపక్షం/భద్రాచలం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం కొత్తగూడెంలో పర్యటించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి చుంచుపల్లి మండలం నందా తండా నుండి హౌసింగ్ బోర్డు కాలనీ, రాందాస్ తండా, బంజారా కాలనీ మీదుగా వికలాంగుల కాలనీ వరకు నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు శంఖుస్థాపన, నూతన జిల్లా గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు.

# మండల అభివృద్ధికి నిధులు



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండలంలో అభివృద్ధి పనుల గురించి ఎంపి రఘురాంరెడ్డిని కారేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావుతో ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈసందర్భంగా కారేపల్లి గ్రామానికి సింగరేణి కోల్ మైన్స్ నుండి సియస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయడానికి సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు వచ్చే విధంగా చేయాలని ఎంపిని కోరారు. స్పందించిన ఎంపి రఘురాంరెడ్డి సిఎండి బలరాం నాయక్‌తో మాట్లాడారు. కారేపల్లి రైల్వే స్టేషన్ ట్రైన్స్ కొన్ని ఆగడం లేదని ఎంనికి చెప్పడంతో రైల్వే జిఎంకి లెటర్ పెడతానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఎంపి అన్నారు. కలసిన వారిలో కాంగ్రెస్ నాయకులు మల్లెల నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ నాయకులు తొగర శ్రీను తదితరులు ఉన్నారు.

# మంత్రి పొంగులేటిని కలిసిన బాలునాయక్



ప్రజాపక్షం/పాల్వంచ: పాల్వంచ యన్‌యమ్‌డీసీలో విధులు నిర్వహిస్తూ, ప్లాంట్ ఐయన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి బాలు నాయక్ ఈనెల 30న పదవీ విరమణ సందర్భంగా డిసెంబర్ ఒకటిన రిటైర్మెంట్ ఫంక్షన్‌కు మంత్రిని ఖమ్మం మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో ఆదివారం కలిసి సాధారంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా బొకే అందించిన వారిలో బాలు నాయక్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జాలె జానకిరెడ్డి, భావ్‌సింగ్ నాయక్, జగదీష్ నాయక్ ఉన్నారు.

# అంబటి కుటుంబానికి మంత్రి పరామర్శ



ప్రజాపక్షం/చింతకాని : చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు అంబటి వీరయ్య ఇటీవల మరణించారు. అంబటి కుటుంబాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం నాగులవంచలోని అంబటి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. వీరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తుంబూరు దయాకర్‌రెడ్డి, అంబటి వెంకటేశ్వర్లు,కూరపాటి కిషోర్,కిలారి మనోహర్,చింతకాని సహకార సంఘం అధ్యక్షులు కొండపల్లి శేఖర్‌రెడ్డిఅంబటి శాంతయ్య, ఆలస్యం బసవయ్య, ఎల్లంపల్లి సతీష్, నారపోగు కొండలరావు, బొర్రా ప్రసాద్,కంభం వీరభద్రం నారగాని శ్రీను,వెచ్చా మంగపతిరావు,ముత్తిన్ని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# పినపాకలో మంత్రి సీతక్క పర్యటన



ప్రజాపక్షం/మణుగూరు : పంచాయతీరాజ్ శాఖ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదివారం పినపాక నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా మణుగూరు సి టైప్ గెస్ట్ హౌస్ నందు జరిగిన కంది సుబ్బారెడ్డి మనుమరాలు నిశ్చితార్థం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం నందు కాంగ్రెస్ వాది గట్ల శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సీతక్క యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దనసరి సూర్య అన్న ఫోటోను పుట్టు మచ్చగా వేయించుకున్న కూరం వీరన్న చేతిని పరిశీలించారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఆరిఫ్ పాషా, మన గురు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కూరం వీరన్న తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐఎన్‌టీయూసి నాయకులు, కార్యకర్తలు, సీతక్క అభిమానులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణులు సమాజ హితులు

## ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

## ఘనంగా బ్రాహ్మణ సమారాధన



ప్రజాపక్షం/భద్రాచలం : బ్రాహ్మణులు ఎప్పుడూ సమాజ హితాన్ని కోరుకుంటారని, సమ సమాజ స్థాపన కోసం అనేక మంది బ్రాహ్మణులు పాటుపడ్డారని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం గణేష్ టెంపుల్ ఆవరణలో బ్రాహ్మణ సమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కూనంనేనిమాట్లాడుతూ బ్రాహ్మణ ప్రముఖులైన సర్వదేవభట్ల, పర్సా, మంచికంటి, శేషగిరిరావు, విఠల్ రావు, నర్సింహారావు వంటి ఎందరో మేధావుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బ్రాహ్మణులు బాగా వెనుకబడిన సామాజిక వర్గాల్లో ఉన్నారని, వారిలో పేదవారికి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. స్థలం ఉన్న పేదవారికి ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వ సాయం లభించే విధంగా ప్రయత్నిస్తానన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా మాట్లాడుతూ సమ సమాజాన్ని కోరుకునే బ్రాహ్మణ సామాజిక వర్గానికి తమ మద్ధతు ఉంటుందన్నారు. అనంతరం బ్రాహ్మణ సమాఖ్య నూతన కార్యవర్గ ప్రతినిధులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సత్కరించారు.

# గీత కార్మికుడికి సన్మానం

ప్రజాపక్షం /ఖమ్మం రూరల్ : ఇటీవల గ్రూప్–4లో ఉద్యోగాలు సాధించిన గీత కార్మికుడు గడ్డమీది వెంకటేశ్వర్లు కుమారులు లెనిన్ కుమార్, మానోజ్ కుమార్‌లను గోల్లపాడు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు కొండ కరుణాకర్ ఆదివారం సన్మానించారు. స్థానిక కల్లుగీత కార్మిక సంఘం కార్యాలయంలో శాలువలు కప్పి అభినందనలు తెలుపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బోనపల్లి సంగయ్య, మంగూరు ముత్తయ్య, గోడ వెంకన్న, తొండల రవి, గుండు రమేష్, పరికిపల్లి సుదర్శన్, కొండ అంజయ్ కుమర్ పాల్గొన్నారు.



# జిల్లా స్థాయి నవోదయ మోడల్ పరీక్షకు అనూహ్య స్పందన

ప్రజాపక్షం/బూర్గంపాడు: స్థానిక సారపాక బ్రిలియంట్ నవోదయ కోచింగ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం భద్రాచలంలో నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. జిల్లాలోని మణుగూరు, చర్ల, పాల్వంచ, భద్రాచలం ప్రాంతాల నుండి వివిధ పాఠశాలల్లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు దాదాపు 60 మందికి పైగా పరీక్షకు హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. ఈసందర్భంగా నవోదయ కోచింగ్ ఛైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్ మాట్లాడుతూ ఈ పరీక్షలో ఫస్ట సెకండ్ ర్యాంకులను సాధించి వారికి కోచింగ్ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో చదువుకునే విద్యార్థులకు పరీక్షపై అవగాహన కల్పించి వారిలో ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ నవోదయ మోడల్ పరీక్షను నిర్వహించామన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మీరంతా ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ మోడల్ పరీక్ష ఫలితాలకు ఈనెల 28న గురువారం తెలియజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నవోదయ కోచింగ్ చైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# వందేళ్లుగా పేదల పక్షాన సిపిఐ పోరాటాలు





## పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

ప్రజాపక్షం/బోనకల్ : వందేళ్లుగా పేదల పక్షాన పోరాడిన సిపిఐకి ఘనమైన చరిత్ర ఉందని పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మురంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకొని డిసెంబర్ 26న శతాబ్ది ఉత్సవాలకు సన్నద్ధమవుతుందన్నారు. వందేళ్లలో ఎన్నో చారిత్రాత్మక పోరాటాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించినప్పుడల్లా సిపిఐ ప్రజల పక్షాన నిలిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించినప్పుడల్లా సిపిఐ ప్రజల పక్షాన నిలబడి పాలకుల మెడలు వచ్చిందన్నారు. భూ పోరాటం ద్వారా భూములు పంచామని, కార్మికుల కోసం కార్మిక హక్కుల సాధించామని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నవాబులను తరిమికొట్టి హైదరాబాద్ రాష్ట్రాన్ని దేశంలో విలీనం చేసిన ఘన చరిత్ర సిపిఐదని ఆయన గుర్తు చేశారు. పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే భారత కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితమేనని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహరావు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీ నారాయణ, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ గ్రామ కార్యదర్శి గుడిదె కృష్ణ, మండల నాయకులు మందడపు వెంకటేశ్వరరావు, వంగాల నరసింహ, మడుపల్లి వెంకటేశ్వర్లు, గుడిద నాగేశ్వరరావు, మడుపల్లి పెద్ద వెంకటేశ్వర్లు, చావా గోపాలకృష్ణ, వంగాల శివపార్వతి, భూక్యా చిరంజీవి, రావుల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు : కల్లూరు మార్కెట్ కమిటీ ఆవరణలో సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు అధ్యక్షతన సిపిఐ ప్రజాసంఘాల సమావేశం జరిగింది. సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ హాజరై మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం కోసం సిపిఐ పోరాడుతుందన్నారు. శత వసంతాలు పురస్కరించుకొని కార్మిక సంఘాలు పార్టీ సభ్యుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సేకరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలు కార్మిక సంఘాలు సభ్యులు పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, అధ్యక్షులు గాదె లక్ష్మీ నారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, బికెఎంయు వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, ఉపాధ్యక్షులు వేము రాంబాబు, నిమ్మటూరి రామకృష్ణ, పిల్లి భాస్కర్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి మల్లేష్, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు పాగా సత్యవతి, స్వీపర్సు యూనియన్ అధ్యక్షులు మలేఖ, ఆసుపత్రి కార్మిక యూనియన్ నాయకులు వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా కార్తీక భోజనాలు



పాల్గొన్న మంత్రులు తుమ్మల, పొంగులేటి



ప్రజాపక్షం/ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆదివారం కార్తీక వన భోజనాలను ఘనంగా నిర్వహించారు. పట్టణాల సమీపంలోని వనాల్లో జన సందడి కనిపించింది. వనాల్లో ప్రత్యేక ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు. సమిష్టి భోజనాలు, కుల,మత, తారతమ్యాలకు తావివ్వకుండా జరగాల్సిన వన భోజనాలు కులాలకు వేధికలయ్యాయి. ఖమ్మం సమీపంలోని అర్బన్ పార్కులో కమ్మ వన భోజన కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరావు హాజరయ్యారు. రెడ్డి వన సమారాధన మదిర సమీపంలో జరగగా ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. మదిర సమీపంలోని మామిడితోటలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాపు కుల సమారాధనకు జగ్గయ్యపేట మాజీ శాసనసభ్యులు సామినేని ఉదయభాను, ఆర్‌జేసి కృష్ణ తదితరులు హాజరయ్యారు. ఖమ్మం సమీపంలోని చెరుకూరి వారి మామిడి తోటలు ఆర్యవైశ్య వన సమారాధన జరిగింది. యాదవ కులస్తుల వాన సమారాధన సైతం జరగగా, ఈ వన సమారాధన కార్యక్రమాల్లో ఆయా కుల పెద్దలు పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కాపు వన సమారాధన జరిగగా, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు హాజరయ్యారు.

వైరా: వైరాలోని కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో వన సమారాధన మహోత్సవం కార్యక్రమంలో ఆదివారం గ్రామ సమీపంలోని మామిడి తోటలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా కాంగ్రేస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మధిర ఎమ్మెల్యే కొండబాట కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టిడిపి నాయకులు వాసిరెడ్డి రామనాథం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమ్మజన నాయకులు వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జున్‌రావు, చింతనిప్పు వెంకటయ్య, శ్రీరామనేని విజయభాస్కర్, చింతనిప్పు రాంబాబు, సూర్యదేవర శ్రీధర్, డాక్టర్ కాపా మురళీకృష్ణ, పొదిల హరినాథ్, చెరుకూరి కిరణ్, లగడపాటి ప్రభాకర్, జాలాది రామకృష్ణ, కర్నాటి హనుమంతరావు, కొల్లి రమేష సరిపుడి రాము తదితరులు పాల్గొన్నారు.



# యూనివర్సిటీ టీంకు బాక్సర్ హరిప్రియ ఎంపిక



ప్రజాపక్షం/పాల్వంచ: పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్సీ చదువుతున్న విద్యార్థిని పొట్లపువ్వ హరిప్రియ వరంగల్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలోని బాక్సింగ్ హాల్‌లో జరిగే కాకతీయ విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజీ బాక్సింగ్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో విజయం సాధించింది. దీంతో బంగారు పతకం సాధించి యూనివర్సిటీ బాక్సింగ్ టీమ్‌కు ఎన్నిక కావడంతో పాటు ఆల్ ఇండియా మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌కు ఎంపిక కావడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ పి పద్మ, కళాశాల స్పోర్ట్స్ ఇంచార్జ్ ఫిజికల్ డైరెక్టర్ పొట్లపువ్వ శ్రీనివాసరావు తెలిపారు.

# క్రీడా సామాగ్రి అందజేత



ప్రజాపక్షం/కారేపల్లి:యువతకు కారేపల్లి మండల కేంద్రంలోని భరత్‌నగర్ కాలనీ యువకులకు బిఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు షేక్ గౌసుద్దీన్ షటిల్ కిట్లు, బ్యాట్లు క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తాయని, అందుకే గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో క్రీడా సామాగ్రిని అందజేశానన్నారు. కార్యక్రమంలో ఎండి కలియుల్లా ఖాన్, చెవుల అనిల్, సద్దాం హుస్సేన్, అబ్దుల్ వహీద్, సోమందల నాగరాజు, తడికమ్మల నరేష్, ఫిరోజ్ పాల్గొన్నారు.

# ఆదివాసీల సంక్షేమమే లక్ష్యం

## ఎస్‌పి రోహిత్ రాజ్



ప్రజాపక్షం/అశ్వాపురం: జిల్లాలో మారుమూల గ్రామాల్లో నివసించే వలస ఆదివాసీ ప్రజల సంక్షేమమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం జిల్లా ఎస్‌పి రోహిత్‌రాజ్ అన్నారు. ఆదివారం అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వేములూరు, మనుబోతులగూడెం, మల్లయ్య గుంపు, అయితయ్య గుంపు, సంతోష్ గుంపు, నాగేశ్వరరావు గుంపు, గుండ్ల మడుగు వలస గొత్తికొయ గ్రామాలలో నివసించే ఆదివాసి ప్రజలకు రోటరీ క్లబ్ భద్రాచలం వారి సహకారంతో అశ్వాపురం పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మొత్తం 7 గుత్తికోయ గ్రామాల నుండి సుమారు 400 మంది కుటుంబాలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. నిపుణులైన వైద్యులతో వైద్య చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈసందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజల సంక్షేమం కోసం జిల్లా పోలీస్ శాఖ తరపున ఎల్లప్పుడూ కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే తెలంగాణ, చత్తీష్‌ఘడ్ రాష్ట్రాల సరిహద్దు గ్రామాలలోని ఆదివాసి ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని కూడా పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వాతావరణంలో మార్పుల కారణంగా దోమలు అధికమై మలేరియా, డెంగ్యూ లాంటి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంటుందని, కాబట్టి ప్రతి ఒక్కరు తమ చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిషేధిత మావోయిస్టులకు సహకరించవద్దని, మావోయిస్టుల గురించి ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసుల వారికి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే యువతీ, యువకులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకొని తమ తల్లిదండ్రులకు ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మెడికల్ క్యాంపు ఏర్పాటుకు సహకరించిన రోటరీ క్లబ్ వారికి, వైద్య బృందానికి , అశ్వాపురం పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించిన వైద్యులను సన్మానించారు. అనంతరం వైద్యశిబిరంలో పాల్గొన్న వారితో ఎస్‌పి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం మారుమూల గ్రామాలైన మనుబోతులగూడెం, మల్లయ్య గుంపు గుత్తికోయ గ్రామాలను సందర్శించారు. కార్యక్రమంలో మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐలు తిరుపతిరావు, రవూఫ్, రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం ప్రెసిడెంట్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ నుంచి ఉద్యమకారుల పాదయాత్ర

## మాదినేని సత్యనారాయణ

ప్రజాపక్షం/వైరా : తెలంగాణ ఉద్యమకారుల (టియుఎఫ్) సమావేశం ఆదివారం వైరాలో జరిగింది. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అప్పటి ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 2001 నుండి నాటి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు ఉద్యమంలో కీలకంగా పాల్గొని రాష్ట్ర సాధన కోసం ఏర్పాటు కోసం పోరాటం చేయడం జరిగిందని తెలిపారు. టియుఎఫ్‌లో ఉద్యమకారులను చేరడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మాదినేని సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలన్నారు. 2001 నుండి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగంగా ఎన్నో ఉద్యమాలు చేసిన ఉద్యమకారులు అందరం ఒకచోట కూర్చొని భవిష్యత్ కార్యక్రమం రూపొందించడం జరిగిందని, త్వరలోనే నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లోని ఆనాటి ఉద్యమంలో పాల్గొన్న నేతలతో కలిసి కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఖమ్మం జిల్లా టియుఎఫ్ ఉద్యమకారుల అధ్యక్షుడు పసుపులేటి నరసయ్య ఆధ్వర్యంలో ఈ నెల 2 నుండి కరీంనగర్‌లో జరగనున్న ఉద్యమకారుల మహా పాదయాత్ర పాల్గొని ఉద్యమకారులు విజయవంతం చేయాలని అన్నారు. ఈ ఉద్యమకారుల పాదయాత్ర కరీంనగర్ నుండి వేములవాడ వరకు కొనసాగుతుందన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఉద్యమకారుల సమావేశంలో దొంతా నర్సింహారావు, కన్నెగంటి హుస్సేన్, కన్నెగంటి వెంకటేశ్వర్లు, చింతపల్లి జయరాజ్, బచ్చు రమణ, శ్యామ్, భూక్యా వెంకన్న, రాము, హుస్సేన్, ఏపూరి గోపాలరావు, యర్రమల కోటా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

## చర్లపల్లి సిసిఎస్ కమిటీ అధ్యక్షుడిగా పద్మారెడ్డి

ప్రజాపక్షం/చర్లపల్లి: జనం కోసం ఒక్కటయ్యామం సమస్యల పరిష్కారమే సిసిఎస్ లక్ష్య మని చర్లపల్లి కాలనీల సమాఖ్య అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని కాలనీ సంఘాల సభ్యులు ఒక్కటై శివసాయి నగర్ కాలనీలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంపల్లి పద్మారెడ్డి,ఉపాధ్యాక్షులుగా సురకంటి సత్తిరెడ్డి,గంప కృష్ణ, శ్రీనివాస్‌నాయ క్, కె బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈగ ఉమారాణి, కోశాధికారి సింగిరెడ్డి నరసింహరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా వెంకటనరసింహరెడ్డి, యావపురం రవి, సారా వినోద్, సభ్యులుగా సుధాకర్, పెంటేష్‌లు ఎన్నికయ్యారు. జనం సమస్యలు వెలుగులోకి తీసుకొస్తూ పరిష్కారానికి బాటలు వేయబోతున్నామని పద్మారెడ్డి అన్నారు.

## రెడ్డి సంఘం నూతన అధ్యక్షుడిగా రాజారెడ్డి

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : మల్లాపూర్ రెడ్డి సంఘం నూతన అధ్యక్షుడిగా కాసం రాజారెడ్డి, జనరల్ సెక్రటరీగా గుడి గోపురం ముత్యంరెడ్డి, కోశాధికారిగా పాటి రాజిరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బ్రహ్మపురి కాలనీలోని రెడ్డి భవన్‌లో గతంలో వేర్వేరుగా ఉన్న రెండు రెడ్డి సంఘాలు ఏకమై నూతన కమిటీని ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, గూడూరు శైలజ రెడ్డి,ఎన్నికల కమిటి సభ్యులు కృష్ణారెడ్డి, మల్లారెడ్డి,కోదండరాం ధర్మారెడ్డి, రంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి,పైలా నర్సిరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీరశైవుల అభ్యున్నతికి తోడ్పడుతా : ఎమ్మెల్యే బిఎల్ఆర్



ప్రజాపక్షం/చర్లపలి: వీరశైవుల అభ్యున్నతికి తోడ్పడుతానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని వాసవి శివనగర్ కాలనీలోని కన్యకా పరమేశ్వరి శివాలయంలో కాప్రా వీరశైవ సమాజం అధ్యక్షులు ప్యాట జ్ఞానేశ్వర్,గౌరవ అధ్యక్షులు యావపురం విశ్వనాథం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన సమారాధన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మె ల్యే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి, మాజీ కౌన్సిలర్ రాములుయాదవ్, నాయులు మహేష్‌గౌడ్,పద్మారెడ్డి,గడ్డం ప్రసాద్, సభ్యులు గంగా ఈశ్వరయ్య, యావపురం రవి, శివానంద్, శివ, శంభులింగం, సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్మ సంఘం వనభోజన కార్యక్రమంలో బండారి



ప్రజాపక్షం/చర్లపల్లి: కమ్మ సామాజిక వర్గం అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో జరిగిన కార్తీక వనభోజనాల కార్యక్రమానికి హాజరైన ఎంఎల్ఎ మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని,కమ్మ సంఘం అభివృద్ధికి పాటుపడతానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి,ఎంఎల్ఎలు అరికెపూడి గాంధీ, వెనిగండ్ల రాము, ఎంపి రవీంద్ర, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, టిడిపి రాష్ట్ర నాయకులు టిజికె మూర్తి,మన్నె సుబ్రమణ్యం,సాయి నాగార్జున,శరత్,నీరుగొండ సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## యువ దంపతుల బలవన్మరణం

### పురుగుల మందు సేవించి ఆత్మహత్య



ప్రజాపక్షం/తాండూరు: అప్పుల భారం భరించ లేక ఓ యువ దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. యువ దంపతులు ఆత్యహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదచాయలు అమలుకున్నాయి. ఈ ఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండల పరిధి నాగసారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం నాగసారం గ్రామానికి చెందిన మాసుల యాదప్ప(42), భార్య మాసుల జ్యోతి(38) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం వెల్లదిస్తున్నారు. వీరికి కూతురు శ్రీలత, కుమారుడు నవీన్ ఉన్నారు. అయితే గత రెండేళ్ళ క్రితం అప్పు సప్పులు చేసిన కూతురు శ్రీలత వివాహం జరిపించారు. దీనికి తోడు వ్యవసాయం సాగు కోసం అప్పులు చేశారు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందు భరించ లేక మనో వేధనకు గురైన యువ దంపతులు ఆదివారం ఉదయం గుర్తు తెలియని పురుగుల మందు సేవిచి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇది గమనించిన స్థానికులు తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు యాలాల పోలీసులు కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నటులు తెలిపారు.

## ప్రతీ ఒక్కరూ ధ్యానాన్ని అలవర్చుకోవాలి



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి: వికారాబాద్ నియోజకవర్గం లోని నగసన్‌పల్లి గ్రామంలోని లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రహ్మదివస్ అను కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి తెలంగాణ రాష్ట ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ , సినీతార రాజిన ,విజేందర్‌గౌడ్ , భాస్కర్‌రెడ్డి తదితరులు హాజరైనారు. ఈ సందర్భంగా శైలజా మాట్లాడుతూ అందరూ ధ్యానం గు రించి తెలుసుకోవలి అన్నారు. వికారాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన ఈ ధ్యాన కేంద్రం ద్వారా ప్రపంచమే ఈ రోజు ఇక్కడ వైపు చూసేలా చేశారని కొనియాదరు. మానవ జీవితంలో ప్రతి ఒక్కరే ద్యానని నేర్చుకోవాలని మీరు నేరుచుకొన్న ధ్యాన జ్ఞానాన్ని ఇతరులకు ఇవలన్నారు. డాక్టర్ న్యూటన్ కొం డవీటి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ద్యానం నేర్చుకోవాలని ,ప్రకృతిని ప్రేమించలి, ప్రాణుల పట్లా దయతో ఉండాలని సందేశాం తెలిపారు. ప్రపంచం అ తుల కుతులం అయ్యిన నాటికి చెట్లే మనకు జీవదరాలు అవుతాయని అందుకని ప్రతివొక్కరు చెట్లు నాటలని ,క్వాంటం లైఫ్ పౌండేషన్ లోని 80శాతం భూమిని మొక్కలతో నింపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బహ్మ విద్వరిస్ట , డాక్టర్ లక్ష్మీ న్యూటన్ , లైఫ్ ఫౌండేషన్ ట్రస్టీలు ,అచార్యులు ,వివిధ రాష్టాలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ



ప్రజాపక్షం/తాండూర్/బంట్వారం : తాండూర్ మండల కేంద్రంలో ప్రెండ్స్ సహాయక సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. గత 18 యేళ్లుగా వృద్ధులకు దివ్యాంగులకు, తల్లి దండ్రులు లేని విద్యార్థులు విద్యా సామాగ్రీ టెక్ట్స్ బుక్స్, నోట్ బుక్స్, చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రం సన్మాన కార్యక్రమాలు, నిరుపేదలకు ఆర్థిక సహాయం అందించడం జరిగుతుందని ప్రెండ్స్ సహాయక సంఘం సభ్యులు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో కుర్షద్ హమ్మద్, హనుమంతు. శ్రీనివాస్, భానుచందర్, తదతరులు ఉన్నారు.

## విద్యుత్ అవినీతి కుంభకోణాలపై

# అదానీని అరెస్ట్ చేయాలి

### అదానీ అక్రమాలకు సహకరించిన ప్రధాని రాజీనామా చేయాలి




ప్రజాపక్షం/ఉప్పల్ :గౌతమ్ంఅదానీ, అతని సహచరులపై అమెరికన్ కో ర్టులో 250 మిలియన్ల లంచం 2500 కోట్లు విద్యుత్ అవినీతి కుంభకోణాలపై విచారణ జరిపించాలని, భారత దేశ ప్రతిష్టతను దెబ్బతీసిన అదానీని అరెస్ట్ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వివిఎస్ బోస్ డిమాండ్ చేశారు. సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఇసిఐఎల్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద ఆదివారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వివిఎస్ బోస్ మా ట్లాడుతూ, అదానీ గ్రూప్‌పై తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయని, అదానీ గ్రూప్ మురికి ముఖం ప్రజలకు తెలిసిందన్నారు. ఆర్థిక అవకతవకలు, ఉల్లంఘనలను సూచించే అభియోగాలు, జవాబుదారీతనం, పారదర్శకత లోపించిందన్నారు. మోదీ అదానీ అనుబంధం దేశానికి తీవ్ర ముప్పని, సామాన్య ప్రజానీకం పేదరికం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఇతర సమస్యలతో కొట్టుమిట్టాడుతుండగా, మోదీ అధికారం చేపట్టిన తర్వాత అదానీ సంపద అనేక రెట్లు పెరిగిందన్నారు. అదానీ గ్రూప్‌కు సంబంధించిన సూచన దేశంలో అదానీ అసాధారణ ప్రభావాన్ని బహిర్గతం చేసిందన్నారు. గతంలో అదానీ అంశంలో హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను కూడా వాస్తవమేనని వారు గుర్తు చేశారు. కార్పొరేట్ దురాశ, రాజకీయ శక్తి ప్రమాదకరమైన ఖండనను బహిర్గతం చేస్తుందన్నారు. ఇది అదానీ వంటి వ్యక్తులను శిక్షార్హతతో పనిచేయడానికి అనుమతించిందన్నారు. ఈ లంచం కుంభకోణం అదానీ ప్రతిష్టను మరింత దిగజార్చిందని, భారత ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాత్రను ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. ప్రధానమంత్రిగా ఉన్న మరెవ్వరూ పోషించని వ్యవస్థలో కోట్లాది రూపాయల లంచాలు చెల్లిస్తున్నారన్నారు. నా ఖౌంగా నా ఖానే దుంగా అని మోదీ అన్నప్పుడు, వాస్తవానికి ఆయన ఉద్దేశ్యం. ఆయన కోటరీ అభివృద్ధి చెందుతుందన్నారు. అదానీ అనైతిక వ్యాపార విధానాలపై జెపిసి డిమాండ్‌ను, బిజెపి ఆధ్వర్యంలోని క్రోనీ క్యాపిటలిజం పూర్తి స్థాయిని బహిర్గతం చేయాలని వారు డి మాండ్ చేశారు. భారతదేశంలో సెబీ వంటి నియంత్రణ సంస్థల పాత్ర, దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రజల ప్రయోజనాలను కాపాడటంలో విఫలమైందనే ప్రశ్నలను లేవనెత్తిందన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ ద్వారా సమగ్రమైన నిష్పక్షపాతమైన విచారణ జరిపి, నిజాన్ని వెలికితీసేందుకు విచారణ తప్పనిసరిగా నిర్వహించాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. అదానీ గ్రూపునకు ఇచ్చిన ఇతర ప్రాజెక్టులు, కాంట్రాక్టుల వాస్తవికతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అదానీ గ్రూపునకు ఇచ్చిన కాంట్రాక్టులు, ప్రాజెక్టులన్నీ వెనక్కి తీసుకోవాలని, తక్షణమే విచారణకు డిమాండ్ చేశారు. సిపిఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి. దామోదర్ రెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.శంకర్ రావు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి నేతలు నారా నర్సింహ, సుధాకర్, మోహన్, స్వామిదాస్, మిరియాల సాయిలు, నారాయణ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులు ఉన్నత స్థాయికి ఎదగాలి

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ కాసోజు నాగజ్యోతి




ప్రజాపక్షం/బోడుప్పల్: ఉప్పల్ డిపోలోని శ్రీనారాయణ కళాశాల ఆవరణలో ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా గర్ల్స్ వింగ్ సమావేశం ఆదివారం ఏర్పాటు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యథితులుగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ కాసోజు నాగజ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ, ప్రభుత్వాలు విద్యార్థునుల విద్యపట్ల సరైన సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు విద్య పట్ల ఆసక్తి కనబర్చడం లేదని, దీనికి ప్రధాన కారణం ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలే కారణమని తెలిపారు. బాలికలు నేడు సమాజంలో జరుగుతున్న అవినీతి, అ క్రమాలపై ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి, ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి పేర్కొన్నారు. వారు విద్యాపరంగా, ఆర్థిక పరంగా, సామాజికంగా, రాజకీయపరంగా ఉన్నత స్థానాలు అధిరోహించాలని, ప్రభుత్వాలు కూడా బాలికల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించా న్నారు. విద్యాసంస్థల్లో జరుగుతున్న ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించాలని, ఆత్మహత్యలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండి.అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, హైకోర్ట్ లీగల్ అడ్వైసర్ షేక్ యూసుఫ్, శ్రీనారాయణ కళాశాల కరెస్పాండంట్ మధుకర్, వినయ్, ప్రియాంక, ప్రవళిక, సంధ్య, లక్ష్మిప్రసన్న, హరిణి, సుజాత, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేడ్చల్ జిల్లా నూతన బాలికల కన్వీనర్ కౌన్సిల్ ఎన్నుకోవడం జరిగింది. కన్వీనర్గా భూషరాజు శృతి, కో కన్వీనర్లు గా వడపర్తి శరణ్య, మంచోజు శిరీష లను ఎన్నుకోవడం జరిగింది.

## సర్వే డేటా ఎంట్రీ కీలకమైనది



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి: వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఉమముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గోన్నారు. కలెక్టర్ పలు సూచనలు చేశారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందని, సర్వే డేలా ఎంట్రీ చాలా కీలకమైందని ,ఎలాంటి పొరపాట్లకు అస్కారం లేకుండా చూడాలని కలెక్టర్‌కు చూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా క్రమద్ధికరించుకోవాలని తెలిపారు. పాఠశాలలో, వసతి గృహాల్లో, రెసిడెన్సియల్ పాఠశాలలో పుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయని ,పాఠశాలల్లో ఆహారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు.

## సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రజాపక్షం/తాండూరు: బీదల చదువుకు సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యాన కాంగ్రెస్ ప్రభుత్వం చదవుకు పెద్దపీటం వేస్తుందని తాండూరు నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. తాండూరు నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయడం పట్ల ఆదివారం తాండూరు నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో సిఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిల చిత్రపాటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అబ్దుల్ రావుఫ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వద్దే శ్రీనివాస్, పి. బస్వరాజు, యలాల పిఎసిఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, బషీరాబాద్ పిఎసిఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ తదిర నాయకులు సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తాండూరుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఈ స్కూల్ ఏర్పాటుతో బీద బడుగు విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుందని అన్నారు. ఈ సందర్భంగా వారు సిఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాధాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు హబీబ్‌లాల, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, కౌన్సిలర్‌లు ప్రభాకర్‌గౌడ్, బోయ రవి రాజు, ప్రవీణ్‌గౌడ్, మాజీ కౌన్సిలర్‌లు లింగదల్లి రవికుమార్, మాజీ వైస్ చైర్మన్ తదితరులు ఉన్నారు.

## శ్రీరమాసహిత సత్యనారాయణ బ్రహ్మోత్సవాల్లో మాజీ మంత్రి



ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేట మండలం అలియాబాద్ ప్రధాన చౌరస్తాలోని శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి విచ్చేసి ప్రారంభ పూజలు చేశారు. ఆదివారం శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలను ఆలయ ధర్మకర్త పల్లె జ్యోతిరాములు గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తులు నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి అనిత లాలి, మాజీ సర్పంచ్ గుర్క కుమార్‌యాదవ్, బిఆర్ఎస్ శామీర్‌పేట అధ్యక్షుడు సరసం మోహన్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు బిఎన్ఆర్, నాయకుడు వంగ వెంకట్‌రెడ్డి, లాలి, జగదీష్‌గౌడ్, నందుగౌడ్, భక్తులు పాల్గొన్నారు.

### ఫైనల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మల్లారెడ్డి

కాగా శామీర్‌పేట మండలం తుర్కపల్లిలో నిర్వహిస్తున్న చివరి క్రికెట్ మ్యాచ్‌ను మాజీ మంత్రి మల్లారెడ్డి టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారభించారు. అలాగే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తుర్కపల్లిలోని గౌనె మైసమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు మల్లారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

## చిల్కానగర్‌లో ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియంలో వసతులు ఏర్పాటు

ప్రజాపక్షం/ఉప్పల్: చిల్కానగర్ డివిజన్లోని ఇండోర్ బ్యాట్మెంటన్ స్టేడియంలో వసతులు ఏర్పాటు చేయాలని వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడాకారులు కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ని కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వెంటనే కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ అడిషనల్ కమిషనర్ స్పోర్ట్స్ యాదగిరి రావుతో మాట్లాడుతూ, ఉప్పల్ ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియంలో వసతులు ఏర్పాటు చేయాలని కోరుతూ, వారిని స్టేడియాన్ని సందర్శించాల్సిందిగా కోరారు. అందులో భాగంగా ఈరోజు అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు స్పోర్ట్స్ ఇన్‌చార్జి వెంకట్ రెడ్డితో కలిసి పాడైపోయిన మాట్ నీ, అలాగే నూతన లైట్లు ఏర్పాటు చేయాలని, విండో గ్లాసెస్ విరిగిపోయాయని విండో కర్టన్స్ మార్చాలని బాత్రూంలు మెయింటెనెన్స్ సరిగా చేయట్లేదని, పావురాలు స్టేడియంలోకి రాకుండా వెంటిలేటర్‌కి నెట్టు ఏర్పాటు చేయాలని క్రీడాకారులు అడిషనల్ కమిషనర్ దృష్టికి తీసుకు రావడం జరిగింది అదేవిధంగా మున్సిపల్ మైదానంలో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్ పరికరాల బాగా పాడైపోయి శిథిలావస్థకు చేరిన పరికరాలను మార్చాలని,మెయింటెనెన్స్ కూడా సరిగ్గా చేయట్లేదని, మైదానంలో ఉన్న టాయిలెట్స్ ని కూడా మైంటైన్ చేసే విధంగా చూడాలని వాకర్స్ చూపించడం జరిగింది. స్టేడియాన్ని సందర్శించి అన్ని పనులకు వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి పనులు త్వరత గతిన పూర్తి చేస్తానని క్రీడాకారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం సభ్యులు పాల్గొన్నారు.

## వృద్ధులకు పండుగ వాతావరణం





ప్రజాపక్షం/ నిజాంపేట్ : పెద్దల జాతర పేరుతో విటివిజ ది వాలెంటీర్స్ స్వచ్ఛంద సంస్థ వృద్ధాశ్రమాలలోని వృద్ధులకు పండుగను నిర్వహించారు. హైదరాబాద్‌లోని సుమారు ఇరవై వృద్ధాశ్రమంలో జీవనం సాగిస్తున్న సుమారు 300 మందిపైగా వృద్ధులను విటివిజ ది వాలంటీర్స్ స్వచ్ఛంద సంస్థ ఒకే వేదిక పైకి తీసుకువచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బౌరంపేట్ గ్రామంలోని శిఖర ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం విటివిట ది వాలంటీర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఇరవై వృద్ధ ఆశ్రమంలోని సుమారు 300 మందికి పైగా వృద్ధులకు పెద్దల జాతర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వృద్ధులందరికి పండుగ వాతావరణాన్ని కల్పించారు. ఉదయం టిఫిన్‌తో పాటు మధ్యాహ్న బోజనం వంటి సదుపాయాలతో వృద్ధులలో దాగిఉన్న ప్రతిభను గుర్తించి వారిచే వేదిక పై నృత్యాలు, గీతాలు, డైలాగ్స్ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన వారికి ప్రత్యేకమైన బహుమతులు, ప్రశంసాపత్రాలను స్వచ్ఛంద సంస్థ సభ్యులు అందజేశారు. ఈ సంబరాలతో వృద్ధుల్లో సందడి నెలకొంది. ఆశ్రమాలలో జీవనం గడుపుతున్న వృద్ధులకు స్వచ్ఛంద సంస్థ చేసిన ఈ పెద్దల జాతర కార్యక్రమంతో నూతన ఆనందోత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా విటివిజ ది వాలెంటీర్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సురేన్, సువర్ణలు మాట్లాడుతూ ఈ సంస్థను స్థాపించి ఏడు సంవత్సరాలు గడుస్తుందని, ఈ పెద్దల జాతర కార్యక్రమాన్ని బెంగులూరులో ఐదు సార్లు, చెన్నైలో రెండు సార్లు, నగరంలో నేడు ప్రథమంగా నిర్వహించామని తెలిపారు.

## కోట్‌పల్లి ప్రాజెక్టుకు వీకెండ్ సందడి





ప్రజాపక్షం/తాండూరు: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకే మణిహారంగా ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల సందడి నెలకొంది. వారంతర సెలవులు చూసుకుని పర్యాటకులు కోట్‌పల్లి ప్రాజెక్టకు వచ్చిన సేద తీరుతున్నారు. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలంలో వెలసిన కోట్‌పల్లి ప్రాజెక్టుకు చరిత్ర ఉంది. జిల్లా కేంద్రానికి 15కిలో మీటర్ల దూరంలో ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టు అందాలను వీక్షించేందుకుగాను పర్యాటకులు బారులు తీరారు. ముఖ్యంగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిసర ప్రాంతాల నుండి ప్రత్యేక వాహనాలలో కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకులు వస్తున్నారు. ఈ సారి వర్షాలు సమృద్ధిగా కరువడంతో కోట్‌పల్లి ప్రాజెక్టు నిండు కుండల మారింది. గత కొంత కాలంగా కోట్ ప్రాజెక్టు పర్యాటకులను నిషేదించిన అధికారులు ఇటీవలనే తిరిగి అనుమతించడంతో ఒక్కసారిగా కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల సందడి నెలకొంది. చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జెకెవిఆర్ పౌండేషన్ ఆధ్వర్యాన ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యం కల్పించడంతో పర్యాటకులు తాకిడి పెరిగింది. ప్రాజెక్టు పరిసర ప్రాంతంలో చిరు వ్యాపారులు చిన్న హోటల్స్ ఏర్పాటు చేసి పర్యాటకులకు ఆహార రుచులను అందిస్తున్నారు. మరో పక్క అటవి శాఖాధికారులు ప్రాజెక్టుకు వచ్చి పోయే వారికి సిసి కెమెరాల ఏర్పాటు చేసిన వారి వివరాలను నమోదు చేస్తున్నారు.

**ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి**

ఎంతో ఘన చరిత్ర కలిగిన కోట్‌పల్లి ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పర్యాటకులు కోరుతున్నారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను సుందరంగా తీర్చి దిద్దితే మంచి పర్యాటక కేంద్రంగా మారి జిల్లాకు మణిహారంగా మారనుందని పర్యాటకులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో హామీలు నాయకులు ప్రాజెక్టును ప్రత్యేకంగా తీర్చిదిద్దాలని కోరుతున్నన్నారు.

## భారతీయులందరికీ రాజ్యాంగం అత్యంత పవిత్ర గ్రంథం

ప్రజాపక్షం/బోడుప్పల్:బోడుప్పల్ నగర పాలక సంస్థలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి 301వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి నాయకులు ఏనుగు లక్ష్మయ్య, దాసరి మహేష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అంజయ్య పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ, భారతదేశంలోని ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని విధిగా చదవాలని, ప్రతి ఒక్కరు రాజ్యాంగం ప్రకారం తమ విధులను నిర్వర్తిస్తూ,బాధ్యతలను పాటించినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఒక మతానికి మత గ్రంథం ఎంత పవిత్రమైందో అదేవిదంగా ప్రతి భారతీయుడికి భారత రాజ్యాంగం కూడా అంతే పవిత్రమైందని, ప్రతి భారతీయుడు విధిగా రాజ్యాంగాన్ని చదవాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. నాయకులు పర్వతాపూర్ జైహింద్ గౌడ్, భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య, బండారి సాయి పాల్గొన్నారు.

## ఓటరు నమోదుపై అవగాహన



**ప్రజాపక్షం/కేశంపేట :** కేశంపేట మండ లం సంగెం గ్రామంలో ఆదివారం ఓటరు నమోదు కార్యక్రమంపై తహసీల్దార్ ఆజం అలీ ఆధ్వర్యంలో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను తాసీల్దార్ పరిశీలించిన అనంతరం ఓటరు నమోదు చేసుకునే విధానంతో పాటు మార్పులు, చేర్పులు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గీత పాల్గొన్నారు.

# మహానగరి

## బిసి కులగణన చేపట్టాలి : కృష్ణయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం జనగణలో కులగణన చేపట్టాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, బిసిల సంక్షేమానికి పాటుపడాలన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయ మీడియా పాయింట్ వద్ద ఆయన ఆదివారం మాట్లాడుతూ పార్లమెంట్‌లో బిసి బిల్లును ప్రవేశపెట్టి చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. ప్రైవేట్ రంగంలో ఎస్‌సి,ఎస్‌టి,బిసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రం అమలు చేస్తున్న రిజర్వేషన్లను 27 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు.

## మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేయటమే లక్ష్యం

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** మత్స్య కారులలను ఆర్థికంగా అభివృద్ధి చేయటమే ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే రంగారెడ్డి హాజరై ఇబ్రహీంపట్నం పెద్దచెర్వులో ఉచిత చేప పిల్లలను వదిలారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గంగపుత్రులను, ముదిరాజ్ కులస్తులను ఆర్థికంగా అభివృద్ధి చేయటానికి ప్రత్యేక నిధులు కెటాయించి ఉపాధి అవకాశాలు కల్పించటానికి ప్రభుత్వం చర్యలు చేపట్టుతుందన్నారు. నియోజక వర్గంలో ఉన్న చెరువులలో సుమారు 41లక్ష68వేల 225 చేపపిల్లలను ఈ సంత్సర్సం వదులాలని ప్రభుత్వం నిర్ణయిచిందన్నారు. మత్స్యకారులు సమన్వయంతో ఉండి చెరువులు, కుంటలను పరిరక్షించుకోని అభివృద్ధి చెందాలన్నారు.ఇబ్రహీంపట్నం పెద్ద చెర్వులో 4లక్షల 40 వేల చేపపిల్లలను వదిలినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మిట్టు సాయికుమార్, మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతిచందు, వైస్‌చైర్మన్ మంగా, జిల్లా మత్స్యశాఖ అధికారి బి.పూర్ణిమ, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు భీంరావు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ పథకం పేదలకు వరం

జిహెచ్‌ఎంసి ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి



**ప్రజాపక్షం/చంపాపేట:** పేద మధ్యతరగతి ప్రజలకు వైద్య చికిత్సల కోసం సిఎంఆర్‌ఎఫ్ పథకం ఆర్థికంగా చేయూత అందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని జిహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడకు చెందిన బాలమణి కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. పేద కుటుంబం కావడంతో సిఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికంగా ఆదుకోవాలని ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డిని కలిసి విన్నవించారు.దీంతో సిఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా రూ.39వేల రూపాయలను మంజూరు చేయించి ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితురాలికి రాజశేఖర్‌రెడ్డి చెక్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌గౌడ్, శివగౌడ్, కందికంటి శ్రీధర్‌గౌడ్, వెంకట్ రెడ్డి, బాలరాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ మిని స్టేడియానికి రూ.2.75 కోట్ల నిధులు మంజూరు

కాంగ్రెస్ నాయకుల హర్షం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** షాద్‌నగర్ మిని స్టేడియం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తానని ఎంఎల్‌ఏ శంకర్ ఇచ్చిన హామీని నెరవేర్చారు. ఎంఎల్‌ఏ శంకర్ కృషితో మినీ స్టేడియం అభివృద్ధికి ప్రభుత్వం 2.75 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిధుల మంజూరు పట్ల పార్లమెంటరీ యువజన సంఘం అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్, నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ ఖదీర్, స్పోర్ట్స్ చీఫ్ ప్యాట్రన్ కబీర్ అహ్మద్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు చిన్నలు షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సీఎం రేవంత్‌రెడ్డి, శాట్స్ చైర్మెన్ శివాసేనారెడ్డి, ఎంఎల్‌ఏ వీర్లపల్లి శంకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శంకరన్న ఇచ్చిన క్రీడాకారులకు ఇచ్చిన హామీ ప్రకారం నిధులు మంజూరి చేయించడం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ నాయకులు ముబారక్ అలీఖాన్, సయ్యద్ అక్రమ్, బచ్చలి నరేష్, ప్రవీణ్, మహ్మద్, కృష్ణ, ఖాజా, ఖాసీం, గంగు రాము, సురేష్, మురళి, సాయి, వంశీ, మహేష్, తేజ, అజయ్, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి-పర్వతాపూర్ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి నుండి పర్వతాపూర్ వెళ్లే ప్రధాన రహదారి వరద నీటి కారణంగా గుంతలు పడి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో శాశ్వత పరిష్కారం కోసం 2వ డివిజన్ కార్పొరేటర్ సుభాష్ నాయక్,15వ డివిజన్ కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్ చేస్తున్న కృషి ఫలించింది. సమగ్ర కుటుంబ సర్వే కారణంగా పనుల్లో జాప్యం జరిగిన విజి కాలనీ కమాన్ నుండి పంచవటి కాలనీ రోడ్ నెంబర్ 2 వరకు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుభాష్ నాయక్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బండారి రవీందర్, జయేందర్, బలరాం, వీజీ కాలనీ అధ్యక్షులు ఆర్ పాపయ్య, సుకురు, సౌత్ పంచవటి కాలనీ అధ్యక్షులు నరసింహారావు, నాగేశ్వరరావు, వరికుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నా నివాసం బఫర్ జోన్‌లో లేదు

హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ స్పష్టీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రా పేరు చెప్పితేనే చెరువులు, నాలాల పరిసర ప్రాంతాల్లో నివాసితులు హడలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో హైడ్రా కమిషనర్ నివాసమే బఫర్ జోన్‌లో ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో ఉన్న ఇళ్లను కూల్చిన హైడ్రా కమిషనర్ ఇంటిని ఏవరూ కూల్చుతారంటూ విమర్శలు వ్యక్తం అయ్యాయి. దీంతో హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ ఈ విషయంపై ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. హైదరాబాద్ మధురా నగర్‌లో మేము నివాసం ఉంటున్న ఇళ్లు నాలుగు దశాబ్దాల కిందట మా నాన్నగారు నిర్మించారు. కృష్ణకాంత్ పార్కు దిగువన ఉన్న వేలాది ఇళ్ల తర్వాత మా ఇళ్లు ఉంది. మా నాన్నగారు నిర్మించిన ఈ ఇళ్లు బఫర్ జోన్‌లో ఉందని సామాజిక మాధ్యమాలతో పాటు పత్రికలలో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదు. ఒకప్పటి పెద్ద చెరువునే రెండున్నర దశాబ్దాల కిందట కృష్ణకాంత్ పార్కుగా మార్చిన విషయం తెల్సిందే. అయినప్పటికీ చెరువు కట్టకు దిగువన 10 మీటర్లు దాటితే, కింద ఉన్న నివాసాలు ఇరిగేషన్ నిబంధనల మేరకు బఫర్ జోన్ పరిధిలోకి రావు. అయినప్పటికీ కట్టకు దాదాపు కిలోమీటర్ దూరంలో మేము నివాసం ఉంటున్న ఇళ్లు ఉంది. వాస్తవాలు ఇలా ఉంటే తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కొంతమంది చేస్తున్న ప్రయత్నాన్ని ఖండిస్తున్నామని తెలిపారు.

**వాస్తవాలు ఇవి..** మా నాన్న ఎ.పి.వి. సుబ్బయ్య 1980 సంవత్సరంలో మేము ఉంటున్న ఇంటిని నిర్మించారు. 44 సంవత్సరాల క్రితం నిర్మించిన అదే ఇంట్లో మా తండ్రితో కలిసి ఉంటున్నాము. ప్రస్తుత కృష్ణాకాంత్ పార్కుగా ఉన్న స్థలంలో సుమారు 25 సంవత్సరాల క్రితం ఒక చెరువు ఉండేది. చెరువు ఉన్నప్పటి నిబంధనల ప్రకారం అయినా మేము ఉంటున్న నివాసం కట్టకు ఒక కిలోమీటరు దూరంలో ఉంది. సంస్కృతి, సాంప్రదాయాలలో భాగంగా చెరువు కట్ట మీద, కట్టను ఆనుకొని కట్ట మైసమ్మ ఆలయాలు నిర్మిస్తారనే విషయం అందరికీ తెలిసిందే. మేము నివాసం ఉంటున్న ఇంటికి ఒక కిలో మీటరు దూరంలో కట్ట మైసమ్మ గుడి ఉంది. ఎక్కడైనా చెరువు కట్ట ఎత్తుపై ఆధారపడి దిగువ భాగంలో 510 మీటర్ల వరకు ఉన్న స్థలాన్ని బఫర్ జోన్‌గా ఇరిగేషన్ శాఖ పరిగణిస్తుంది. 25ఏళ్ల క్రితం పెద్దచెరువు, ప్రస్తుతం కృష్ణకాంత్ పార్కుగా మారిన స్థలం మా నివాసానికి 1 కిలోమీటర్ దూరంలో ఉంది. ఈ విషయాన్ని గమనించాలని కోరుతున్నాను. మేము నివాసం ఉంటున్న ఇళ్లు బఫర్ జోన్‌లో లేదు అనేది వాస్తవం అనేది అందరూ



గ్రహించాలి. ఇందుకు సంబంధించిన ఫొటో లు పరిశీలించాలని కోరుతున్నాను అని ఆయన వివరించారు.

## సాంకేతికతతో సవాళ్లను అధిగమించాల్సిన అవసరం ఉంది

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** దేశ వ్యాప్తంగా వేగంగా మారుతున్న సాంకేతికతలతో ఎదురయ్యే సవాళ్లను అధిగమించాల్సిన అవసరం రైల్వే ఉద్యోగులు, సిబ్బందికి ఉందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పిలుపు నిచ్చారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిగ్నలింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్ (ఇరిసెట్ ) 67వ వార్షిక దినోత్సవాన్ని ఆదివారం సికింద్రాబాద్‌లో రైల్వే ఉద్యోగులు, సిబ్బందిఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ భారతీయ రైల్వేలో సిగ్నలింగ్ ,టెలికమ్యూనికేషన్ ఆస్తుల విశ్వసనీయతను మెరుగుపరచడంలో నైపుణ్యాలను అందించడంలో ఇరిసెట్ చొరవ తీసుకోవాలని కోరారు. ఉత్పాదకతను మెరుగుపరచడానికి , రైలు కార్యకలాపాలలో భద్రతను పెంచడానికి శిక్షణా కార్యక్రమాల నిర్వహణ తప్పని సరి అని అన్నారు. ఈ సందర్భంగా 12 మంది ట్రైనీలకు అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డులను అరుణ్ కుమార్ జైన్ అందజేశారు. వార్షిక నివేదికను ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ శరద్ కుమార్ శ్రీవాస్తవ సమర్పించారు. అనంతరం ఐఐటి మద్రాస్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణ గంటి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులను రైల్వే సిగ్నలింగ్ సాంకేతికతల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రైల్వే బోర్డు అదనపు సభ్యురాలు (సిగ్నల్) విజయలక్ష్మి కౌశిక్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తు మౌలిక సదుపాయాల కల్పన,నిర్వహణ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్అండ్‌టి ఇంజనీర్లను కోరారు.



## ఒక భద్రతా సందేశం.. వేల మంది ప్రాణాలకు రక్షణకవచం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గడ్డి అన్నారం శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా సేఫ్ ఇండియా కార్యక్రమాన్ని ఒక భద్రత సందేశం వేల మంది ప్రాణాలు కాపాడుతుంది అనే ఉద్దేశంతో మొదట భద్రత అయినా రోడ్డు భద్రత కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మలక్ పేట ట్రాఫిక్ ఎస్ఐ రామస్వామి హాజరై ట్రాఫిక్ నిబంధనలను అందరూ విధిగా పాటించాలని అనధికార డ్రైవింగ్ మంచిది కాదని సూచించారు ట్రాఫిక్ సిగ్నల్,వాటి గుర్తులు పాటించాల్సిన విధానాలను గురించి వివరించారు రోడ్డు నిబంధనలను విద్యార్థులు పాటిస్తూ తల్లి దండ్రులు కూడా పాటించేలా చూడాలని అలాగే హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా ప్రేరేపించడం బాధ్యతగా స్వీకరించాలని సూచించారు పాఠశాల ప్రిన్సిపల్ సువర్ణరేఖ గారు, మాట్లాడుతూ రోడ్డుమీద ప్రయాణించేటప్పుడు వేగ పరిమితులను అనుసరించాలని ఎదుటి వాహనాల దృష్టిలో ఉంచుకొని వాహనాలను నడపాలని విద్యార్థులకు తెలియజేశారు ఇందుకు సంబంధించి కాలనీలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో దిల్సుఖ్నగర్ జోన్ ఏజీఎం టి. సతీష్ గారు,ఆర్ ఐ రవీందర్ రెడ్డి గారు, కోఆర్డినేటర్ జితేందర్ గారు పాఠశాల ప్రిన్సిపాల్ సువర్ణరేఖ గారు పాఠశాల డీన్ రామశర్మ గారు ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు చిన్నా జాగ్రత్తల వల్ల విలువైన ప్రాణాపాయం జరగవచ్చని అందుకోసం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణం సాగించాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు తెలిపారు

## విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి

గైనకాలజీ డాక్టర్ రూమా సిన్హా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైద్యులు రోగుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని అపోలో హాస్పిటల్స్ గైనాకాలజీస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ రూమా సిన్హా తెలిపారు. వైద్య విద్యలో అడుగు పెడుతున్న విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన 'వైట్ కోట్ వేడుక'ను అపోలో ఇన్సిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌ని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ రూమా సిన్హా విద్యార్థులకు వైట్ కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగితో మాట్లాడేటప్పుడు శాంతంగా, ఆత్మవిశ్వాసంతో ఉండాలని, తద్వారా రోగికి నమ్మకం పెరుగుతుందన్నారు. రోగి మీ సలహాతో మెరుగుపడితే, జీవితాంతం మిమ్మల్ని జ్ఞాపకం ఉంచుకుంటారని తెలిపారు. అదే ఒక డాక్టర్ తన జీవితంలో పొందే గౌరవం అన్నారు.ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ కే మనోహర్, అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మనిషి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో దోహదపడుతుందని ఉచిత వైద్య శిబిరాల నిర్వాహకురాలు శ్రీలత రాణి అన్నారు.రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. పిఎంఎస్ఎస్ ఆర్గనైజేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని శివారు ప్రాంతంలో పిఎంఎస్ఎస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శ్రీలతరాణిని 'నారీరత్న' పురస్కారంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఎంఎస్ఎస్ ఆర్గనైజేషన్ సుధారాణి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీలతారాణి మాట్లాడుతూ రక్తదానం ఒక కుటుంబానికి జీవితాన్ని ఇస్తుందని వివరించారు. సుధారాణి కృష్ణంరాజు మాట్లాడుతూ తమ సంస్థ అనేక సేవాకార్యక్రమాలతో పాటు రక్తదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని వివరించారు. వైద్య సేవలతో పాటు డ్వాక్రా మహిళా సంఘాలు ఏర్పాటు, వృత్తి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్న వారిని ప్రతిఏటా అవార్డుతో సత్కరిస్తుందని వివరించారు.

## ఆర్థికసాయం అందజేత



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పేదరికంతో వైద్యం కోసం ఇబ్బంది పడుతున్న రోగికి బ్రెయిన్ ఆపరేషన్ నిమిత్తం కాంగ్రెస్ సీనియర్ నేత పిట్టల నాగరాజు ఆర్థిక సాయంగా రూ.10 వేలు అందించారు. ఆదివారం రోగి చికిత్స పొందుతున్న హేకరెహబ్ ఆస్పత్రికి వెళ్లిన ఆయన చికిత్స పొందుతున్న అజీ బేగంకు సహాయం అందించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు స్ఫూర్తితో తాను సహాయ కార్యక్రమాలను కొనసాగిస్తున్నానని ఈ సందర్భంగా నాగరాజు తెలిపారు.

## నిధులు లేకనే కాలనీలు అభివృద్ధికి నోచుకోవడం లేదు



ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపణ

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయిన తార్వత దాదాపు సంవత్సరం కావస్తున్న నియోజకవర్గాలకు నిధులు మంజూరు చేయకపోవడే కాలనీలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఎల్‌బి నగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సిబిఐ కాలనీ నూతన కమ్యూనిటీహాల్‌ను ఆయన కాలనీ అధ్యక్షులు ముచ్చ సతీష్ కుమార్ చౌదరి, పార్టీ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో దాదాపు 970 కాలనీలు ఉన్నాయని, ప్రతి సంవత్సరం కాలనీలకు దాదాపు 100కోట్ల నిధులు మంజూరు అయ్యేలా ఉండేదని, కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత సంవత్సరం పేరు మీద 5నుంచి 6 కోట్లు మాత్రమే నిధులు మంజూరు చేశారని తెలిపారు. కాలనీలకు డ్రైనేజీ, వాటర్ పైప్‌లైన్, ట్రంక్‌లైన్, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు అనేక సౌకరాల ఏర్పాటు నిధులు లేక అభివృద్ధి కుంటుబడిందని పేర్కొన్నారు.



కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున గౌడ్, పోగుల రాంబాబు, నీలం రాజశేఖర్ గౌడ్, రాఘవవేంద్ర రావు, గంగం శివకుమార్, సుమన్‌గౌడ్, సిబిఐ కాలనీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి మహేందర్‌రెడ్డి, పాపి రెడ్డి, వెంకటరమణ తతదితరులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని ఎంఎల్‌ఏ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం శివ దీక్ష స్వాములు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీమల్లికార్జున భక్త సమాజం రాష్ట్ర అధ్యక్షులు ముద్దగౌని సతీష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో శివదీక్ష తీసుకునే స్వాములకు ఉచితంగా మాలధారణ, వసతి, భోజన సౌక ర్యం, దీక్ష అనంతరం శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనం కల్పిస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో భవాని ప్రవీణ్ కుమార్, శివస్వాములు నరేందర్, ప్రవీణ్, నిఖిల్, సంజయ్, సురేష్, హర్షిత్, అంజనేయులు, సైదులు, వెంకటరావు, అంజి, శ్రీను, శంకర్ బాబు, శ్రీనివాస్, అంజి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిపిఐ శత జయంతి ఉత్సవాలు

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి పిలుపు





**ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ :** సమసమాజ నిర్మాణం కోసం అమర వీరుల రక్తం అర్పించి శ్రామిక రాజ్యం కోసం పోరాటం చేసినా ఘనత సిపిఐదని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ కూంట్లూర్‌లోని రావినారాయణ రెడ్డి నగర్‌లో ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అబ్దులాపూర్‌మెట్ మండల సిపిఐ సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా రవీంద్రాచారి హాజరై మాట్లాడుతూ పేదల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసే సిపిఐ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నా సంధర్బంగా వేడుకలు ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజల పక్షాణ పోరాటం చేస్తున్న పార్టీ కోసం పార్టీ సభ్యత్వాలు ముమ్మరంగా చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాజ్యాగం పరిరక్షణకు, లౌకిక ప్రజాస్వాం కోసం సిపిఐ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఎఐటియుసి నాయకులు అజ్మీర్ హరిసింగ్ నాయక్, కేతరాజు నర్సింహ్మా, వేణుగోపాల్, అరుణ, నవనీత, మధు, నర్సింహ్మా, నారాయణ రెడ్డి, పుల్లయ్య, నారాయణ, రాజు గౌడ్, రాములు, వెంకన్న, ఈశ్వరయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్‌బినగర్ :** సిపిఐ శత జయంతి ఉత్సవాలను వాడవాడల ఘనంగా జరపాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రావు భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రవీంద్రచారి మాట్లాడుతూ సుదీర్ఘ చరిత్ర కలిగిన సిపిఐ శత జయంతి ఉత్సవాలను ఘనంగా జరపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. భారత దేశంలో సంపూర్ణ స్వాతంత్రం కోసం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటంలో ఎంతో మంది ప్రాణాలను లెక్కచేయకుండా వేలాది మంది త్యాగాలు చేసిన వీర చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. 1925 డిసెంబర్ 25న కాన్పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు నుండి కార్మికుల హక్కుల కోసం భూమి కోసం భూక్తి కోసం వెట్టి చారికి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు అనేక ఉద్యమాలలో వేలాది మంది అమరవీరులను స్ఫరించుకోవాలన్నారు. ఈనెల 26న ఎల్‌బి నగర్ నియోజకవర్గ సిపిఐ జనరల్ బాడీ సమావేశం విజయవంతం చేయాలన్నారు. సిపిఐ ఎల్‌బి నగర్ నియోజకవర్గ కన్వీనర్ సామిడి శేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించగా కోకన్వీనర్ బాత రాజు నర్సింహ్మా, బోయపల్లి రాములుగౌడ్, కందుల సుధాకర్, రమావత్ సక్రు నాయక్ పాల్గొన్నారు.

# క్రీడ

## రిషభ్ పంత్‌పై కాసుల వర్షం..

### ఐపీఎల్ చరిత్రలో ఆల్‌టైమ్ రికార్డు ధర



ఐపీఎల్ మెగా వేలం అంచనాలకు మించి సాగుతోంది. ప్రధాన ఆకర్షణగా నిలిచిన ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు రూ.కోట్లు కుమ్మరిస్తున్నాయి. మైదానంలో ప్రత్యర్థి జట్లు హోరాహోరా పోటీకి దీటుగా ఫ్రాంచైజీ యజమానులు తలపడుతున్నారు. ఐపీఎల్‌లో ఆల్‌టైమ్ రికార్డు ధర పలికిన ఆటగాడిగా శ్రేయస్ అయ్యర్ చరిత్ర సృష్టించిన పది నిమిషాలకే రిషభ్ పంత్ నయా చరిత్ర లిఖించాడు. మెగా వేలంలో రిషభ్ పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్ రూ.27 కోట్లకు సొంతం చేసుకుంది. అయితే వేలంలో తొలుత పంత్ కోసం లక్నో సూపర్ జెయింట్స్ రూ.20.75 కోట్లు వెచ్చించడానికే సిద్ధమైంది. కానీ ఢిల్లీ క్యాపిటల్స్ తమ మాజీ కెప్టెన్‌న తిరిగి తమ ఫ్రాంచైజీలోకి ఆహ్వానించడానికి ఆర్‌టీఎమ్ కార్డ్‌ను ఉపయోగించింది. కానీ ఢిల్లీ పంత్ కోసం సాహిసించలేని మొత్తాన్ని లక్నో బిడ్ వేసింది. యాజమాన్యంతో విభేదాల కారణాంగా రిషభ్ పంత్ వేలంలోకి వచ్చినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. కానీ ఢిల్లీ పంత్ కోసం తిరిగి ప్రయత్నించడం గమనార్హం. అయితే లక్నో పర్స్ వ్యాల్యూను తగ్గించడం కోసం లక్నో ఆర్థిక వ్యూహాలతో ఆర్‌టీఎమ్ కార్డు ఉపయోగించనట్లు తెలుస్తోంది. కాగా, శ్రేయస్ అయ్యర్ కోసం పంజాబ్ కింగ్స్ రూ.26.75 కోట్లు వెచ్చించిన సంగతి తెలిసిందే. గతంలో ఐపీఎల్‌లో ఆల్‌టైమ్ రికార్డు ధర మిచెల్ స్టార్క్ (రూ.24.75 కోట్లు కేకేఆర్) ఉండేది.

**ఐపిఎల్2025**
**మెగా వేలం హైలైట్స్**

అర్ష్‌దీప్ సింగ్-రూ. 18 కోట్లు(పంజాబ్ కింగ్స్-ఆర్‌టీఎమ్)
కగిసో రబడా-రూ. 10.75 కోట్లు(గుజరాత్ టైటాన్స్)
శ్రేయస్ అయ్యర్-రూ. 26.75 కోట్లు(పంజాబ్ కింగ్స్)
జోస్ బట్లర్-రూ.15.75 కోట్లు(గుజరాత్ టైటాన్స్)
మిచెల్ స్టార్క్-రూ.11.75 కోట్లు(ఢిల్లీ క్యాపిటల్స్)
రిషభ్ పంత్- రూ.27 కోట్లు (లక్నో సూపర్ జెయింట్స్)

## శతకవీరుడిగా కోహ్లి నయా చరిత్ర ..

### సచిన్ రికార్డు బ్రేక్!



టీమిండియా మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఎట్టకేలకు సెంచరీ సాధించాడు. రెండేళ్ల నిరీక్షణ తర్వాత టెస్ట్ ఫార్మాట్‌లో శతకాన్ని అందుకున్నాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో 143 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, రెండు సిక్సర్లతో సెంచరీ బాదాడు. టెస్టు కెరీర్‌లో 30వ సెంచరీ, ఓవరాల్‌గా 81వ సారి మూడంకెల స్కోరు అందుకున్నాడు. ఈ క్రమంలో పలు అరుదైన రికార్డులు నెలకొల్పాడు. ఆస్ట్రేలియాలో అత్యధిక టెస్టు సెంచరీలు సాధించిన ఆసియా క్రికెటర్‌గా విరాట్ కోహ్లి చరిత్రకెక్కాడు. కంగారూల గడ్డపై కోహ్లి ఏడు సెంచరీలు బాదాడు. అంతకుముందు ఈ రికార్డు దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. ఆసీస్‌లో సచిన్ ఆరు శతకాలు బాదాడు. అన్ని ఫార్మాట్లలో కలిసి ఆస్ట్రేలియాలో కోహ్లికి ఇది 10వ సెంచరీ. పర్యాటక బ్యాటర్లలో మరే క్రికెటర్ ఈ ఘనత సాధించలేదు. సెంచరీ పూర్తయిన వెంటనే తన సతీమణి అనుష్క శర్మ ఉన్న గ్యాలరీ వైపు తిరిగి ఫ్లయింగ్ కిస్‌లు ఇచ్చాడు. ఈ సందర్భంగా అతని కుమారుడు అకాయ్ టీవీ కెమెరాలకు చిక్కాడు. అనుష్క శర్మ తండ్రి ఒడిలో అకాయ్ ఉన్న ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

## పంత్‌ను తీసుకోవాలని భావించలేదు



ఐపీఎల్ 2025 మెగా వేలంలో భారీ ప్రైజ్‌మనీతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్.. మార్క్యూ జాబితాలోని ముగ్గురు ఆటగాళ్లను కొనుగోలు చేసింది. టీమిండియా స్టార్ బ్యాట ర్ శ్రేయస్ అయ్యర్‌ను రూ. 26.75 కోట్ల రికార్డ్ ధరకు సొంతం చేసుకున్న పంజాబ్ కింగ్స్.. అర్ష్‌దీప్ సింగ్‌ను ఆర్‌టీఎమ్ కార్డ్ ద్వారా రూ. 18 కోట్లకు దక్కించుకుంది. వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కోసం రూ. 18 కోట్లు ఖర్చు చేసింది.పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్‌గా రికీ పాంటింగ్ బాధ్యతలు చేపట్టడంతో ఆ జట్టులోకి రిషభ్ పంత్ వెళ్తాడని జోరుగా ప్రచారం జరిగింది. కానీ ఆశ్చర్యకరంగా పంజాబ్.. శ్రేయస్ అయ్యర్ కోసం బిడ్ వేసింది. రిషభ్ పంత్‌ను పట్టించుకోలేదు. మెగా ఆక్షన్ బ్రేక్ సమయంలో మీడియాతో మాట్లాడిన పాంటింగ్‌ను ఇదే విషయంపై ప్రశ్నించగా.. ఆసక్తికర సమాధానం చెప్పాడు. రిషభ్ పంత్‌ను తాము తీసుకోవాలని భావించలేదని, అతని కోసం తీవ్ర పోటీ ఉంటుందని ముందే గ్రహించామని తెలిపాడు. శ్రేయస్ అయ్యర్ తీసుకోవాలనేది తమ ప్రణాళిక అని, అందులో భాగంగానే అతని కోసం పోటీపడ్డామని స్పష్టం చేశాడు. కెప్టెన్సీ గురించి ఇంకా శ్రేయస్ అయ్యర్‌తో మాట్లాడలేదని, వేలానికి ముందు అతనికి ఫోన్ చేస్తే ఎత్త లేదని బదులిచ్చాడు.

# లీల



## 'కల్కి 2' 35 శాతం షూట్ అయ్యింది !

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన కల్కి 2898 ఏడీ బ్లాక్ బస్టర్ హిట్ ను సాధించింది. అటు కలెక్షన్స్ లోనూ సరికొత్త రికారడ్స్ ను క్రియేట్ చేసింది. ఐతే, దీనికి కొనసాగింపుగా 'కల్కి 2' రానున్న విషయం తెలిసిందే. ఇక 'కల్కి 2' సినిమా విశేషాలు తెలుసుకునేందుకు సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా ప్రభాస్ ఫ్యాన్స్ 'కల్కి 2' అప్ డేట్స్ కోసం ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. కాగా 'ఇఫ్ఫీ' వేడుకల్లో చిత్ర నిర్మాతలు స్వప్న ప్రియాంక.. 'కల్కి 2' షూటింగ్ గురించి మాట్లాడారు. 'కల్కి పార్ట్ 2కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. కాకపోతే, రెగ్యులర్ షూట్ ఎప్పటి నుంచి స్టార్ట్ చేయాలనే దానిపై ఇంకా క్లారిటీ లేదు. త్వరలోనే అన్ని ప్రకటిస్తాం. 'కల్కి 2898 ఏడీ'లో కీలక పాత్ర పోషించిన దీపికా పదుకొణె.. పార్ట్ 2లోనూ కొన్ని సన్నివేశాల్లో అమ్మగా కనిపించనుంది' అని స్వప్న ప్రియాంక క్లారిటీ ఇచ్చారు. స్వప్న ప్రియాంక ఇంకా మాట్లాడుతూ. 'కల్కి 2898 ఏడీ'తో పాటే సీక్వె ల్ కు సంబంధించిన షూట్‌ను కొంతమేర తీయడం జరిగింది. పార్ట్ 2కు సంబం ధించి 35 శాతం షూట్ జరిగింది' అని తెలిపారు. అలాగే, గోవా వేదికగా జరుగు తోన్న 'ఇఫ్ఫీ' వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని స్వప్న ప్రియాంక చెప్పారు.




## ధనుష్‌తో యుగానికి ఒక్కడు 2




కోలీవుడ్ నటుడు కార్తీ హీరోగా నటించిన సూపర్ హిట్ తన ఎపిక్ వండర్ చిత్రం యుగానికి ఒక్కడు కూడా ఒకటి. ఈ చిత్రం అయితే మన తెలుగు ఆడియెన్స్ కి కూడా ఎంతో ఇష్టం. ఇంకా ఈ సినిమా తమిళ్ కంటే తెలుగులోనే సూపర్ గా రన్ అయ్యి అప్పట్లో మంచి వసూళ్లు అందుకుంది. అయితే ఈ చిత్రాన్ని దర్శకుడు సెల్వ రాఘవన్ తెరకెక్కించగా అప్పట్లో థియేటర్స్ లో ఈ చిత్రం క్రేజీ ట్రీట్ ఇచ్చింది. అయితే దీనికి ఫైనల్ గా సీక్వెల్ ని యుగానికి ఒక్కడు 2 గా దర్శకుడు హీరో ధనుష్ తో అనౌన్స్ చేయగా దీనిపై మంచి హైప్ నెలకొంది. అయితే అనౌన్స్ చేసి చాలా కాలం అయినప్పటికీ ఈ ఎలాంటి ప్రోగ్రెస్ కనిపించలేదు. ఓ పక్క సెల్వ రాఘవన్ నటుడుగా అలాగే ధనుష్ ఇతర చిత్రాలతో బిజీగా ఉండడంతో ఈ సినిమా అసలు ఉందో లేదో అనేది ఇంకా క్లారిటీ లేకుండా పోయింది. అయితే లేటెస్ట్ గా సెల్వ రాఘవన్ క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రం తప్పకుండా చేస్తానని ప్రామిస్ చేస్తున్నారు. అయితే దీనితో పాటుగా ధనుష్ తో మరో సీక్వెల్ చేయాల్సి ఉందని వీటికి నటీనటులు అందరినీ పర్ఫెక్ట్ గా సెట్ చేయడానికే ఏడాది పడుతుంది అని పర్సనల్ గా ఈ రెండు సినిమాలు తప్పకుండా చేయాలని ఉన్న సినిమాలు ఇవే అని సెల్వ రాఘవన్ తెలిపారు. దీనితో ఈ సినిమా అయితే ఆగిపోలేదని చెప్పాలి.

## మరో ఇంట్రెస్టింగ్ లవ్ స్టోరీతో ... సిద్ధార్థ్

హీరో సిద్ధార్థ్ నటించే సినిమాలకు ప్రత్యేక ఫాలోయింగ్ ఉంటుంది. ఆయన నటించే సినిమాలను ఖచ్చితంగా చూడాలని కొందరు భావిస్తారు. దీంతో హిట్, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా సిద్ధార్థ్ సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నాడు. ఇక ఈ హీరో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మిస్ యు' అన్ని పనులు ముగించుకుని రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమా ట్రైలర్‌ను తాజాగా రిలీజ్ చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ పూర్తిగా కమర్షియల్ అంశాలతో ఉండటంతో ఈ మూవీపై మంచి బజ్ క్రియేట్ అవుతుంది. సిద్ధార్థ్ ఈసారి ఎలాంటి ప్రయోగాలకు పోకుండా ఓ ఫక్తు రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో రాబోతున్నట్లు ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. డైరెక్టర్ కావాలని అనుకునే హీరో తాను రాసుకున్న లవ్ స్టోరీని హీరోయిన్‌కి వినిపించడం.. ఆమెతో ప్రేమలో పడటం.. ఓ పొలిటికల్ లీడర్‌తో యాక్షన్ వంటి సీన్స్ మనకు ఈ ట్రైలర్‌లో కనిపిస్తాయి. ఇక ఈ సినిమాలో కామెడీకి కూడా ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సినిమాను ఎన్.రాజశేఖర్ డైరెక్ట్ చేశారు. అందాల భామ ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు గిబ్రన్ సంగీతం అందించాడు. ఈ చిత్రాన్ని నవంబర్ 29న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

## 50 లక్షల కుటుంబాలకు చేరువలో గృహజ్యోతి విద్యుత్ కనెక్షన్లు

* ప్రభుత్వం మరో సారి అవకాశం ఇవ్వడంతో భారీగా పెరిగిన లబ్దిదారులు
* బడ్జెట్‌లో గృహజ్యోతి అమలు కోసం రూ.2418 కోట్లు కేటాయింపు
* పేదలకు ఇప్పటి వరకూ రూ.వెయ్యి కోట్ల వరకు లబ్ధి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో గృహ జ్యోతి పథకం కీలకమైనది రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ప్రతి నెలా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయడానికి ఉద్దేశించిన పథకం ఇది. 200లు లేదా అంతకంటే తక్కువ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించిన గృహావసర వినియోగదారులకు జీరో బిల్లు అందిస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న గృహజ్యోతి పథకం సత్ఫలితాలను ఇస్తోంది. రాష్ట్రంలో మొత్తం 1.20 కోట్లకు పైగా ఇళ్లలో కరెంటు వినియోగం ఉంది. వీటిలో దాదాపు 80 లక్షల ఇళ్లకు ప్రస్తుతమున్న రేషన్‌కార్డుల ప్రకారం గృహజ్యోతి పథకం వర్తిస్తుందని డిస్కంల పరిశీలనలో గుర్తించారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 50 లక్షల కుటుంబాలకు చేరువలో గృహజ్యోతి కనెక్షన్లు ఉన్నాయి. వీటి సంఖ్యను మరింత పెంచుకునే క్రమంలో ఇటీవల ఎంఎల్‌సి ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ రావడం, త్వరలోనే మరో సారి గ్రామ పంచాయతీ ఎన్నికలు వచ్చే పరిస్థితి ఉండడంతో గృహజ్యోతి విద్యుత్ వినియోగదారుల పెరిగే సంఖ్యపై క్లారిటీ రావాల్సి ఉంది. రాష్ట్రంలో తొలి నెల 43 లక్షల మందికి ఈ పథకం కింద అర్హత లభించింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ సదుపాయంతో ప్రతి కుటుంబానికి కనీసం వెయ్యి రూపాలయ వరకు కూడా భారం తగ్గుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన ఈ 11 నెలల్లోనే గృహ జ్యోతి పథకంతో వినియోగదారులకు దాదాపుగా రూ. వెయ్యి కోట్ల వరకు లబ్ధి పొందారు. గృహజ్యోతి అమలు కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 2,418 కోట్లను కేటాయించారు. గత మార్చి నెల నుండి జులై నాటికి మొత్తంగా ఒక కోటి 79 లక్షల 33 వేల 450 మంది వరకు జీరో బిల్లులను జారీ చేసింది. ఈ బిల్లులకు సంబంధించి ప్రభుత్వం మొత్తంగా రూ. 640.94 కోట్లు డిస్కంలకు చెల్లించింది. ఆగస్టు నాటికే ఈ జీరో బిల్లుల సంఖ్య రెండు కోట్లకు చేరడం గమనార్హం. తాజాగా అక్టోబర్ నెలకు సంబంధించిన బిల్లులు ఈ నెలలో జారీ అవుతున్నాయి. బిల్లింగ్ పూర్తి అయితే రెండున్నర కోట్ల జీరో బిల్లులు జారీ అయ్యే అవకాశం ఉంది. ఇలా దాదాపు రూ. వెయ్యి కోట్లకు పైగా పేద, మధ్యతరగతి వర్గాలకు లబ్ధి చేకూరినట్లు అవుతోంది. కాగా రాష్ట్రంలో గృహ జ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్‌ను పొందుతున్న కుటుంబాల సంఖ్య 50 లక్షలకు చేరువ కావడం విశేషం. ఎంఎల్‌సి ఎన్నికల తర్వాత ఇటీవల మరి కొందరికి స్థానిక శాసన సభ్యుల ఆదేశాల మేరకు పలువురికి అవకాశం ఇవ్వడంతో జీరో బిల్లులు అందుకుంటున్న వినియోగదారుల సంఖ్య భారీగా పెరిగింది. ఉదా.. జులై నాటికి గృహజ్యోతికి అర్హత కలిగిన కుటుంబాల సంఖ్య 46 లక్షల 19 వేల 235 కాగా, వీరందరికీ డిస్కంలు జీరో కరెంటు బిల్లులు జారీ చేశాయి . కాగా ఆగస్టు నాటి కి ఈ సంఖ్య 48.90 లక్షలకు చేరింది. రాష్ట్ర ప్ర భుత్వం 2024 మార్చి 1వ తేది నుంచి గృహ జ్యోతి పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. పథకం ప్రా రంభించే నాటికి 200 యూనిట్లు లోపు కరెంటు వాడుతున్న కుటుంబాల సంఖ్య 33 లక్షల 86 వేల 506 గా ఉంది.

**గృహజ్యోతి బిల్లు రూ. 3,914 కోట్లు !!**

రాష్ట్రంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడే ఇళ్ల కనెక్షన్లు ఒక కోటి 8 లక్షల 86 వేల 519 ఉన్నాయని విద్యుత్ పంపిణీ సంస్థ డిస్కం వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ ఇళ్ల నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024 25 లో విద్యుత్ బిల్లుల రూపంలో దాదాపు రూ. 3,914.36 కోట్ల ఆదాయం విద్యుత్ సంస్థలకు వస్తోంది. గృహజ్యోతి పథకం కింద ఈ ఇళ్లకు ఉచితంగా విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం ఆదేశించిన క్రమంలో ఈ బిల్లుల సొమ్మును రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా డిస్కంలకు అందజేయనుంది. నెలకు 201కి పైగా యూనిట్లకు కరెంటు వినియోగించే ఇళ్ల నుంచి రూ. 4374 కోట్ల ఆదాయం వస్తుందని సమాచారం. ఇలా రాష్ట్రంలో 1.08 కోట్ల ఇళ్లలో నెలకు 200 యూనిట్లలోపు కరెంటు వాడుతున్నా ఇవన్నీ పూర్తిగా గృహజ్యోతి పరిధిలోకి రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటే ఇవన్నీ కూడా గృహజ్యోతి పథకం కిందికి వస్తాయని విద్యుత్ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి

### సిఎంకు ఎమ్మెల్యే కూనంనేని వినతి



**ప్రజాపక్షం/భద్రాచలం :** జర్నలిస్టులకు ఇళ్లస్థలాలతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోర్త్ ఎస్టేట్‌గా, ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేస్తూ చాలీ చాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న జర్నలిస్టులకు నిలువనీడ లేని పరిస్థితులు నెలకొన్నాయని, వీరికి గూడు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సాధ్యమైనంత త్వరగా ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ముఖ్యమంత్రిని ఆయన కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీలైనంత త్వరగా చర్యలు చేపడతామని హామి ఇచ్చానట్లు కూనంనేని తెలిపారు.




**సైబర్ నేరాలపై ఎస్‌బిఐ క్యాంపెయిన్**

సైబర్ మోసాలపై హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఆదివారం జరిగిన అవగాహనా కార్యక్రమం. పెరుతున్న సైబర్ మోసాలను గురించి ప్రజలకు వివరించేందుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పార్కులు, రైల్వే స్టేషన్లు, ఇండోర్ స్టేడియమ్‌లు, రీటెయిల్ అవుట్‌లెట్లు, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, పెన్షనర్ల సంఘాల వద్ద ఈ అవగాహనా కార్యక్రమాలను ఎస్‌బిఐ చేపట్టింది. ఈ క్యాంపెయిన్‌కు అన్ని వర్గాల నుంచి భారీ స్పందన లభిస్తున్నది. డిజిటల్ అరెస్టు వంటి పలు అంశాలను ప్రజలకు ఎస్‌బిఐ ప్రతినిధులు వివరిస్తున్నారు.

## పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు టి-సాట్ 'జనరల్ స్టడీస్ ఫర్ ఆల్' కార్యక్రమం

* ఐదు నెలలు, 600 ఎపిసోడ్స్ పోటీ పరీక్షల పాఠ్యాంశాలు
* ప్రతీ రోజూ రెండు గంటల ప్రత్యేక ప్రసారాలు..

టి సాట్ సిఈఒ వేణుగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ నిరుద్యోగ యువతకు టిసాట్ (తెలంగాణ స్కిల్ అకడమిక్ ట్రైనింగ్) నెట్ వర్క్ అనునిత్యం అండగా నిలుస్తోంది. పోటీ పరీక్షలు ఏవైనా వాటికి యువతను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోంది. ఆ ప్రయత్నంలో భాగంగానే 'జనరల్ స్టడీస్ ఫర్ ఆల్' పేరుతో అన్ని పోటి పరీక్షలకూ ఉపయోగపడే కంటెంట్ నేడు సోమవారం నుండి ప్రసారం చేయాలని నిర్ణయించినట్లు టిసాట్ సిఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి పోటీ పరీక్షకూ కంటెంట్ అందిస్తున్న టి సాట్ నెట్ వర్క్ కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వహించే పోటి పరీక్షలకు ఎల్లవేళలా పోటి పరీక్షల కంటెంట్ అందించిన ఏకైక సంస్థగా పేరుతెచ్చుకుందని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. పోటి పరీక్షల అవగాహన పాఠ్యాంశాల ప్రసారాల్లో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సుమారు 600 ఎపిసోడ్స్ 10 సబ్జెక్టులకు సంబంధించి 500 రోజులు కంటెంట్ ప్రసారం చేస్తున్నామని సిఈఓ ప్రకటించారు. టిసాట్ నిపుణ ఛానల్ లో మధ్యాహ్నం 12 నుండి ఒంటి గంట, మూడు నుండి నాలుగు గంటల వరకు, విద్య ఛానల్ లో అదే రోజు రాత్రి ఎనిమిది నుండి 10 గంటల వరకు పున:ప్రసారమవుతాయని అన్నారు. పోటి పరీక్షల్లో ప్రధాన సబ్జెక్టులైన తెలంగాణ ఉద్యమం, ఇండియన్ హిస్టరీ, మ్యాథ్స్, జాగ్రఫీ వంటి సబ్జెక్టులతో పాటు సోషల్ ఎక్స్ క్లూజన్, జనరల్ ఇంగ్లీష్ వంటి ప్రత్యేక సబ్జెక్టులకు సంబంధించిన కంటెంట్ ప్రసారం చేస్తున్నామని ఆయన వివరించారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన తాము చేస్తున్న ఈ ప్రయత్నాలు విజయవంతం కావాలంటే పోటి పరీక్షలకు హాజరయ్యే యువత తాము ప్రసారం చేసే పాఠ్యాంశాలను సరైన విధంగా ఉపయోగించుకోవాలని సూచించారు. టిసాట్ ప్రసారాలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంలో మంచి తోడ్పాటు అందించాయని ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తుంటే తమ ప్రయత్నాలకు మంచి ఫలితాలు వస్తున్నాయన్న ఆనందం కలుగుతోందని వేణుగోపాల్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు.

## 9 రోజులు వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను విజయోత్సవాల్లో చేపడుతారు. గోషామహల్‌లో నిర్మించనున్న ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనానికి శంకుస్థాపన చేస్తారు. ఆరంఘర్ జూపార్క్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభిస్తారు. ఇటీవల నిర్మాణం పూర్తయిన ఆరు ఎస్‌టీపీలను ప్రారంభిస్తారు. హెచ్‌సిటి ప్రాజెక్టులో భాగంగా చేపట్టే వివిధ పనులకు కూడా శంకుస్తాపన చేయనున్నారు. వీటితో పాటు కెబిఆర్ పార్కు సమీపంలో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లతో ఆరు జంక్షన్లను అభివృద్ధి చేసే రూ.826 కోట్ల భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతారు. హైదరాబాద్‌లో శిల్పకళా వేదిక సమీపంలో దాదాపు 106 స్టాళ్లతో ఇందిరా శక్తి మహిళా బజార్‌ను ప్రారంభిస్తారు. తెలంగాణ ఫారెస్ట్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ భవనానికి పునాది రాయి వేస్తారు. వీటితో పాటు అటవీ పర్యాటక శాఖల అధ్వర్యంలో సఫారీ థీమ్ పార్క్, బొటానికల్ గార్డెన్లను ప్రారంభిస్తారు. ఘట్‌కేసర్‌లో బాలికలకు ప్రభుత్వ ఐటిఐ, అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే పనులు జరుగుతున్న మల్లేపల్లి, మేడ్చల్, నల్లగొండ ఎటిసిలను ప్రారంభిస్తారు. దామరచర్లలో యాదాద్రిలో థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల ఒక యూనిట్‌ను జాతికి అంకితం చేస్తారు. దీంతో పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 237 సబ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తరగతులను ప్రారంభిస్తారు. కొత్తగా ప్రభుత్వం తలపెట్టిన స్పోర్ట్ యూనివర్సిటీకి శంఖుస్థాపన నిర్వహిస్తారు. ఐటి, పరిశ్రమల శాఖ అధ్వర్యంలో ఎఐ సిటీ ఏర్పాట్లతో పాటు పలు ఒప్పందాలు జరగనున్నాయి. విజయోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కాలేజీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. అన్ని స్థాయిల్లోని విద్యార్థులు ఈ వేడుకలు జరుపుకునేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. శాఖల వారీగా నిర్ణీత ప్రణాళిక ప్రకారం సంబంధిత మంత్రుల సారథ్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వివిధ జిల్లాల ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, ఎంపిలు మంత్రులతో పాటు ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com